thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 32 కరీంనగర్ శనివారం, 12 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఓటరు కార్డుకు ఆధార్, మొబైల్ లింక్

న్యూఢిల్లీ : ఓటర్ల గుర్తింపు సక్రమంగా జరిగేలా ఓటరు గుర్తింపు కార్డులను ఆధార్, మొబైల్ నంబర్లతో లింక్ చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీఐ) అధికారులను ఆదేశించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్య ఎన్నికల అధికారుల(సీఈవోల)కు సర్క్యులర్‌ను ఈసీఐ జారీ చేసినట్టు తాజాగా ఒక ఆంగ్ల పత్రిక వెల్లడించింది. దీంతోపాటు ఈనెల 4న నిర్వహించిన సీఈవోల కాన్ఫరెన్స్‌లో 'ఓపెన్ రిమార్క్స్ ఆఫ్ సీఈసీ' పేరిట సీఈవోలందరికీ పంపిణీ చేసిన పత్రాల్లోనూ అవే ఆదేశాలు ఉన్నాయని, ఆ ఆదేశాలను అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు సర్క్యులేట్ చేయాలని సీఈవోలకు నిర్దేశించారని పేర్కొంది. 'ఓటర్ల గుర్తింపు సక్రమంగా ఉండేందుకు ఓటరు కార్డుతో ఆధార్, మొబైల్ నంబర్లను అనుసంధానించే అన్ని ప్రయత్నాలూ చేయాలి' అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసినట్టు తెలిపింది.





## సీఎం రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం..

# ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో

## ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్ : రానున్న వందేళ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్‌కు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. రీజినల్ రింగ్ రోడ్డు సమీపంలో సరైన ప్రాంతంలో డ్రైపోర్ట్ ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం, ఆర్ఆర్ఆర్ పనుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ శుక్రవారం ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు.

**హైదరాబాద్ - విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి...** ఇటీవల రాష్ట్ర పునర్విభజన అంశాలపై ఢిల్లీలో జరిగిన తెలంగాణ, ఏపీ అధికారుల సమావేశంలో హైదరాబాద్ - విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ ఆమోదం తెలపాలని కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఆదేశించిన నేపథ్యంలో ఆ పనులపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించిన భూ సేకరణ పూర్తి చేయాలని, దక్షిణ భాగం డీపీఆర్ కన్సల్టెన్సీ నివేదికను త్వరగా పూర్తి చేయాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. హైదరాబాద్ నగరాన్ని ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌తో అనుసంధానించేలా జాతీయ రహదారికి ప్రతిపాదనలు తయారు చేసి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు పంపించాలని ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై ముఖ్యమంత్రి రేవంత్ ఆరా తీశారు. పలు చోట్ల పంటలు ఉన్నాయని, పంట నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్‌హెచ్ఏఐ అంగీకరించడం లేదని అధికారులు వివరించారు. పంట కాలం దాదాపు పూర్తవుతున్నందున ఆ వెంటనే రైతులతో మాట్లాడి భూ సేకరణ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. భూ సేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఆయా జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడాలని, సాంకేతిక, న్యాయ సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి సూచించారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు రేడియల్ రోడ్లు, ఆర్ఆర్ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న రహదారుల విస్తరణపైనా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో...** మరోవైపు, హైదరాబాద్ మెట్రో విస్తరణపైనా సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఫ్యూచర్ సిటీ వరకు మెట్రోను విస్తరించాలని ఆదేశించారు.


ఇందు కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. మెట్రో రెండో దశ ప్రతిపాదనలు, కేంద్రం అనుమతులపైనా సమీక్షించారు. ఇందుకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అధకారులను సీఎం ఆదేశించారు.




## భూ భారతి ఆవిష్కరణకు డేట్ ఫిక్స్..

హైదరాబాద్ : తెలంగాణ భూ భారతి(రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్స్) యాక్ట్, 2025 ఆవిష్కరణకు డేట్ ఫిక్స్ అయ్యింది. ఈ నెల 14న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లాంచ్ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భూ భారతి చట్టం ప్రొవిజన్స్‌తో కొత్త పోర్టల్‌ని ప్రారంభించనున్నారు. రాజ్యాంగ నిర్మాణ అంబేద్కర్ జయంతి రోజునే సామాన్య రైతులకు మేలైన సేవలందించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. శిల్ప కళావేదికలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్లను సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ ఆదేశించారు.

## హైదరాబాద్‌లో హనుమాన్ శోభాయాత్ర.. ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..!






ఏప్రిల్ 12వ తేదీన హనుమాన్ జయంతి సందర్భంగా హైదరాబాద్ నగరంలో ఘనంగా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఈ శోభాయాత్ర గౌలిగూడలోని శ్రీ రామమందిరం వద్ద ఉదయం 11 గంటలకు ప్రారంభమై, నగరంలోని పలు కీలక ప్రాంతాల గుండా సాగుతూ తాడ్‌బండ్‌లోని శ్రీ హనుమాన్ మందిరం వద్ద ముగుస్తుంది. శోభాయాత్ర మార్గం పుత్లిబౌలి క్రాస్ రోడ్స్, ఆంధ్రా బ్యాంక్ క్రాస్ రోడ్స్, కోఠి, సుల్తాన్ బజార్ క్రాస్ రోడ్స్, రామ్‌కోఠి క్రాస్ రోడ్స్, కాచిగూడ క్రాస్ రోడ్స్, నారాయణగూడ వైఎంసీఏ, చిక్కడపల్లి క్రాస్ రోడ్స్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, అశోక్ నగర్, గాంధీ నగర్ బ్యాక్ సైడ్ వైశ్రాయ్ హోటల్, ప్రాగా టూల్స్, కవాడిగూడ, సీజీవో టవర్స్, బన్సీలాల్‌పేట రోడ్, బైబిల్ హౌస్, సిటీ లైట్ హోటల్, బాటా షోరూమ్, ఉజ్జయిని మహంకాళి టెంపుల్, ఓల్డ్ రామ్‌గోపాల్‌పేట రోడ్, పారడైజ్ క్రాస్ రోడ్స్, సీటీవో జంక్షన్, లీ రాయల్ ప్యాలెస్, బ్రూక్ బాండ్, ఇంపీరియల్ గార్డెన్, మస్తాన్ కేఫ్ మీదుగా సాగుతూ తాడ్‌బండ్‌లోని హనుమాన్ టెంపుల్‌కు చేరుకుంటుంది. ఈ శోభాయాత్ర సజావుగా సాగేందుకు పోలీసు శాఖ శనివారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించింది. ఈ రహదారులపై ప్రయాణించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా లక్డీకాపూల్ నుంచి సికింద్రాబాద్ స్టేషన్, ఉప్పల్ వైపు వెళ్లే వాహనదారులు వీవీ స్టాచ్యూ, సోమాజిగూడ, గ్రీన్ ల్యాండ్స్, బేగంపేట్ ఫ్లై ఓవర్, ప్రకాశ్ నగర్ ఫ్లై ఓవర్, పారడైజ్ ఫ్లై ఓవర్ మీదుగా సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకోవాలని సలహా ఇచ్చారు. ఈ శోభాయాత్రలో భక్తుల భద్రత , ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసు శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది, కాబట్టి నగరవాసులు ఈ ఆంక్షలకు సహకరించి, హనుమాన్ జయంతి వేడుకలు సాంతం సజావుగా జరిగేలా తోడ్పడాలని అధికారులు కోరుతున్నారు.

# 'పలుకుబడి'

## అమాంతం పెరిగినట్లుంది!

## హైకమాండ్ వద్ద రేవంత్ మార్కులు కొట్టేశారా ?



హైదరాబాద్ : కాంగ్రెస్ హైకమాండ్ వద్ద ఎవరికైతే పలుకుబడి ఉంటుందో వారి అధికారానికి పదవులకు అంతకు అంత ఆయుష్షు పెరుగుతుంది కాంగ్రెస్ లో గతంలో ఉన్న తీరున ఇపుడు లేదు. అప్పట్లో అయితే ప్రతీ ఆరు నెలలకూ ఒక సీఎం మారిపోయే సీన్ ఉండేది. దాని వల్ల రాజకీయంగా నష్టం ఎంతో ఉందని తర్వాత కాలంలో తెలుసుకున్న కాంగ్రెస్ తగిన జాగ్రత్తలు తీసుకుంది. దాని వల్ల ఫుల్ టైం సీఎంలుగా చేసిన వారు కూడా కాంగ్రెస్ లో అనేక మంది ఉంటూ వచ్చారు. ఇక కాంగ్రెస్ కి ఇపుడు చూస్తే దేశంలో సొంతంగా మూడు రాష్ట్రాలలోనే అధికారం ఉంది. అందులో హిమాచల్ ప్రదేశ్ చిన్నది, సౌత్ లో చూస్తే కర్ణాటక, తెలంగాణా ఉన్నాయి. కర్ణాటకలో సీనియర్ మోస్ట్ లీడర్ గతంలో అయిదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న సిద్ధరామయ్య సీఎం గా ఉన్నారు. తెలంగాణాలో చూస్తే డైనమిక్ లీడర్ గా రేవంత్ రెడ్డి ఉన్నారు. ఆయన గత పదహారు నెలలుగా సీఎం గా మంచి స్పీడ్ తోనే పనిచేస్తున్నారు. ఎప్పటికప్పుడు హైకమాండ్ మనసు తెలుసుకుని దానిని అనుగుణంగా ఆయన పనిచేస్తున్నారు. కులగణనను జరిపిన స్టేట్ గా తెలంగాణాను ముందుంచిన రేవంత్ రెడ్డికి హైకమాండ్ వద్ద బాగానే గుర్తింపు ఉంది. ఇక ఏఐసీసీ మీటింగ్స్ లో రాహుల్ గాంధీ కూడా తన ప్రసంగంలో రేవంత్ రెడ్డి ప్రస్తావన తెచ్చారు. తెలంగాణాలో కుల గణన జరిపి బీసీలకు 42 శాతం రిజవేషన్లు ఇస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిల్లుని కేంద్రానికి పంపిస్తే దాని మీద ఏ రకమైన చర్యలు తీసుకోలేదని ఆక్షేపించారు. ఒక విధంగా చూస్తే ఏఐసీసీ మీటింగ్స్ లో ప్రత్యేకంగా రేవంత్‌రెడ్డి ప్రస్తావను అగ్ర నేత రాహుల్ గాంధీ తీసుకుని రావడం అంటే ఆయనకు ఎంతో గుర్తింపు ఇస్తున్నట్లుగానే చూస్తున్నారు. ఒక విధంగా చూస్తే రేవంత్ రెడ్డి యంగ్ అండ్ డైనమిక్ లీడర్ అని కాంగ్రెస్ అగ్ర నేతలు ఆయనకు మద్దతుగా ఉన్నారని అనేక సందర్భాలలో రుజువు అయింది ఇలా ఒక పార్టీ మీటింగులో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అతి పెద్ద డిమాండ్ అయిన కుల గణన ను అమలు చేసి చూపించిన సీఎం గా కనిపించడం అంటే ఆయన పలుకుబడి బాగా పెరిగింది అని అంటున్నారు.

అంతే కాదు రేవంత్ రెడ్డి ఇదే వేదిక మీద నుంచి కాంగ్రెస్ పెద్దలు మెచ్చేలా పవర్ ఫుల్ స్పీచ్ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణాలో బీజేపీని ఎట్టి పరిస్థితుల్లో అడుగుపెట్టనిచ్చేది లేదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణాలో బీజేపీకి చోటు లేదని రేవంత్ రెడ్డి బిగ్ సౌండ్ చేశారు. బీజేపీని తాము అడ్డుకుని తీరుతామని ఆయన అన్నారు. ఈ విధంగా కాంగ్రెస్ పెద్దలకు నచ్చేలా ఒక రేంజి ఫైర్ తో రేవంత్ చేసిన స్పీచ్ కి కూడా బాగానే మార్కులు పడ్డాయని అంటున్నారు. అయితే రేవంత్ రెడ్డి బీజేపీని విమర్శించడం మీద ఏపీ బీజేపీ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఘాటుగా రిప్లై ఇచ్చారు. కాంగ్రెస్ పెద్దల మెప్పు కోసం రేవంత్ రెడ్డి ఈ విధంగా బీజేపీ మీద విమర్శలు చేశారని అన్నారు. బీజేపీని అడ్డుకోవడం గాంధీ కుటుంబం వల్లనే కాలేదు, రేవంత్ రెడ్డి వల్ల ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. మొత్తానికి చూస్తే గుజరాత్ వేదికగా రెండు రోజుల పాటు సాగిన కాంగ్రెస్ ఏఐసీసీ మీటింగ్స్ లో రేవంత్ రెడ్డి అట్రాక్షన్ గా కనిపించారు. అంతే కాదు ఆయన పార్టీ పెద్దల వద్ద కూడా మంచి మార్కులు కొట్టేశారు అని అంటున్నారు.

చురకలు

శనివారం 12 ఏప్రిల్ 2025





# సీఎం రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం.. నెక్లెస్ రోడ్‌లో ఫూలే విగ్రహం

హైదరాబాద్ : మహాత్మా జ్యోతిబా ఫూలే విగ్రహం ఏర్పాటు విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఫూలే జయంతి రోజే హైదరాబాద్ నెక్లెస్ రోడ్ ఐమాక్స్ సమీపంలో ఆయన విగ్రహ ఏర్పాటుకు ఇవాళ సీఎం రేవంత్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, బీసీ సంఘాల నేతలు జాజుల శ్రీనివాస్‌గౌడ్, తదితరులతో కలిసి సీఎం స్థలాన్ని పరిశీలించారు. స్టాచ్యూ స్థలం కోసం సర్వే చేసి పూర్తిస్థాయి ప్రణాళికలతో నివేదికను అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. భవిష్యత్‌లో ట్రాఫిక్ తదితర సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుని డిజైనింగ్ రూపకల్పన చేయాలని చేయాలని సూచించారు.

**ఫూలే విగ్రహానికి పూలమాల వేసి..** ఇవాళ మహాత్మా జ్యోతిబా ఫూలే జయంతి సందర్భంగా అంబర్‌పేటలో ఆయన విగ్రహానికి సీఎం రేవంత్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీలు వీహెచ్, అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, నియోజకవర్గ ఇన్‌చార్జి రోహిన్‌రెడ్డి, తదితరులలు పాల్గొన్నారు.





హైదరాబాద్: విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) అమలుపై దాఖలైన పిల్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం అమలు చేయాలని సామాజిక కార్యకర్త తాండవ యోగేశ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆర్‌టీఈ వచ్చి 16 ఏళ్లు గడుస్తున్నా విద్యార్థులకు అందుబాటులోకి రాలేదని తెలిపారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఇప్పటికే విద్యాహక్కు చట్టం అమలులో ఉందని గుర్తుచేశారు. దీని ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలని పిటిషనర్ కోరారు. మరోవైపు గతేడాది అక్టోబర్‌లో విద్యాహక్కు చట్టంపై హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇచ్చింది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి దీన్ని అమల్లోకి తెస్తామని అందులో పేర్కొంది. దీని అమలుకు సంబంధించిన పురోగతిపై అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీజే ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.




## వరంగల్‌లో మెగా జాబ్ మేళా.. పోటెత్తిన నిరుద్యోగులు

**వరంగల్ తూర్పు నియోజకవర్గంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగులు పోటెత్తారు. జిల్లా రైల్వే స్టేషన్ సమీపంలోని ఎంకే నాయుడు కన్వెన్షన్ హాలులో జాబ్‌మేళాను మంత్రులు కొండా సురేఖ, సీతక్క ప్రారంభించారు. యువతీ, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి వివిధ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. హాలు లోపలికి వెళ్లే క్రమంలో ఉద్యోగార్థులు పోటీ పడటంతో స్వల్పంగా తోపులాట జరిగింది.**

## రజతోత్సవ సభకు అనుమతి నిరాకరణపై హైకోర్టుకు భారాస.. విచారణ వాయిదా



హైదరాబాద్: ఎల్కతుర్తిలో భారాస రజతోత్సవ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఆ పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ నెల 17కి వాయిదా వేసింది. సభకు అనుమతిచ్చేలా పోలీసులను ఆదేశించాలంటూ భారాస నేతలు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 27న ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా దీన్ని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ తరఫు న్యాయవాది పేర్కొన్నారు.

హోంశాఖ ముఖ్య కార్యదర్శి, వరంగల్ సీపీ, కాజీపేట ఏసీపీని భారాస ప్రతివాదులుగా చేర్చింది. దీంతో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయడానికి హోంశాఖ తరఫు న్యాయవాది సమయం కోరారు. ఈ నెల 21 వరకు గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సభకు ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది కదా అని హైకోర్టు ప్రశ్నించింది. ఈ నెల 17 నాటికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

## ఆ నిర్ణయంపై తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన చేయాలి: వెంకయ్య నాయుడు



హైదరాబాద్: తెలంగాణలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా సంస్కృతం అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వచ్చిన వార్తలు విని విచారించానని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మార్కుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకుంటే మాత్రం పునరాలోచన చేయాలని కోరారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. "విద్యార్థులను మన మాతృభాషకు దూరం చేయడం మంచిది కాదు. సంస్కృతాన్ని బోధించడంలో తప్పు లేదు.. అదే సమయంలో మనదైన సంస్కృతిని అందిపుచ్చుకునే దిశగా అమ్మ భాష ఆలంబనగా నిలుస్తుంది. అందుకే జాతీయ విద్యావిధానం - 2020 సైతం దానికి ప్రాధాన్యత ఇచ్చింది. ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకుని, విద్యార్థులను మాతృభాషకు మరింత చేరువ చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆకాంక్షిస్తున్నాను" అని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.




హైదరాబాద్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 3డీ మంత్ర (మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడం) అమలు చేస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కంచ గచ్చిబౌలిలో జరిగిన పర్యావరణ విధ్వంసాన్ని చూసి దేశం మొత్తం విస్తుపోయిందన్నారు. ఆ 400 ఎకరాలు అటవీ భూమేనని.. సుప్రీంకోర్టు తీర్పుల ఆధారంగా ఆ విషయాన్ని చెబుతున్నానని తెలిపారు. రేవంత్ ప్రభుత్వం ఆర్థిక నేరానికి తెరలేపిందని, రూ.10వేల కోట్ల కుంభకోణానికి ప్రయత్నిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. సీఎంకు భాజపాకు చెందిన ఓ ఎంపీ వెనుక నుంచి పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారన్నారు. ఓ బ్రోకరేజ్ కంపెనీతో సంప్రదింపులు జరిపారని చెప్పారు. ఎఫ్ఆర్‌బీఎంను బైపాస్ చేసి డబ్బులు ఇస్తామని..ఆ తర్వాత భూములు అమ్ముకోవచ్చని ఆ కంపెనీ తెలిపిందన్నారు. దీనికోసం అన్ని చట్టాలు, సుప్రీంకోర్టు తీర్పులు, ఆర్‌బీఐ నిబంధనలను తుంగలో తొక్కారని కేటీఆర్ ఆరోపించారు. "తనకు అండగా నిలబడిన భాజపా ఎంపీకి సీఎం రేవంత్ అనుచిత లబ్ధి చేకూరుస్తున్నారు. కుంభకోణానికి సహకరించిన ఎంపీ పేరు వచ్చే ఎపిసోడ్‌లో బయటపెడతా. నిర్దిష్టమైన ఆధారాలతో కేంద్రానికి లేఖలు రాస్తాను. ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రికి తెలియకుండా ఇదంతా జరిగిందని అనుకుంటున్నా. రేవంత్‌రెడ్డి తెరతీసింది కేవలం ఈ 400 ఎకరాలకు మాత్రమే కాదు.. రూ.60వేల కోట్ల విలువైన హెచ్‌ఎండీఏ భూముల ద్వారా దోపిడీకి స్కెచ్ వేశారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే దీనిపై దర్యాప్తునకు ఆదేశించాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.




హైదరాబాద్: తెలంగాణలో అసమర్థ, అవినీతి, అసత్య ప్రభుత్వం నడుస్తోందని.. ఆర్థిక క్రమశిక్షణ లేని జీరో పరిపాలన సాగుతోందని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. ఏడాదిన్నర పాలనలో పుష్ప, హైడ్రా, మూసీ, హెచ్‌సీయూ మీద పడ్డారు తప్పితే ఇచ్చిన హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఎంపీ అర్వింద్.. ప్రభుత్వ పరిపాలనా తీరుపై విమర్శలు గుప్పించారు. "ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, విద్యా భరోసా కార్డు, చేయూత, ఆరోగ్యశ్రీ, లక్ష రూపాయలు, తులం బంగారం.. ఇలా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నీ విస్మరించారు. ఒక్క రోడ్డు వేయలేదు.. ఒక తూము కట్టలేదు. సీఎం రేవంత్ రెడ్డి గ్రాఫ్ పడిపోతోంది. మాజీ సీఎం కేసీఆర్ పక్కన ఉన్న దొంగలే రేవంత్ రెడ్డి పక్కనా ఉన్నారు. రేవంత్ రెడ్డిని కేసీఆర్ జైలులో వేస్తే.. రేవంత్ కనీసం ప్రయత్నం కూడా చేయడం లేదు. ప్రతిపక్షం ఫామ్‌హౌస్‌లో పడుకుంది. ప్రతిపక్ష పదవి ఎందుకు తీసుకున్నారు?కేసీఆర్ వ్యవస్థను విధ్వంసం చేసి దోచుకుతిన్నారు. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి భయపెట్టిస్తున్నారు..

బుల్డోజర్లు పంపిస్తున్నారు. భాజపా నేతలను తెలంగాణలో కాళ్లు పెట్టనివ్వనని రేవంత్ రెడ్డి అహ్మదాబాద్‌లో అన్నారు. లేటెస్టుగా మల్క కొమురయ్య, అంజిరెడ్డి కాళ్లు పెట్టారు. ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేసి దిల్లీకి పంపడం తప్పితే.. అవినీతికి పాల్పడిన కేసీఆర్ కుటుంబం మీద చర్యలు తీసుకోవడం లేదు. రేవంత్ రెడ్డిని మార్చాలని అధిష్ఠానం చూస్తోంది" అని అర్వింద్ పేర్కొన్నారు.

## కేసీఆర్ ప్రభుత్వం వేల ఎకరాలను తన వారికి కట్టబెట్టింది: మహేశ్‌కుమార్‌గౌడ్



హైదరాబాద్: పదేళ్ల పాలనలో గత భారాస ప్రభుత్వం వేల ఎకరాలను విక్రయించిందని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం వేల ఎకరాలను తన వారికి కట్టబెట్టిందని విమర్శించారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. "గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ చుట్టూ ఉన్న వేల ఎకరాలను కేసీఆర్.. తన వారికి అప్పనంగా అమ్ముకున్నారు. కంచ గచ్చిబౌలి భూముల గురించి పదేళ్లలో ఎందుకు పోరాడలేదు. హెచ్‌సీయూ భూములైతే.. కోర్టు వివాదంలో ఉన్నప్పుడు ఎందుకు పట్టించుకోలేదు? ఐఎంజీ సంస్థ బిల్లీరావుతో కమీషన్ మాట్లాడుకొని భూముల గరించి పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక సుప్రీంకోర్టులో పోరాడి 400 ఎకరాలను సాధించాం. ఈ ప్రభుత్వం కాపాడకుంటే 400 ఎకరాల భూమి ఐఎంజీ చేతికి వెళ్లి ఉండేది. బిల్లీరావుతో మాట్లాడుకున్న రూ. వేల కోట్ల కమీషన్ పోయిందనే అక్కసుతోనే కేటీఆర్ మాట్లాడుతున్నారు. ఏ ప్రభుత్వం అయినా ఒక సంస్థ ద్వారానే రుణాలు సేకరిస్తుంది. కోకాపేటలో వేల ఎకాలను రూ.100 కోట్లకు ఎకరం చొప్పున అమ్ముకోలేదా? టీజీఐఐసీ ద్వారా తీసుకున్న రూ.10వేల కోట్ల రుణాలతో రైతులకు రుణమఫీ చేసింది ఈ ప్రభుత్వం. భారాస ప్రభుత్వం వేల ఎకరాలు అమ్ముకున్నప్పుడు పర్యావరణం గుర్తుకురాలేదా? పదేళ్లలో లక్ష ఎకరాలను డీఫారెస్ట్ చేసి అమ్ముకున్నారు. 400 ఎకరాల భూముల్లో కంపెనీలు నిర్మిస్తే.. రాష్ట్ర ప్రజలకు లక్షల ఉద్యోగాలు వస్తాయి. పదేళ్లలో భారాస చేసిన భూదోపిడీపై బహిరంగ చర్చకు కేటీఆర్ సిద్ధమా?" అని మహేశ్‌కుమార్‌గౌడ్ సవాల్ విసిరారు.



## తెలంగాణలో పలు జిల్లాలకు వర్ష సూచన.. ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్: తెలంగాణలోని పలు ప్రాంతాల్లో శుక్ర, శనివారాల్లో వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి, ములుగు, భూపాలపల్లి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. శుక్రవారం కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది.

## ఈడీకి ప్రాథమిక హక్కులుంటే.. ప్రజల గురించి ఆలోచించాలి: సుప్రీం కోర్టు

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ప్రాథమిక హక్కులుంటే.. ప్రజల ప్రాథమిక హక్కుల గురించి కూడా ఆలోచించాలని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. నాగరిక్ అపుర్తి నిగమ్ (ఎన్‌ఏఎన్) స్కామ్ దర్యాప్తును ఛత్తీస్‌గఢ్ నుంచి దిల్లీకి బదిలీ చేయాలని ఈడీ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 అనేది వ్యక్తుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లిన సమయంలో కోర్టులను ఆశ్రయించి వాటిని పునరుద్ధరించుకోవడానికి అవకాశం కల్పిస్తుందని బెంచ్ పేర్కొంది. రాజ్యాంగం ద్వారా పరిష్కారాలు పొందే హక్కును కల్పిస్తుందని గుర్తు చేసింది. బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసిన తర్వాత సోలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు స్పందిస్తూ.. పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతి కోరారు. అదే సమయంలో మాట్లాడుతూ "ఈడీకి కూడా ప్రాథమిక హక్కులు ఉంటాయి" అని వ్యాఖ్యానించారు. దీనికి బెంచ్ స్పందిస్తూ "ఈడీకి ప్రాథమిక హక్కులు ఉంటే.. అది ప్రజల ప్రాథమిక హక్కుల గురించి కూడా ఆలోచించాలి" అని చురకలు అంటించి.. పిటిషన్ ఉపసంహరణకు అనుమతించింది. ఈ కేసులో నిందితుడైన మాజీ ఐఏఎస్ అధికారికి గతేడాది మంజూరైన ముందస్తు బెయిల్ దుర్వినియోగమైందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించింది.

దీనికి తోడు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన కొన్ని ఏజెన్సీలు ఓ హైకోర్టు జడ్జితో టచ్‌లో ఉంటున్నాయని పేర్కొంది. దీంతో మనీలాండరింగ్ కేసులోని కొందరు నిందితులకు న్యాయపరంగా ఉపశమనం కల్పిస్తున్నాయని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అప్పట్లో ఈ ఆరోపణలు సంచలనం సృష్టించాయి. ఈ కేసులో అత్యున్నత స్థాయి వ్యక్తులకు కేటాయించిన ముందస్తు బెయిళ్లను కూడా రద్దు చేయాలని ఈడీ కోరుతోంది. దీంతోపాటు కేసును దిల్లీకి బదిలీ చేయాలని పిటిషన్ దాఖలు చేసింది. ఛత్తీస్‌గఢ్‌లో ప్రజాపంపిణీ వ్యవస్థ కార్యక్రమాలను పర్యవేక్షించే నాగరిక్ అపుర్తి నిగమ్ కార్యాలయాలపై 2015లో రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ దాడులు చేసి.. రూ.3.6 కోట్ల నగదు స్వాధీనం చేసుకొంది. బియ్యం నమూనాలు చాలా నాసిరకంగా ఉన్నట్లు గుర్తించింది. అవి అసలు మనుషులు తినేలా లేవని తేల్చింది. నాడు ఈ సంస్థకు అనిల్ తుతేజా ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు.

# ఇంజినీర్లకు స్ఫూర్తి ప్రదాత మోక్షగుండం - ఏప్రిల్ 12... విశ్వేశ్వరయ్య వర్ధంతి




నేడు మన దేశం సుభిక్షంగా పంట, పొలాలతో... వరద ముంపులేని ప్రాంతాలతో తులతూగడానికి కారణం ఓ మహామనిషి కృషి. ఊళ్లకు ఊళ్లనే తన గర్భంలో కలిపేసుకునే ఉగ్ర గంగను ఆపిన మహా శక్తివంతు డాయన. ఏడుకొండల వాడా... ఎక్కడున్నావయ్యా.. అంటూ అలసిసొలసిన భక్తునికి వేంకటేశుని పాదాల చెంతకు వెళ్లే అతి తేలికైన దారిని చూపించిన మహామేధావి. ఆయనే సుప్రసిద్ధ ఇంజనీర్, పండితుడు, ప్రముఖ అధికారి, మోక్షగుండం విశ్వేశ్వరయ్య. మూడు దశాబ్దాల క్రితం మోక్షగుండం నుంచి ఆయన కుటుంబీకులు మైసూరుకు వలస పోయినా, వారి జన్మస్థలి నామధేయ మైన మోక్షగుండం మాత్రం వారి వెన్నంటే వెళ్లి, మోక్షగుండం వారి ఇంటిపేరు అయింది. మోక్షగుండం గౌరవార్థం, ఆయన పుట్టిన రోజుని ఇంజనీర్ల దినోత్సవముగా జరుపుతారు. మోక్ష గుండం విశ్వేశ్వరయ్య (సెప్టెంబర్ 15, 1861 ఎ ఏప్రిల్ 12, 1962), గొప్ప ఇంజనీరు, పండితుడు, రాజనీతిజ్ఞుడు. 1912 నుండి 1919 వరకు మైసూర్ దివాన్ గా పనిచేశారు. 1955లో ఆయనకు భారతదేశపు అత్యున్నత పురస్కారమైన "భారతరత్న" లభించింది. ప్రజలకు చేసిన సేవలకు గాను బ్రిటిష్ ప్రభుత్వం తరపున "ఐదవ కింగ్ జార్జి నైట్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్" బిరుదునిచ్చి సత్కరించాడు. విశ్వేశ్వరయ్య 1861, సెప్టెంబరు 15న బెంగుళూరు నగరానికి 60 మైళ్ళ దూరంలోగల చిక్క బళ్ళాపూర్ తాలూకా, ముద్దెనహళ్ళి అనే గ్రామంలో జన్మించాడు. అతను తల్లిదండ్రులు మోక్షగుండం శ్రీనివాస శాస్త్రి, వెంకట లక్ష్మమ్మ. వీరి పూర్వీకులు ఆంధ్ర ప్రదేశ్, ప్రకాశం జిల్లా లోని మోక్షగుండం గ్రామానికి చెందిన వారు. మూడు శతాబ్దాల కిందట వారు మైసూరు రాష్ట్రానికి వలస వెళ్ళినా తెలుగు మాట్లాడ గలిగే వారు. ఆయన తండ్రి సంస్కృత పండితుడు, హిందూ ధర్మశాస్త్ర పారంగతుడే కాక ఆయుర్వేద వైద్యుడు కూడా. 12 ఏళ్ల ప్రాయంలో తండ్రిని పోగొట్టుకుని, విశ్వేశ్వరయ్య, తన ప్రాథమిక విద్యను బెంగుళూరులోని చిక్కబల్లాపూర్‌లో పూర్తి చేశారు. 1881 సంవత్సరంలో మద్రాసు యూనివర్సిటీ నుంచి బీఏ పట్టా పొందారు. పూనేలోని కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. తరువాత తన 23వ యేట బొంబాయి ప్రజా పనుల శాఖలో అసిస్టెంట్ ఇంజనీరుగా చేరగా, అనంతరం భారత నీటి పారుదల కమిషను చేర వలసినదిగా ఆహ్వానం వచ్చింది. 1906–1907 మధ్య కాలంలో ఆయనను భారత ప్రభుత్వం యెమెన్ లోని ఆడెన్ కి పంపించి అక్కడి నీటి పారుదల వ్యవస్థనూ, మురికి కాలువల వ్యవస్థను రూపకల్పన చేయమని కోరగా, నిర్దేశించిన పథకం ప్రకారం అక్కడ మంచి ప్రాజెక్టు విజయ వంతంగా పూర్తి చేశారాయన. మైసూర్ చాంబర్ ఆఫ్ కామర్స్, 1917లో బెంగుళూరులో ప్రభుత్వ ఇంజనీరింగు కాలేజి, మైసూరు విశ్వవిద్యాలయం నెలకొల్పటంలో, తిరుమల తిరుపతి ఘాట్ రోడ్డు ఏర్పాటులో, హైదరాబాదులోని పత్తర్‌గట్టి నిర్మాణానికి డిజైన్లో ప్రధాన పాత్ర ఉంది. దేశంలోనే తొలిసారిగా 1903లో ఆటోమేటిక్ ఫ్లడ్ గేట్ల పద్ధతిని కనుగొన్నారు. ఈ సూత్రం విజయవంతం కావడంతో దేశంలో పలుచోట్ల ఇదే తరహా పద్ధతిని ప్రవేశ పెట్టారు. రిజర్వాయిర్‌లో భారీగా చేరే నీటిని నిలువ వుంచగలిగే సదుపాయంతో పాటు డ్యామ్‌కు ఎటువంటి హాని తల పెట్టకుండా చూడటంలో ఈ ఫ్లడ్ గేట్లు ఎంతగానో ఉపయోగ పడ్డాయి. 1908లో మూసి నదికి వరద రావడంతో హైదరాబాద్ నగరం ప్రమాదంలో చిక్కు కోగా హైదరాబాద్ ను వరద ముప్పు నుంచి రక్షించేందుకు అప్పటి నిజాం నవాబు, విశ్వేశ్వర్యను ఆహ్వానించి పరిష్కారం వెతకాలని కోరటంతో పటిష్టమైన నగర మురుగునీటి పారుదల పథకాన్ని రూపొందించారు. ఆ మూసీపై రిజర్వాయ ర్ నిర్మాణంలో హైదరాబాద్ నగరానికి వరద ప్రమాదం తప్పింది. విశాఖ పట్నం రేవును సముద్రపు కోత నుండి రక్షించే వ్యవస్థను రూపొందించడం లోనూ విశ్వేశ్వరయ్య పాత్ర ఉంది. ఆయన సలహా మేరకే గండిపేట్, హిమాయత్ సాగర్ జంట జలాశయాలను నిర్మించారు. మూసీ నుంచి తరలివచ్చే వరదకు అక్కడే అడ్డుకట్ట పడింది. ఈ జలాశయాల్లో నిల్వచేసిన నీళ్లే హైదరాబాదీల దాహార్తిని తీరుస్తున్నాయి. 1911లో కంపేనియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్గా నియమితుడయ్యాడు. 1927–1955 వరకు టాటా స్టీల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా సేవలందించారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1955లో భారత దేశపు అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రధానం చేశారు. లండన్ లోని ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సివిల్ ఇంజనీర్ గా బెంగుళూరు లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అతనుకు గౌరవ సభ్యత్వం, భారతదేశం లోని ఎనిమిది విశ్వ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. నిండు నూరేళ్లు జీవించిన విశ్వేశ్వరయ్య... 1962 ఏప్రిల్ 14న ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన పేరు మీద భారతదేశ మంతా ఎన్నో విద్యా సంస్థలున్నాయి. విశ్వేశ్వరయ్యకు విద్యారంగం, ఇంజనీరింగ్ తదితర రంగాలలో విశేషమైన గుర్తింపు లభించింది. ఆయన జన్మశతి సంవత్సరంలో బెంగుళూరులో విశ్వేశ్వరయ్య పారిశ్రామిక, సాంకేతిక ప్రదర్శనశాల నెలకొల్ప బడింది. భారత దేశంలోనే అతిపెద్దదైన కృష్ణా నదిపై నిర్మించిన "కృష్ణరాజ సాగర్" నిర్మాణ సమయంలో ఛీఫ్ ఇంజనీర్‌గా పనిచేశారు. దేశంలో చాలా డ్యామ్‌లు నిర్మించారు. ఆయన స్వస్థలంలో విశ్వేశ్వరయ్య మెమోరియల్ ట్రస్టు వారు ఒక స్మారక చిహ్నాన్ని నిర్మించారు. ఇందులో అతను సాధించిన పతకాలు, బిరుదులు, అతను వాడిన కళ్ళద్దాలు, కప్పులు, వెబ్ స్టర్ డిక్షనరీ, అతను విజిటింగు కార్డును ముద్రించే పరికరం లాంటి వస్తువులు ప్రదర్శనకు ఉంచారు. తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి జాతి గర్వించే ఎన్నో సాంకేతిక కట్టడాలు అందించిన సర్ విశ్వేశ్వరయ్య ప్రతి ఇంజనీర్‌కు స్ఫూర్తిదాత. ఆ స్ఫూర్తి తోనే శాస్త్ర సాంకేతిక, నిర్మాణ, రవాణా రంగాల్లో పురోభివృద్ధి సాధిస్తోంది. ఏడాదికి లక్షల మంది ఇంజనీర్లు తయారవు తున్నారు. ఆయా విభాగాల్లో శిక్షణ ఇవ్వడానికి పలు యూనివర్సిటీలు సేవలు అందిస్తున్నాయి. తల్లి దండ్రులు తమ పిల్లలు వైద్యుడు, ఇంజనీరు కావాలని ఆకాంక్షిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ విద్య కోసం పోటీ పడి చదువు తున్నారు. ఇంజనీరింగ్ సీట్ల కోసం విద్యార్థులు అహోరాత్రులు కష్టపడు తున్నారు. ఇంజనీరింగ్ విద్య పూర్తికాక ముందే నేడు స్వ, విదేశీ కంపెనీలు క్యాంపస్ ఎంపికల పేరుతో ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నారు. వేల నుంచి లక్షల వరకు వేతనాల చెల్లిస్తున్నారు. గతంలో ఎంతో ఆదరణ చూరగొన్న సివిల్ ఇంజనీరింగ్ ప్రభుత్వ రంగంలో అవినీతితో కూరుకు పోయిందనే ఆరోపణలున్నాయి. ఇదే ప్రయివేటు సెక్టార్‌లో ప్రతిభతో కూడిన కాసుల గల గలు కొలమానంగా మారింది. ప్రభుత్వ ఆధీనంలో అభివృద్ధిలో భాగంగా వేసిన రోడ్లు, కట్టిన భవనాలు, నిర్మించిన చెరువులు, ప్రాజెక్టులు, వేసిన పైపులైన్లు కూలిపోవడం, తెగిపోవడం, పగిలిపోవడం గమనిస్తూనే ఉన్నాం. కారణాలు ఏమైనప్పటికీ నాణ్యతకు ప్రతిభ తోడు కాకపోవడమే అని నిపుణులు అంటున్నారు. నాణ్యతకు రాజకీయం, అవినీతి అడ్డుగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇంజనీరింగ్ రంగ పితామహులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య, సర్ ఆర్థర్ కాటన్ లవలె ప్రజల మదిలో చిరకాలం నిలిచి పోయేందుకు ప్రతి ఇంజనీర్ కృషి చేయాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అంతరిక్ష రంగంలో భారత్ ముందంజ

## ఏప్రిల్ 12...అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవం

అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 12న నిర్వహించబడుతుంది. యూరీ గగారిన్ అంతరిక్షంలోకి వెళ్ళిన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవం జరుప బడుతుంది. అంతరిక్షంలోకి ప్రవేశించిన మొట్టమొదటి మానవుడిగా యూరీ గగారిన్ చరిత్రలో నిలిచిపోయారు. 1961 ఏప్రిల్ 12న వొస్టోక్ 1 విమానంలో అంతరిక్షయానం చేశారు. ఏప్రిల్ 12న గగారిన్ 108 నిమిషాల పాటు అంతరిక్ష నౌకలో భూమి చుట్టూ పరిభ్రమించిన ఈ రోజునే.. అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నాము. అంతరిక్షయానం 50వ వార్షికోత్సవానికి కొన్ని రోజుల ముందు 2011, ఏప్రిల్ 1న జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం 65వ సెషన్‌లో ఈ దినోత్సవం జరుపుకోవాలని తీర్మాణం జరిగింది. 1957, అక్టోబరు 4న స్పుత్నిక్ 1అనే తొలి మానవ నిర్మిత ఉపగ్రహాన్ని ప్రారంభించి అంతరిక్ష అన్వేషణకు శ్రీకారం చుట్టగా, 1967 అక్టోబరు 10న చంద్రునితో సహా ఇతర ఖగోళ ప్రాంతాలలో అన్వేషణ వివిధ దేశాల కార్యకలాపాల నిబంధనలపై సంతకం చేయబడింది. "విక్రం సారాభాయ్ ని భారత అంతరిక్ష పరిశోధనా వ్యవస్థకు పితామహుడిగా" అభివర్ణిస్తారు. 1957లో రష్యా మొట్టమొదటి శాటిలైట్ అయిన స్పుత్నిక్‌ను ప్రయోగించి నపుడు శాటిలైట్ యొక్క ఆవశ్యకతను అప్పటి ప్రధాన మంత్రి అయిన నెహ్రూకు వివరించి, 1962లో, భారత అణుశక్తి వ్యవస్థ పితా మహుడయిన హోమీ భాభా పర్యవేక్షణలో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ ను ఏర్పరచాడు. కేరళలో త్రివేండ్రం వద్ద తుంబా ఈక్వటోరియల్ రాకెట్ లాంచింగ్ స్టేషన్ నెలకొల్పి అమెరికా, రష్యాల నుండి దిగుమతి చేసుకున్న రాకెట్లను ప్రయోగిస్తూ ఉపరి తలాన్ని అధ్యయం చేయడం మొదలు పెట్టారు. అనతికాలంలోనే భారతదేశం స్వదేశీయంగా పూర్తి స్థాయి రాకెట్లను తయారు చేసి, ఉపరితల అధ్యయంలో పురోగతి సాధించింది. ఉపగ్రహాలను తయారు చేయడమే కాకుండా వాటిని ప్రయోగించే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉండాల్సిన ఆవశ్యకతను గుర్తించిన సారాభాయ్, ఉపగ్రహ వాహకనౌక రూపకల్పన మొదలు పెట్టాడు. అలా తయారైనదే సెటిలైట్ లాంచ్ వెహికిల్ (%ూూం%). ఇస్రో తయారు చేసిన తొలి పూర్తిస్థాయి ఉప గ్రహానికి భారత గణిత, ఖగోళ శాస్త్రవేత్త అయిన "ఆర్యభట్ట" పేరు పెటారు. భారత దేశపు మొట్ట మొదటి ఉపగ్రహం ఆర్యభట్టను 1975 ఏప్రిల్ 19న అప్పటి సోవియట్ యూనియన్ నుండి విజయ వంతంగా ప్రయోగించారు. ఇన్‌శాట్ – %×చీూూ% లేదా భారత జాతీయ ఉపగ్రహ వ్యవస్థ (%×అఎఖుఅ చీఛ్ఱశీఅఖశ్రీ ాఛ్వశ్రీశ్రీఱ్వ ాఎర్వఎ%) అనేది సమాచారం, వాతావరణం, ప్రసారాలు మొదలయిన బహుళ ప్రయోజనాల కోసం ఇస్రో తయారు చేసిన ఉపగ్రహాల శ్రేణి. 1983లో మొదలయిన ఇన్‌శాట్, ఆసియా, పసిఫిక్ దేశాల్లో అతిపెద్ద ఉపగ్రహాల వ్యవస్థ. ప్రస్తుతం 199 ట్రాన్స్ పాండర్లతో భారతదేశం లోని దాదాపు అన్ని టెలివిజన్, రేడియోలకు మాధ్యమంగా ఉన్న ఈ ఉపగ్రహాలను కర్నాటకలోని హస్సన్, భోపాల్ ల నుండి అనుక్షణం పర్యవేక్షిస్తుంటారు. తద్వారా అంతరిక్ష పరిశోధనల్లో మన దేశం ఎంతో ముందంజలో ఉందని కొనియాడారు. అంతరిక్ష ప్రయోగాల కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెడతారని ప్రశ్నించే వారికి... దీపావళి పండుగ కోసం పటాసులు కాల్చడానికి దాదాపు 600 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తారనేది ఒక అంచనా ఉందని, అయితే మంగళయాన్ ప్రయోగం కోసం ఇస్రో కేవలం వెయ్యి కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి విజయం సాధించడం గొప్ప పరిణామమని ఆయన ధీటైన సమాధానం చెప్పారు. ప్రపంచ దేశాలు చేయలేని సాహసం ఇస్రో చేపట్టిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మంగళయాన్ సక్సెస్‌తో భారత్ ప్రపంచ దేశాల సరసన చేరిందని వెల్లడించారు. అంతరిక్ష రంగంలో అధునాతన సామర్థ్యాలు కలిగి ఉన్న కొన్ని దేశాలలో భారత్ ఒకటి. భారత్ లో ప్రతిష్ఠాత్మక ప్రయోగ కేంద్రాలు ఉన్నాయి... 1.తుంబా: కేరళలో తిరువనంత పురం సమీపాన భూ అయస్కాంత రేఖకు దగ్గరలో ఉన్న తుంబాలో 1962లో మొదటి రాకెట్ ప్రయోగ కేంద్రాన్ని నిర్మించారు. అప్పటి శాస్త్రవేత్తలలో అబ్దుల్ కలాం ఒకరు. మొదట కేవలం రాకెట్ల ప్రయోగ కేంద్రముగా ఉన్న తుంబా నెమ్మదిగా రాకెట్లకు అవసర మయిన ప్రొపెల్లర్లు, ఇంజన్లు తయారు చేసి




అమర్చ గలిగి పూర్తిస్థాయి రాకెట్ నిర్మాణ కేంద్రంగా తయారయింది. 2.శ్రీహరి కోట: భారత దేశంలో ఉపగ్రహాల ప్రయోగానికి అత్యంత అనువయిన ప్రదేశ మయిన శ్రీహరికోట నెల్లూరు జిల్లాలో సూళ్ళూరుపేట దగ్గర ఉంది. ఈ అంతరిక్ష కేంద్రం పేరు "సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం". దీనినే "షార్" అని కూడా పిలుస్తారు. ఇది భారతదేశం లోని ఉపగ్రహ ప్రయోగ కేంద్రం. ఇక్కడనుండి ఎన్నో పి.ఎస్ ఎల్. విబీ జి.ఎస్.ఎల్.వి ఉప గ్రహాలను విజయ వంతంగా ప్రయోగించారు. ప్రస్తుతం ఇక్కడ రెండు లాంచ్ ప్యాడ్‌లు ఉన్నాయి. ఈ రెండిటి వల్ల ప్రతి ఏడాది 6 శాటిలైట్లను ప్రయోగించే వీలు ఉంది. 3.బలేశ్వర్ ఒరిస్సాలో ఉంది. శ్రీహరికోటలో ఉన్నట్లు ఇక్కడ శాటిలైట్ల ప్రయోగానికి సౌకర్యాలు లేకున్నా, దీనిని ప్రధానంగా క్షిపణులను ప్రయోగించుటకు ఉపయోగిస్తారు. 2005లో రెండవ లాంచి ప్యాడు ఆపరేషను, 2008 లో చంద్రయాన్, 2014లో మంగళ్ యాన్, 2016లో పునర్వినియోగ లాంచి వాహనపు తొలి పరీక్ష, 2016లో ఒకే రాకెట్టుతో 20 ఉపగ్రహాల ప్రయోగం – అప్పటికి ఇది ఇస్రో రికార్డు, 2017లో ఒకే రాకెట్టుతో 104 ఉపగ్రహాల ప్రయోగం – ఇది ప్రపంచ రికార్డుబీ 2017 – జిఎస్ఎల్వి మార్క్ 3 ప్రయోగం, దేశీయంగా అభివృద్ధి చేసిన అత్యంత శక్తివంతమైన క్రయోజెనిక్ ఇంజను విజయ వంతమైంది. ప్రసిద్ధమైన ఇస్రో సంస్థ దేశాభివృద్ధి లక్ష్యంగా అంతరిక్ష విజ్ఞానాన్ని అభివృద్ధి చేసే ఉద్దేశంతో ఏర్పాటై, ప్రస్తుతం ప్రపంచంలోని అంతరిక్ష రంగ సంస్థల్లో ఒకటిగా పేరొందింది. బెంగుళూరు కేంద్రంగా ఏర్పాటైన ఇస్రో, దేశంలోని వివిధ ప్రదేశాల్లో పరిశోధన, అభివృద్ధి సౌకర్యాలు కలిగి ఉంది. ఇస్రో భారత ప్రభుత్వపు అంతరిక్ష శాఖకు అనుబంధంగా ఉంది. అంతరిక్ష శాఖ ప్రధాన మంత్రి, అంతరిక్ష కమిషన్ అధీనంలో ఉంటుంది. ఇస్రో కింది విభాగాలను, సంస్థలను నిర్వహిస్తుంది. అంతరిక్ష కార్యకలాపాల లోకి ప్రయివేటు రంగాల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచే లక్ష్యంతో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ అంతరిక్ష రంగంలో చాలా కీలకమైన సంస్కరణలకు ఆమోదం తెలిపింది. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ నిర్ణయంతో మన అంతరిక్ష విజ్ఞానాన్ని దేశాభివృద్ధికి ఉపయోగించునే సామర్థ్య మరింతగా పెరుగుతుంది. మన అంతరిక్ష రంగం త్వరిత గతిన అభివృద్ధి చెందటమే కాకుండా.. అంతరిక్ష ఆర్థిక వ్యవహారాల్లో భారత్ అంతర్జాతీయంగా కీలక పాత్ర పోషించేందుకు వీలవుతుంది. ఇస్రో గత 10 సంవత్సరాలలో భారతదేశం 34 దేశాల నుండి 393 ఉపగ్రహాలను ప్రయోగించింది. ఈ మొత్తం ఉపగ్రహాలలో దాదాపు 232 ఉపగ్రహాలు అమెరికాకు చెందినవి, 83 ఉపగ్రహాలు యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందినవి. ఇతర ఉపగ్రహాలు సింగపూర్, కెనడా, కొరియా, లక్సెంబర్గ్, ఇటలీ, జర్మనీ, బెల్జియం, ఫిన్లాండ్, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్, ఇజ్రాయెల్, జపాన్, స్పెయిన్, ఆస్ట్రేలియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రియా వంటి దేశాలకు చెందినవి. భారతదేశం ప్రస్తుతం అంతరిక్ష రంగంలో ఒక ప్రధాన పాత్రధారి, 2023లో చంద్రయాన్–3 అంతరిక్ష నౌకను చంద్రుని దక్షిణ ధ్రువంపై దింపడం ద్వారా భారతదేశం కొత్త శిఖరానికి చేరుకుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఏప్రిల్ 12...అట్లూరి పిచ్చేశ్వర రావు జయంతి



అట్లూరి పిచ్చేశ్వర రావు (ఏప్రిల్ 12, 1925 – సెప్టెంబర్ 26, 1966), తెలుగు కథకుడు, అనువాదకుడు, నవలా రచయిత, స్క్రీన్ ప్లే రచయిత కూడా. పిచ్చేశ్వర రావు ఆంధ్ర ప్రదేశ్ లోని కృష్ణా జిల్లా యందు చౌటపల్లి గ్రామంలో ఏప్రిల్ 12, 1925 న జన్మించారు. ఆయన కుటుంబం సమీప గ్రామమైన పులపర్రు గ్రామానికి వలస పోయింది. చౌటపల్లి గ్రామంలోనూ, కైకలూరు పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. హిందీ విశారద పరీక్షలలో ప్రథముడుగా నిలిచారు. తన ఇంటర్మీడియట్ విద్యను హిందూ కాలేజ్ లో పూర్తి చేశారు. విద్య పూర్తయిన తరువాత 1945 లో భారత నౌకా దళంలో చేరారు. 1948 లో బి.ఆర్.డబ్ల్యూ, కె.సి.జి. పరీక్షలలో ఉత్తీర్ణుడయ్యారు. 1953 లో తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. పిచ్చేశ్వర రావు, ప్రముఖ కవి, సంఘ సంస్కర్త అయిన త్రిపురనేని రామస్వామి కనిష్ఠ పుత్రికైన చౌద రాణిని వివాహం చేసుకున్నారు. ఆమె కూడా కథా రచయిత్రి, నవలా రచయిత్రి. ఆమె తెలుగు పుస్తక శాలను మద్రాసులో ప్రారంభించిం ది. ఆమె 1996 లో మరణించింది. పిచ్చేశ్వర రావు తెలుగు దినపత్రిక అయిన విశాలాంధ్ర దినపత్రికలో కొంత కాలం పాటు పనిచేశారు. 1962 లో మద్రాసు (ప్రస్తుతం చెన్నై) కు వెళ్ళి చిత్ర పరిశ్రమలో స్క్రీన్ రైటర్ గా స్థిర పడ్డారు. హిందీ భాషలో గల సాహిత్యాన్ని తెలుగులో అనువాదం చేయుటకు కృషి చేశారు. అవి గోదాన్, ప్రతిధ్వని, పేకముక్కలు,, గాడిద ఆత్మ కథ. ఆ అనువాదంలో భాగంగా, అనేక కథలు, రేడియో నాటికలు, వంటివి రాసాడు. వాటిలో మనసులో మనిషీ ప్రాధాన్యత పొందింది. "గౌతమ బుద్ధ", "వీరేశ లింగం" అనే స్క్రిప్టు పిచ్చేశ్వర రావు రచనా ప్రతిభకు తార్కాణాలుగా నిలిచా యి. అవి తెలుగు భాషలో ప్రసిద్ధమై నవి. చిత్ర పరిశ్రమలో ప్రముఖ స్క్రీన్ రైటర్ గా ప్రసిద్ధి పొందారు. పిచ్చేశ్వర రావు సెప్టెంబర్ 26, 1966లో గుండె పోటుతో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# చైత్ర పౌర్ణమి హనుమాన్ జయంతి



ధర్మపురి క్షేత్రంలో హన్మాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. చైత్ర పౌర్ణమి హన్మాన్ జయంతిగా భావించ బడుతున్న ఆ సందర్భాన్ని పుర స్కరించుకుని ఏటా ధర్మపురి క్షేత్రస్థ దేవస్థానంలో సాంప్రదాయ రీతిలో స్వామి జయంతి వేడుకలను వైభ వంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో, ఏప్రిల్ 12వ తేదీన శని వారం దేవస్థానం లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో, అలాగే గోదావరీ తీరస్థ గడ్డ హన్మాండ్ల ఆలయంలో జన్మదిన కార్యక్రమాలను నిర్వహించడానికి విస్తృత ఏర్పాట్లు గావిస్తున్నారు.

**జయంతికి ఏర్పాట్లు ముమ్మరం...** ఏప్రిల్ 12న ఆంజనేయ జయంతిని పురస్కరించుకుని, 12,13,తేదీలలో ఆంజనేయ ఆలయంలో నిర్వహించ నున్న ప్రత్యేక కార్యక్రమాలలో భాగస్వాము లయ్యేందుకు సుదూర ప్రాంత హన్మాన్ దీక్షాపరులు సాంప్రదాయా చరణలో భాగంగా విచ్చేయ నున్నారు. దేవస్థానం ఏసీ ఈఓ శ్రీనివాస్, మార్గ దర్శకత్వంలో, దేవస్థాన చైర్మన్ జక్కు రవీందర్ ధర్మ కర్తలు, సిబ్బంది పర్యవేక్షణలో, ఆలయ అర్చకులు వొద్దిపర్తి నర్సింహమూర్తి, కళ్యాణ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలలో భాగంగా మూడు రోజుల పాటు పంచోపనిషత్ యుక్త ప్రత్యేక పూజలు, నీరాజన, మంత్రపుష్ప, తీర్థ ప్రసాద వితరణాది కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వేలాది మంది హన్మాన్ భక్తులు 12,13 తేదీలలో హన్మాన్ దీక్షా విరమణలు చేయను నందున భక్తుల సౌకర్యార్థం త్రాగు నీటి ఏర్పాట్లు, దేవస్థానం లోనా, బయటా చలువ పందిళ్ళు, విద్యుత్ దీపాలంకరణలు, తాత్కాలిక టెంట్లు, ప్రత్యేక క్యూలైన్ల లాంటి వసతుల మెరుగుదల చర్యలు గైకొంటున్నారు. అసంఖ్యాకులైన దీక్షా. పరులు గత వారం రోజులుగా ఉదయం నుండే సుదూర ప్రాంతాల నుండి క్షేత్రానికి ఏతెంచి, పవిత్ర నదీ స్నానాలు ఆచరించి, దైవదర్శనార్థం బారులుతీరి ప్రధానాలయం ముందు వేచి ఉంటున్నారు. అలాగే క్షేత్రంలోని గోదావరీ తీరస్థ, భద్రా మరియు గోదావరీ నదుల సంగమ స్థానమైన ప్రదేశంలో, గోదావరి తీరాన్ని ఆనుకుని వెలసిన, హన్మాన్ గడ్డ పేరుతో సుపరిచిత మైన భక్తాంజనేయ దేవాలయంలో వంశపారంపర్య అర్చకులు మధ్వాచారి రాంకిషన్, పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఆంజనేయ జయంతి వేడుకలను ఏటా ఘనంగా నిర్వహించే క్రమంలో విస్తృత ఏర్పాట్లు గావిస్తున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# బహు ప్రత్యేకతల సమాహారం... ఒంటిమిట్ట కోదండ రామాలయం

## ఏప్రిల్ 12... ఏకశిలా నగర కోదండ రామ రథోత్సవం



దుష్టశిక్షణ కోసం, శిష్ట రక్షణ కొరకు శ్రీ మహా విష్ణువు యుగయుగాలలో అవతరిస్తూ ఉంటాడు. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడుగా అవతరించి దండ కారణ్యంలో సీతాలక్ష్మణ సమేతుడై సంచరించాడు. సీతాదేవి దప్పిక తీర్చడానికి భూమిలోనికి బాణం వేయగా నీటి బుగ్గ పుట్టింది. అదే ఒంటిమిట్టలోని రామతీర్థం అయింది. సీతాన్వేషణ కోసం, రావణ సంహారం కోసం శ్రీ రామ చంద్రునికి సహకరించిన హనుమత్, సుగ్రీవాదులతో పాటు జాంబవంతు డున్నాడు. ఆయన ద్వాపరయుగం లోనూ ఉండి శ్రీ కృష్ణ భగవానునికి తన కూతురునిచ్చి పెండ్లి చేశాడు. ఆ జాంబవంతుడు సేవించిన సీతాలక్ష్మణ సమేత శ్రీ రామచంద్రుడే నేడు ఒంటిమిట్ట గుడిలో కొలువై ఉన్నాడు. ఒకే రాతిపై సీతారామ లక్ష్మణ దేవతా మూర్తులుండడం వల్ల ఒంటిమిట్టను ఏకశిలా నగరం అని కూడా అంటారు. కోదండ రామాలయం భారతదేశంలోని ఆంధ్ర రాష్ట్రంలోని కడప జిల్లా వొంటిమిట్ట మండలంలో వొంటిమిట్ట పట్టణంలో ఉన్న రామ దేవునికి సంబందించిన హిందూ దేవాలయం.. క్రీ.శ.1356లో బుక్కరాయలు ఆలయాన్ని ప్రారంభించాడు. ఆ తరువాత కాలంలో విజయ నగర రాజులు, చాళుక్య రాజులు క్రమంగా గుడికి అంతరాలం, రంగమంటపం, మహా ప్రాంగణం, గోపురాలు, రథం నిర్మించారు. ఒంటిమిట్ట చుట్టుప్రక్క గ్రామాల రాబడి ఆలయ కైంకర్యాలకు వినియోగించారు. ఈ దేవాలయం మూడు దఫాలుగా నిర్మించారు. 14 శతాబ్దంలో ప్రారంభమై 17 శతాబ్దానికి పూర్తి అయినట్లు ఇక్కడ ఉన్న శాసనాలు తెలుపుతున్నాయి విజయ నగర నిర్మాణ శైలిని పోలి ఉన్న ఆలయం ఇది. ఒంటడు, మిట్టడు అనే ఇద్దరు దొంగలు ఇక్కడ రాముణ్ణి కొలిచి తమ వృత్తిని మానుకుని నిజాయితీగా బ్రతికారని, వారి పేరు మీదుగానే ఒంటిమిట్ట అని పేరు వచ్చిందని ఇంకొక కథనం కూడా ఉంది. మిట్టను సంస్కృతంలో శైలమంటారు. ఈ ఆలయంలో సీతా రామ లక్ష్మణులు ఒకే రాతిలో చిత్రించబడ్డారు. కాబట్టి ఏకశిలా నగరమనీ పేరు వచ్చింది. హనుమంతుడు లేని రామాలయం భారత దేశంలో ఇదొక్కటే. ఈ గ్రామాన్ని గురించి తొలి తెలుగు యాత్రాచరిత్రయైన కాశీయాత్ర చరిత్రలో ప్రస్తావనలున్నాయి. ఆ గ్రంథకర్త ఏనుగుల వీరాస్వామయ్య కాశీ యాత్రలో భాగంగా మజిలీలైన అత్తిరాల నుంచి భాకరాపేట వెళ్ళే మార్గ మధ్యలో ఒంటిమిట్టను దాటి వెళ్ళారు. దీనివల్ల 1830 నాడు గ్రామ స్థితిగతులు తెలియవస్తున్నవి. అప్పటికి గ్రామంలో నాల్గుపక్కల కొండలే కలిగిన భారీ చెరువున్నది. చెరువు కట్టమీద ఉన్న బాటపైనే వారి ప్రయాణం సాగింది. ఆ ఒంటిమిట్టలో చూడ చక్కనైన గుళ్ళు ఉన్నాయన్నారు. గ్రామంలో ఓ ముసాఫరుఖానా యాత్రికుల నిలయం ఉండేదని, అప్పటికే అది బస్తీ గ్రామమని పేర్కొన్నారు. రామ లక్ష్మణులు చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు, విశ్వామిత్రుడు వారిని తమ యాగరక్షణకు తీసుకు వెళ్ళాడు. సీతారామ కల్యాణం జరిగాక కూడా, అలాంటి సందర్భమే ఒకటి ఏర్పడింది. అప్పుడు మృకండు మహర్షి, శృంగి మహర్షి రాముని ప్రార్థించడంతో దుష్టశిక్షణ కోసం, ఆ స్వామి సీతా లక్ష్మణ సమేతుడై అంబుల పొది, పిడిబాకు, కోదండం, పట్టుకుని ఈ ప్రాంతానికి వచ్చి యాగ రక్షణ చేశాడని పురాణం చెబుతుంది. అందుకు ప్రతిగా ఆ మహర్షులు సీతారామ లక్ష్మణుల విగ్రహాలను ఏకశిలగా చెక్కించారనీ, తరువాత జాంబవంతుడు ఈ విగ్రహాలను ప్రాణప్రతిష్ఠ చేశారనీ ఈ ప్రాంత ప్రజల విశ్వాసం. ఆలయ మండపంలో 32 స్తంభాలు ఉన్నాయి, ఈ ఆలయ ప్రధాన విగ్రహం రాముడు కోదండ రామ స్వామిగా పూజించబడ్డాడు. కుడి చేతిపై విల్లు, ఎడమ చేతిలో బాణం, ఒకే రాతితో చేసిన సీత మరియు లక్ష్మణుడితో పాటు నిలబడి ఉన్న భంగిమలో ఉన్నాడు. ఇక్కడ పరమేశ్వరుని లింగం, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, భ్రమరాంబ, నందీశ్వరుడు, భృంగీశ్వరుడు, కాల భైరవుల విగ్రహాలు కొలువై ఉన్నాయి. ఎందరో మహాకవులు శ్రీరామచంద్రుని కరుణకు పాత్రులైనారు. పోతన ఇక్కడే భాగవతాన్ని తెనిగించి నట్లు చెపుతారు. అయ్యలరాజు తిప్పయ్య ఒంటిమిట్ట శ్రీ కోదండ రామునిపై రఘువీర శతకం రచించి, అంకిత మిచ్చారు. రామభద్ర కవి రామాభ్యుదయమును రచించారు. నల్లకాల్వ అయ్యప్ప ఒంటిమిట్ట రాముని వరం పొంది వరకవి అయ్యారు. ఉప్పుగుండూరు వేంకటకవి ఒంటిమిట్ట దశరథరామ శతకం రచించారు. ఆంధ్రవాల్మీకిగా ప్రసిద్ధి పొందిన వావిలికొలను సుబ్బారావు గారు ఆంధ్రవాల్మీకి రామాయణం మందర వ్యాఖ్యతో రచించారు. తాళ్ళపాక అన్నమయ్య రామునిమీద సంకీర్తన చెప్పారు. శ్రీ కోదండ రామస్వామి వారి దేవాలయాన్ని దేవదాయ ధర్మాదాయశాఖ నుంచి 9-9-2015వ తేదీన తిరుమల తిరుపతి దేవస్థానం విలీనం చేసుకున్నది. ఈ సంవత్సరం స్వామి వారి క్షేత్రంలో ఏటా శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరుగుతాయి. ఒంటిమిట్టలో ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ నవమి నుండి బహుళ విదియ దాకా బ్రహ్మోత్స వాలు జరుగు తాయి. చతుర్దశి నాడు కళ్యాణం, పౌర్ణమి నాడు రథోత్సవం ఉంటాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 12న రథోత్సవం, ఏప్రిల్ 14న చక్రస్నానం, ఏప్రిల్ 15న పుష్పయాగము నిర్వహించనున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


చురకలు

## సంపాదకీయం

### అమెరికాను 'ఏఐ' వీడియోలతో ఆడుకుంటున్న చైనా

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందుచూపు లేకుండా చేస్తున్న వాణిజ్య యుద్ధంలో చైనా కూడా దీటుగా బదులిస్తోంది. రెండు దేశాలు ఒకరిపై ఒకరు పన్నులు పెంచుకుంటూ పోతుండటంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతోంది. ఈ నేపథ్యంలో, చైనా నుంచి ఎగుమతులు నిలిచిపోతే అమెరికా ఎదుర్కొనే సంక్షోభాన్ని చైనా వ్యంగ్యంగా ఏఐ వీడియోల ద్వారా తెలియజేస్తోంది. అమెరికాలో తయారీ రంగం అంతగా అభివృద్ధి చెందలేదని చైనా ఎత్తిచూపుతోంది. కాలుష్యం వంటి కారణాల వల్ల అమెరికన్ కంపెనీలు కూడా తమ ఉత్పత్తుల తయారీ కోసం చైనా, ఇతర దేశాలపై ఆధారపడుతున్నాయని గుర్తు చేస్తోంది. యాపిల్ వంటి పెద్ద కంపెనీలు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయని వివరిస్తోంది. మరోవైపు, చైనా తయారీ రంగంలో గణనీయమైన ప్రగతి సాధించి, ప్రపంచ దేశాలకు అవసరమైన అనేక ఉత్పత్తులను అందిస్తోంది. సూది నుంచి యుద్ధ సామాగ్రి వరకు ప్రపంచవ్యాప్తంగా చైనా ఉత్పత్తులకు డిమాండ్ ఉంది. అమెరికాకు చైనా చేసే ఎగుమతులు చాలా ఎక్కువ. అయితే అమెరికా నుంచి చైనా కొనుగోలు చేసేది తక్కువగా ఉంటోంది. అమెరికా దిగుమతి చేసుకునే వస్తువులు అత్యవసరమైనవేనని, వాటికి తక్షణమే ప్రత్యామ్నాయం కనుగొనడం అంత సులువు కాదని చైనా ఈ వీడియోల ద్వారా సూటిగా చెబుతోంది. ట్రంప్, ఎలాన్ మస్క్ ఫోన్లు బాగుచేసుకుంటున్నట్లు, బట్టలు కుట్టుకుంటున్నట్లుగా ఫన్నీ వీడియోలను రూపొందించింది. అంతే కాకుండా, అమెరికన్లు అధిక బరువుతో బాధపడుతున్న విషయాన్ని కూడా చైనా తన వీడియోల్లో వ్యంగ్యంగా ప్రస్తావిస్తోంది. ట్రంప్ ఇదే తరహా విధానాలను కొనసాగిస్తే, భవిష్యత్తులో చైనా అగ్రరాజ్యంగా మారినా ఆశ్చర్యం లేదని ప్రపంచంలోని అనేక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇతర దేశాలన్నీ సుంకాలను తగ్గించుకునేందుకు చర్చలకు సిద్ధంగా ఉన్నప్పటికీ, చైనా మాత్రం ఎదురు సుంకాలు విధిస్తూ ఏమాత్రం లొంగేది లేదని స్పష్టం చేస్తోంది. అంతేకాదు, తన వ్యంగ్యపు వీడియోలతో అమెరికాను ట్రోల్ చేస్తూ సవాల్ విసురుతోంది. ఈ పరిణామాలు రానున్న రోజుల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతాయో చూడాల్సి ఉంది.

# ఏప్రిల్ 12...మాకినేని బసవపున్నయ్య వర్ధంతి




భారత దేశంలో ప్రముఖ కమ్యూనిస్టు నేతల్లో మాకినేని బసవ పున్నయ్య ఒకరు. విద్యార్థి సంఘం నేతగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానంలో తొలుత కాంగ్రెస్‌లోనే ఓనమాలు దిద్దుకున్నారు. అనంతరం కమ్యూనిస్టు భావాలు ఆకర్షించడంతో సీపీఐలో చేరారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని అనంతరం సీపీఎం ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించారు. ఆ క్రమంలో ఆయన అంతర్జాతీయ స్థాయి కమ్యూనిస్టు నేతలైన స్టాలిన్, మాలటోవ్, సుస్లోవ్, మాలెంకోవ్‌లతో చర్చలు జరిపారు. అలాగే చైనా కమ్యూనిస్టు దిగ్గజాలు మావోసేటుంగ్, చౌఎన్‌లైతోనూ పున్నయ్యకు సన్నిహిత సంబంధాలున్నాయి. 1952 నుంచి 1966 వరకు రాజ్యసభ సభ్యునిగా పనిచేశారు. కార్ల్‌మార్క్స్, లెనిన్ సిద్ధాంతాలకు కట్టుబడ్డ ఆయన జీవితాంతం రాజీ ఎరగని పోరాట యోధునిగా నిలిచి పోయారు. కామ్రేడ్ బసవ పున్నయ్య రేపల్లె మండం తూర్పుపాలెంలోని భూస్వామ్య కుటుంబంలో 1914 డిసెంబరు 14న జన్మించారు. తల్లిదండ్రులు చారుమతి, అప్పయ్యలకు జన్మించారు. భార్య జగదాంబ. ప్రారంభంలో సాంప్రదాయ విద్య, అనంతరం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదివి, బందరు నోబుల్ కళాశాలలో ఇంటర్మీడియట్, గుంటూరు ఎ.సి. కాలేజీలో బి.ఎ.పూర్తి చేశారు 1930లో దేశస్వాతంత్ర్యం కోసం పోరాటం సాగించిన నాటి తరం నేతలతో కలిసి పనిచేసి అనుభవాన్ని పంచుకున్నారు. ఆనాడు కాంగ్రెస్ నాయకత్వం ఉద్యమాన్ని తాత్కాలికంగా రద్దు చేయటంతో అసంతృప్తి చెందిన బసవ పున్నయ్య భారతదేశ ప్రజ సమస్య సోషలిస్టు వ్యవస్థలో మాత్రమే పరిష్కారం కాగవన్న విశ్వాసంతో 1934 -35లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. గుంటూరులో జరిగిన విద్యార్థుల సమ్మెకు నాయకత్వం వహించి, సహ విద్యార్థులైన వై.వి.కృష్ణారావు, మాద నారాయణ స్వామి, మోటూరు హనుమంత రావు, లావు బాగంగాధర రావుతో కసి రాష్ట్రంలో బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించి, 1938లో ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా, అదే సమయంలో అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ సహాయ కార్యదర్శిగా పనిచేశారు. 1940లో గుంటూరు జిల్లా పార్టీ కార్యదర్శిగా బాధ్యతను స్వీకరించారు. 1943లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుగా ఎన్నికైనారు. 1948లో కలకత్తాలో జరిగిన సి.పి.ఐ. ద్వితీయ మహాసభలో కేంద్ర కమిటికి ఎన్నికయ్యారు. 1964లో పార్టీ చీలిన తరువాత సి.పి.ఐ.(ఎం) పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు. ఆ స్థానంలో నాలుగు దశాబ్దాల పాటు తుదిశ్వాస విడిచే వరకూ కొనసాగారు. మార్క్సిజం లెనినిజంకు చివరి వరకు కట్టుబడి ఉండి పీడిత ప్రజ విముక్తి కోసం విశిష్టమైన సేవందించారు. నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్దిష్ట విశ్లేషణను చేయగలిగిన మార్క్సిజం లెనినిజం అనే సజీవ సిద్ధాంత వ్యాప్తికి, భారతదేశ ప్రజ విముక్తికి గణనీయమైన సేవలందించారు. తెలంగాణ పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిన నాయకులో కామ్రేడ్ మాకినేని ఒకరు. తెంగాణా సాయుధ పోరాటంలో కామ్రేడ్స్ సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు మొదలైన ప్రముఖులతో పాటు కీలక పాత్రను పున్నయ్య పోషించారు. తెలంగాణ పోరాట నిర్వహణకు అవసరమైన నిధుల సమీకరణ, ఆయుధాల కోనుగోలు, చేరవేతలో ప్రధాన భాధ్యత బసవ పున్నయ్యదే. సాయుధ పోరాటాన్ని విరమించి విప్లవ మార్గాన్ని చేపట్టటంలో సుందరయ్యతో పాటు బసవ పున్నయ్య సృజనాత్మక పాత్ర నిర్వహించారు. భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో అగ్రగణ్యులైన నాయకులో ఒకరుగా ఎదిగారు. రహస్య జీవనం సాగించిన సందర్భం, ప్రభుత్వం దమన కాండకు ఎదురొడ్డి నిలిచి పోరాడిన అనుభవాల సాయంతో భారత దేశంలో విప్లవ సాధనకు అనుసరించాల్సిన వ్యూహం, ఎత్తుగడపై ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో చర్చను ప్రారంభించిన వారిలో ఒకరిగా, సిపిఎం విప్లవకర వ్యూహ్యాన్ని చేపట్టడంలో కామ్రేడ్ బసవ పున్నయ్య కీలక పాత్రధారి. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో సిద్ధాంత పరంగా తీవ్రస్థాయిలో చర్చ సాగిన కాలంలో ఈ అంశంపై అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ నాయకులతో చర్చ జరిపే బాధ్యతను పార్టీ కేంద్రకమిటీ కామ్రేడ్ మాకినేనికి అప్పగించింది. మాస్కోలో 1957లో జరిగిన ప్రపంచ కమ్యూనిస్టు పార్టీ మహాసభల్లో పాల్గొనేందుకు వెళ్ళిన సి.పి.ఐ. ప్రతినిధి వర్గంలో ఆయన సభ్యులు. నాడు దేశంలోనూ, అంతర్జాతీయం గానూ కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొంటున్న సమస్యపై మావోసేటుంగ్ తోనూ, లీషావ్‌చి నాయకత్వంలో వచ్చిన చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి బృందంతోనూ చర్చజరిపే అవకాశం కామ్రేడ్ బసవ పున్నయ్యకు వచ్చింది. శాస్త్రీయమైన, విప్లవకర మార్క్సిజం లెనినిజం సిద్ధాతం పట్ల ప్రగాఢమైన నిబద్ధతతో కూడిన దేశభక్తి కామ్రేడ్ బసవ పున్నయ్యలో నిండుగా ఉంది. భారత విప్లవ మార్గానికి స్వతంత్ర వ్యూహాలను, ఎత్తుగడలను అన్వేషించి ప్రజలకు విప్లవ మార్గాన్ని సూచించారు. విప్లవ సాధనకు వ్యూహాన్ని రూపొందించేవారు. భారత దేశంలో పీడిత ప్రజల విముక్తి కోసం సైద్ధాంతికంగా, ఆచరణాత్మకంగా గణనీయమైన కృషి చేస్తూనే పార్లమెంటేరియన్ గానూ రాణించారు. రాజ్యసభ సభ్యుడిగా 1952 నుంచి 1966 వరకు 14 ఏళ్లు కొనసాగారు. కామ్రేడ్ మాకినేని బసవ పున్నయ్య రాజకీయ జీవితంలో ఆరేళ్లపాటు అజ్ఞాతవాసం సాగించారు. చైనా భారత్ యుద్ధం సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన్ను రెండుసార్లు జైల్లో పెట్టింది. ఈ . చైనా భారత దేశాల మధ్య వివాదాన్ని సంప్రదింపులు, చర్చల ద్వారా మాత్రమే పరిష్కరించు కోవాలని, ఘర్షణ ద్వారా కాదని నొక్కి చెప్పారు. సి.పి.ఐ.(ఎం) ఆవిర్భావం నాటి నుంచి చనిపోయే వరకూ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుగా పనిచేసిన కామ్రేడ్ మాకినేని పూర్వపు సోషలిస్టు దేశాల్లో సంభవించిన మార్పుకు సంబంధించి చేసిన సిద్ధాంత పరమైన సూత్రీకరణల్లో క్రీయాశీక పాత్ర నిర్వహించారు. 1990లో సోవియట్ యూనియన్ కుప్పకూలి, సోషలిష్టు సిద్ధాంతం పైనే దాడి కేంద్రీకరించ బడినా సడలని కమ్యునిస్టు విశ్వాసాన్ని నిలిపిన ధీరుడు బసవ పున్నయ్య. సి.పి.ఐ.(ఎం) అధికార పత్రిక పీపుల్స్ డెమోక్రసీ ఎడిటర్‌గా ఆయన 14 ఏళ్లు పనిచేశారు. సి.పి.ఐ.(ఎం) అభివృద్ధికి, దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి వయసుతో నిమిత్తం లేకుండా అవిశ్రాంతంగా కృషిచేశారు. మాకినేని నిరంతరం చదివేవారు, విస్తృతంగా రాసేవారు. కార్యకర్తలు, ఢిల్లీ కార్యాలయం సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేసేవారు. అందుకే ఆయన్ను అందరూ ఎంతో అభిమానించే వారు. జాతీయ, అంతర్జాతీయ సమస్యలు సైద్ధాంతిక, వ్యక్తిగత సమస్యపై చర్చించేందుకు అయన అందరికీ ఎప్పుడూ అందుబాటులో ఉండేవారు. బసవ పున్నయ్య గొప్ప ఉపన్యాసకులు. సునిశితమైన రచయితగా అనేక సిద్ధాంత పత్రాలను రచించారు. ఆయనలో మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాత పరిజ్ఞానంతో పాటు అంతర్జాతీయత, దేశభక్తి, తెలుగు జాతీయత కలగలిపి ఉండేవి. విప్లవోద్యమం కోసం కామ్రేడ్స్ సుందరయ్య, రాజేశ్వరరావు మున్నగు వారితో సహా, తమ వ్యక్తిగత ఆస్తులను అమ్మి పార్టీకి ఇచ్చినవారిలో కామ్రేడ్ బసవ పున్నయ్య ఒకరు. కామ్రేడ్ బసవ పున్నయ్య ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాయంలో పార్టీ పనిలో ఉంటూనే 1992 ఏప్రిల్ 12వతేది సాయత్రం అకస్మాత్తుగా మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# భక్తికి, సేవానిరతికి మారు పేరు హన్మంతుడు - భక్తాగ్రేసరుడు హన్మంతుడు

## చైత్ర పౌర్ణమి చిన్న హన్మాన్ జయంతి సందర్భంగా




హైందవ సంస్కృతిలో పెక్కు పండగలున్నాయి. అవి రుతుపర, మత ప్రమేయ, పురాణేతిహాస సంబంధమైనవి. అందు అసమాన భక్తాగ్రేసరుడు, ఆదర్శ పురుషుడు, నమ్మిన బంటు, సంస్కృతాద్యనేక భాషలు, వ్యాకరణాది శాస్త్రాలు, సంగీతాది కళలలో నిష్ణాతుడు. అయిన హనుమత్ జయంతి ప్రాశస్త్య మైనది. అశ్వథామ బలిర్వ్యాస : హనుమాన్ శ్చ విభీషణ: కృప : పరశురామశ్చ సప్తేతే చిరజీవిన : మార్కండేయస్తు అష్టమ: ప్రోక్త : అశ్వత్థామ, బలి చక్రవర్తి, వ్యాసుడు, హనుమంతుడు, విభీషణుడు, కృపాచార్యుడు, పరశు రాముడు, మార్కండేయుడు తదితరులను చిరంజీవులు గా భావిస్తారు. ఒక కల్పం అంటే నాలుగు వందల ముప్పయి రెండు మిలియన్ల సంవత్సరాలు జీవించే ఎనిమిది మంది చిరంజీవులలో ఒకరైన హనుమంతుని జయంతి ప్రత్యేకత కలిగి ఉంది. భారతావనిలో వివిధ ప్రాంతాలలో హన్మాన్ జయంతిని వివిధ మాసాలలో జరుపు కుంటారు. ఆంజనేయుడు, హనుమంతుడు, హనుమాన్, బజరంగబలి, మారుతి, అంజనిసుతుడు వంటి ఎన్నో పేర్లతో హనుమంతుని ఆరాధిస్తారు. ఉత్తర భారత దేశంలో వారణాసిలో సంకట మోచన దేవాలయం, అయోధ్యలో హన్మాన్ గార్హి దేవాలయాలలో ఈ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో "మార్గళి" మాసం అనగా డిసెంబర్ లేదా జనవరిలలో జరుపు కుంటారు. ఒరియా క్యాలెండర్ ప్రకారం విషుభ సంక్రాంతి మొదటి రోజున వైశాఖంలో పాటించే ఆచారం ఉంది. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటకలలో వైశాఖ కృష్ణపక్ష మందు పెద్ద హన్మాన్ జయంతిగా జరుపుకునే సాంప్రదాయం ఉంది. చైత్ర పౌర్ణమి (చిన్న హన్మాన్ జయంతి)తో ప్రారంభించి, హన్మాన్ దీక్షలను వైశాఖ కృష్ణ పక్ష దశమి (పెద్ద హన్మాన్ జయంతి)కి ముగిసేలా 41రోజుల మండల దీక్షలను చేపట్టడం ఆనవాయితీగా, సాంప్రదాయ సిద్దంగా వస్తున్నది. ప్రధానంగా రామాయణంలో హనుమంతుని పాత్ర అద్వితీయం. రామాయణంలోని ఆరు కాండల్లోని చివరి మూడు కాండల్లో కథ నడిచిన మహనీయుడు హనుమంతుడు. హనుమంతుని స్తుతించే హనుమత్కవచాన్ని ఆంజనేయాలయంలో లక్ష ఇరవై అయిదు సార్లు పఠించిన వారికి గాలిలో ఎగిరే శక్తి, అణిమాద్యష్టసిద్ధులు లభ్య మవుతాయని నమ్మకం. ప్రేతపతి అయిన శివునికి ఎంత భూతాల మీద ఆధిపత్యం ఉందో హనుమంతునికి అట్టిది కలదని భావిస్తారు. పంచభూతాలను వశం చేసుకున్న పరమాత్ముడు అయన.. జ్ఞానేంద్రియాలను నియంత్రణలో ఉంచుకోగలిగిన మహాశక్తిశాలి. అందుకే గ్రహ పీడకు ఆంజనేయుని కొలుస్తారు. ఉన్మాద రోగాలకు ఆంజనేయ ప్రదక్షిణలు చేస్తారు. చిన్న పిల్లలకు ఆంజనేయ బొమ్మ చెక్కిన యంత్రపు బిళ్ళలను మెడలో కడుతారు. పిల్లలు, పెద్దలు ఆపత్సమయాలలో, భయం కలిగే వేళలలో ఆంజనేయ దండకం చదువడం చిరకాలంగా అనుసరిస్తున్న సంప్రదాయం. శివాజీ గురువైన సమర్థ రామదాసు హనుమంతుని భక్తుడు కాగా, మహారాష్ట్రుల జెండా మీద గదాపాణియైన హనుమంతుడు ఉంటారు. పాండవ మధ్యముడైన అర్జునుని జెండాపై ఉపవిష్ణుడై హనుమంతుడు మహా భారత యుద్ధంలో అర్జునునికి రక్షణగా ఉన్న గాధ అందరికీ తెలిసిందే. హనుమంతుడికి స్వర్గ ప్రాప్తి లభించినా, పవనసుతుడు అందుకు అంగీకరించక, తాను భూమిపైనే రాముడి భక్తుడిగా కలకాలం ఉండిపోతానని కోరుకుంటాడు. అందుకు శ్రీ రాముడు కూడా ఒప్పుకుంటాడు. ఈ కారణంగానే భూమిపై రాముడిని ఇప్పటికీ భజనలు, కీర్తనలతో కొలుస్తున్నారు. ఆజన్మ బ్రహ్మచారిగా ఉన్న ఆంజనేయుడు, అవతార పురుషుడు అయిన శ్రీ రాముడినే తన హృదయంలో బంధించి భక్తిలో ఎవరికీ సాటి లేదని చాటాడు. హనుమంతుడు సీతా రాముల దాసునిగా, రామ భక్తునిగా, విజయ ప్రదాతగా, రక్షకునిగా హిందూ మతములో అత్యంత భక్తి శ్రద్ధలతో కొలువబడే దైవంగా నిత్య పూజలు అందుకుంటున్నాడు. ప్రతి గ్రామానికీ ఆయన క్షేత్ర పాలకుడు. అంటే గ్రామ రక్షకుడు. భగవద్దాసులలో సాటిలేని ఆంజనే యుని పూజకు ఉద్దిష్టమైన చైత్ర పూర్ణిమతోపాటు, వైశాఖ బహుళ దశమి నాడు కూడా ప్రత్యేక అర్చనలు, పూజాదులు నిర్వహించడం సదాచార సాంప్రదాయంగా వస్తున్నది. రావణుని బారి నుండి శనిని ఆంజనేయుడు కాపాడుతాడు. అందుకు రుణపడిన శనీశ్వరుడు.. హనుమంతుడిని సేవించేందుకు ఉద్యుక్తుడవుతాడు. అయితే తన భక్తులకు శని ప్రభావం లేకుండా చూడాలని శనీశ్వరుడిని హనుమ అడుగుతాడు. అప్పటి నుంచి హనుమంతుడిని కొలిచేవారిపై శని చెడు ప్రభావం ఉండదనే విశ్వాసంతో, శని దేవుని పూజించేవారు తప్పనిసరిగా అంజన్నను కొలుస్తారు. అంతేకాదు హనుమాన్ చాలీసా రోజూ పఠిస్తే శని చెడు ప్రభావం సోకదని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# వైభవంగా కొల్హాపూర్ మహాలక్ష్మి రథోత్సవం - ఏప్రిల్ 23... కొల్హాపూర్ మహాలక్ష్మి రథోత్సవ సందర్భంగా...

కొల్హాపూర్ మహాలక్ష్మి రథోత్సవం ప్రతి సంవత్సరం చైత్ర మాసంలో చైత్ర పౌర్ణమి రోజున ఈ ఉత్సవం జరుగుతుంది. ఈ ఏడు ఏప్రిల్ 23వ తేదీన మంగళ వారం లక్ష్మీ దేవి మూర్తిని కలిగి ఉన్న రథాన్ని రాత్రి 7:30 నుండి ఊరేగింపుగా తీసుకు వెళతారు.. ఈ సందర్భంగా వెండి రథాన్ని ప్రత్యేక దీపాలు, పూలతో అలంకరించారు. హిందూ సాంప్రదాయంలో లక్ష్మీదేవిని పూజించడం సర్వత్రా కనిపించే దయినా, అనునిత్యం పూజలందుకునే శ్రీమహాలక్ష్మికి మన దేశంలో విడిగా వున్న ఆలయాలు తక్కువే. లక్ష్మీదేవికి ప్రత్యేకించి వున్న ఆలయాలలో కొల్హాపూర్ ఆలయం ముఖ్యమయినది. ఈ ఆలయం మహారాష్ట్రలోని కొల్హాపూర్ లో పంచగంగ నది ఒడ్డున బెంగళూరు మరియు పూణే మధ్య జాతీయ రహదారిపై ఉంది. ఇది అమ్మవారి అష్టాదశ శక్తి పీఠాలలో ఏడవది. స్కాంద పురాణం, దేవీ భాగవతాలలో ఈ క్షేత్రాన్ని కరవీర నగరమని, దేవిని కరవీర మహాలక్ష్మి అని ప్రస్తుతించారు. పరమశివుడికి కాశీ ఎలా అవిముక్త క్షేత్రమో, శ్రీ మహావిష్ణువుకి, లక్ష్మీదేవికి ఇది అవిముక్త క్షేత్రం. వారీ క్షేత్రాన్ని ఎప్పుడూ విడవకుండా వుంటారు. అగస్త్య మహాముని అచంచల శివభక్తుడు. ఏటా కాశీ వెళ్లి విశ్వనాథుణ్ణి దర్శించుకునేవాడు. వృద్ధాప్యంలో అగస్త్యుడికి సుదూరంలో ఉన్న కాశీనగరాన్ని దర్శించుకోవడం కష్టమనిపించి, శివుడి గురించి తపస్సు చేయగా, శివుడు ప్రత్యక్షమై, వరం కోరుకోమన్నాడు. అగస్త్యుడు తాను వయోభారంతో ఏటా కాశీలో ఉన్న విశ్వనాథుణ్ణి దర్శించుకోలేకపోతున్నానని, కాశీకి ప్రత్యామ్నాయంగా తనకో క్షేత్రాన్ని చూపిస్తే, అక్కడే తాను శివుణ్ణి దర్శిస్తానని కోరాడు. కాశీతో సమానమైన ప్రాశస్త్యం గల నగరం కొల్హాపురమని, అక్కడ శ్రీ మహాలక్ష్మి అమ్మవారు కొలువై ఉన్న క్షేత్ర సందర్శనం తనను కాశీలో దర్శించుకున్నంత పుణ్యఫలాలనిస్తుందని చెప్పాడట. శివుని ఆనతిమేరకు అగస్త్యుడు కొల్హాపూర్‌లో మహాలక్ష్మిని, అతిబలేశ్వరస్వామిని దర్శించి పునీతుడయ్యాడని ఇక్కడి స్థలపురాణాల ద్వారా స్పష్టం అవుతున్నది. ప్రళయకాలంలో శివుడు తన త్రిశూలంతో కాశీ పట్టణాన్ని ఎత్తి రక్షించినట్లు, మహాలక్ష్మి ఈ క్షేత్రాన్ని తన కరములతో ఎత్తి రక్షించింది. అందుకే ఆమె కరవీర మహాలక్ష్మి అయింది అంటారు. భృగు మహర్షి చేసిన అవమానాన్ని తట్టుకోలేని మహాలక్ష్మి వైకుంఠాన్ని విడిచి సహ్యాద్రి పర్వత ప్రాంతంలోని కొల్హాపూర్‌లో వెలిశారని ఒక కథ. శంకరాచార్యులవారు ఈ ఆలయాన్ని దర్శించి ఇక్కడ శ్రీ చక్రాన్ని స్థాపించారు. తర్వాత విద్యాశంకర భారతి ఈ క్షేత్ర వైశిష్ట్యాన్ని గుర్తించి



ఇక్కడ ఒక మఠం నిర్మించారు. దత్తాత్రేయుడు ప్రతి రోజూ మధ్యాహ్నం ఇక్కడ భిక్ష చేస్తారని ప్రతీతి. దానికి చిహ్నంగా ఇక్కడ ఆయనకి ఉపాలయం వున్నది. షుమారు 6 వేల సంవత్సరాల క్రితం ఆలయంగా భావిస్తారు. తర్వాత అనేక రాజుల సమయాలలో అభివృద్ధి చెందిన ఈ మందిరం విశాల ప్రాంగణంలో హేమాడ్ పంత్ శైలిలో, శిల్పకళా నైపుణ్యంతో నిర్మింపబడింది. 7 వ శతాబ్దం లోని ఈ దేవాలయాన్ని చాళుక్య వంశ రాజైన కరన్దేవ్ తిరిగి చాలాకాలం తరువాత దీని నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పవిత్ర స్థల నిర్మాణ శైలి హేమండ్ పతి ప్రేరణతో చేయబడింది. ఈ ఆలయాన్ని యాదవ వంశీయులు 8 వ శతాబ్దంలో మరింత అందంగా తీర్చిదిద్దారని చెపుతారు. ఈ నగరాన్ని కోల్‌పూర్ అని కోల్‌గిరి అని, కొలదిగిరి పట్టణ్ అని పిలిచేవారు. 'కొల్లా' అంటే 'లోయ'అని, 'పూర్' అంటే పట్టణమనే అర్థంలో ఈ క్షేత్రం విలసిల్లిందని చెబుతారు. కొల్హాపూర్ క్షేత్రాన్ని 1359వ సంవత్సరం వరకు శివాజీ మహారాజు పూర్వీకులు పాలించగా, 17వ శతాబ్దంలో ఛత్రపతి శివాజీ ఏలుబడిలో దినదిన ప్రవర్థమానమైందని తెలుస్తోంది. నాలుగు దిక్కులా ముఖద్వారాలు కలిగి ఆలయం 5 గోపురాలకింద వుంటుంది. మధ్యలో ఒక గోపురం, నాలుగు దిక్కులా నాలుగు గోపురాలు. తూర్పు గోపురం కింద మహాలక్ష్మి, మధ్య కుమార మండపం, పడమర గణపతి, ఉత్తర దక్షిణ గోపురాల కింద మహాకాళి, మహా సరస్వతి కొలువుతీరి వున్నారు. ఉపాలయాలలో వెంకటేశ్వరస్వామి, నవగ్రహాలు, రాధాకృష్ణ, కాలభైరవ, వినాయకుడు, సింహవాహిని, తుల్జాభవాని వగైరా అనేక దేవీ దేవతలున్నారు. గర్భగుడిలో అమ్మవారి విగ్రహం సుమారు ఆరడుగుల చదరంగా ఉన్న ఎత్తైన వేదిక మీద రెండడుగుల పీఠం, దానిమీద మహాలక్ష్మి కూర్చొని ఉన్న భంగిమలో ఉంటుంది. చతుర్భుజి. నాలుగు చేతులలో పండు, గద, డాలు, పానపాత్ర ధరించి వుంటుంది మూడడుగుల ఎత్తున్న మూర్తి, అనేక ఆభరణాలతో సుసజ్జిత. చాలా అందంగా ఆకర్షణీయంగా ఉంటుంది. వెనుక సింహ వాహనము కనబడుతుంది. మూలవిరాట్ పడమటి ముఖంగా వుంటుంది. ఇక్కడ సూర్యకిరణాలు ప్రతిరోజూ దేవతా విగ్రహానికి బంగారు సొగసులు అందిస్తూ తాకే విధంగా ఈ ఆలయం నిర్మించబడింది. సంవత్సరానికి 2, 3 సార్లు...సూర్యాస్తమయం అయినపుడు సూర్యుని కిరణాలు ఈ కిటికీ గుండా ప్రతి సంవత్సరం 21 మార్చి, 21 సెప్టెంబరు లలో మూడు రోజులపాటు విగ్రహంపై పడతాయి. పడమటి దిక్కులోగల చిన్న కిటికీగుండా అమ్మవారి ముఖాన్ని తాకుతాయి. ఈ ప్రత్యేక దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. గర్భగుడి గోడపై శ్రీచక్రం వుండటం ఇక్కడ ప్రత్యేకం... మొదట ఒక్క మహాలక్ష్మినే ప్రతిష్ఠించారు. తర్వాత 11వ శతాబ్దంలో గండరాదిత్య హయాంలో మరమ్మత్తులు, ప్రదక్షిణబాట, మహాకాళీ, మహాసరస్వతి ప్రతిష్ట జరిగాయి. మూలవిరాట్ కి మహాకాళికి మధ్య మహాలక్ష్మి యంత్రం స్థాపించ బడింది. దీనిపైన గాజుపలక వుండటంతో భక్తులు దర్శించుకోవటానికి వీలుగా వుంటుంది. మహారాష్ట్రీయులకు కొల్హాపూర్ మహాలక్ష్మి అత్యంత పవిత్ర యాత్రాస్థలం. వీరు అమ్మవారిని 'అంబాబాయి' అని పిలుస్తారు. అమ్మవారికి రోజూ అయిదు సార్లు అర్చన జరుగుతుంది. ఉదయం అయిదు గంటలకు శ్రీ మహా లక్ష్మీ దేవికి సుప్రభాత సేవ చేస్తారు. కాకడ హారతి ఇస్తారు. ఉదయం ఎనిమిది గంటలకు షోడశోపచార పూజ నిర్వహిస్తారు. మధ్యాహ్నం, సాయంత్రాలలో పూజ, శేజ్ హారతి జరుపుతారు. అమ్మవారికి ప్రతి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. చైత్రమాసంలో వచ్చే పౌర్ణమితో పాటుగా నవరాత్రులపుడు అమ్మవారికి వేడుకలు జరుపుతారు. ప్రతి శుక్రవారం సాయంత్రాలలో, పౌర్ణమి నాడు, అమ్మవారిని ఆలయం వెలుపల ఊరేగిస్తారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# నీరు నిలుపు.. సాగుకు మలుపు

తాండూరు : తాండూరు శివారులోని కాగ్నా నదికి వరదలొచ్చినప్పుడు ఆనకట్టలు లేక నీరంతా దిగువకు వృథాగా వెళ్లిపోయేది. కళ్లముందే పొలాలకు పారాల్సిన నీరు ఇలా నేలపాలవుతుంటే రైతులు తీవ్ర ఆవేదనకు లోనయ్యేవారు. అడ్డుకట్టలు కడితే కొంతమేరకైనా వృథాను అరికట్టవచ్చని నీరు నిలిచి పొలాలకు పారించి పంటలు పండించుకోవచ్చని రైతులు అధికారులకు పదేపదే విన్నవించేవారు. ఎట్టకేలకు వారి కృషి ఫలించింది. తాజాగా వరద నీరు వృథాగా పోకుండా అధికారులు ఆనకట్టలు నిర్మిస్తున్నారు.

రూ.10 కోట్లవ్యయం: ఇప్పటికే నదిలో దిగువ, ఎగువ రెండు ఆనకట్టల్ని నిర్మించారు. రూ.10 కోట్ల వ్యయంతో కొత్తగా కట్టలు నిర్మిస్తున్నారు. వర్షా కాలంలో కురిసే వానకు నదిలోకి భారీగా వచ్చే వరద నీరు వృథాగా అటుఇటూ వెళ్లకుండా మరో కట్టను నిర్మిస్తున్నారు. తాండూరు- కొడంగల్ మార్గంలోని వంతెనకు ఎగువన కొత్తగా నిర్మించిన ఆనకట్ట వద్ద వరద నీరు నిల్వటానికి అధికారులు రెండు వైపులా మరో కట్టను ఏర్పాటు చేస్తున్నారు. వరద నీరు వచ్చినప్పుడు ఇది వరకు నదీ పరివాహక ప్రాంతాల్లోకి వెళ్తూ పంట పొలాలను దెబ్బతీసేది. నదికి రెండు వైపులా కట్టలు ఏర్పాటు చేస్తుండటంతో



వరద నీరు ఆనకట్ట వద్దే నిల్వ ఉంటుంది.

**కొడంగల్‌కు మెరుగైన తాగునీటి సరఫరా..**

ఇక్కడి ఆనకట్ట నుంచే కొడంగల్ నియోజకవర్గానికి తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందులో భాగంగానే నీటి సరఫరా మరింత మెరుగు కోసం ఆనకట్టకు రెండు వైపులా కిలో మీటర్ల పొడవునా కొత్తగా మట్టి కట్టలు ఏర్పాటు చేస్తున్నారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వచ్చే వర్షా కాలం నాటికే పూర్తి చేసే విధంగా వేగంగా చేస్తున్నారు. నదిలోని మట్టినే తీసి కట్టలు ఏర్పాటు చేస్తున్నారు. నది మధ్యలో ఆనకట్ట, రెండు వైపులా మట్టి కట్టలతో వరద నీరు భారీగా నిల్వ ఉండటానికి అవకాశాలు ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి సాగు, తాగు నీటికి ఇబ్బందులు ఉండవని అధికారులు వివరిస్తున్నారు.

# పశుపోషకులకు బాసట

చొప్పదండి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువుల షెడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో గ్రామీణాభివృద్ధి పనులకు ప్రాధాన్యమివ్వగా.. ఈసారి వాటికి భిన్నంగా వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి కృషి చేయాలని భావించింది. వేసవిలో జల సంరక్షణకు ఇంకుడుగుంతలు, చేపల కొలనులతోపాటు పాడి రైతుల కోసం ప్రత్యేకంగా షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు.

**నాలుగు పశువులు ఉంటేనే..**

గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగి ఉండి కనీసం నాలుగు పశువులను కలిగి ఉంటేనే షెడ్ల నిర్మాణానికి అనుమతినిస్తారు. పశువుల షెడ్లతోపాటు దాని పక్కనే తాగునీటి ట్యాంకు, పశుగ్రాసం నిల్వ చేసుకునేందుకు ప్రత్యేక గదిని సైతం నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు చిన్న, సన్నకారు రైతులు తమ పశువులను పొలాల వద్ద చెట్ల కింద కట్టేసేవారు. దీంతో వాటి ఆరోగ్యంపై వాతావరణ పరిస్థితులు ప్రభావం చూపడంతో వ్యాధుల బారినపడేవి. ఈ సమస్యను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పశువుల షెడ్ల నిర్మాణానికి



అనుమతినివ్వడంతో వారి కష్టాలు తీరనున్నాయి.

**రూ.లక్ష వరకు కేటాయింపు**

జిల్లాలో 15 మండలాల పరిధిలో 926 షెడ్ల నిర్మాణానికి అనుమతి రాగా.. ఇప్పటివరకు 336 నిర్మించారు. మిగతావి ప్రగతిలో ఉన్నాయి. ఈనెలాఖరు వరకు వీటన్నింటిని పూర్తి చేసేలా ఉపాధిహామీ సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. ఈ దిశగా క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు కేటాయిస్తున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి : శ్రీధర్, డీఆర్డీవో కరీంనగర్**

పాడి రైతులకు పశువుల షెడ్ల నిర్మాణంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. మార్చి 31 లోగా వీటైనన్ని పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఇవి పాడి రైతుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి.

# సన్నబియంతో సంతృప్తికరంగా భోజనం..!

కొత్తగూడెం: పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉగాది (ఈనెల 30) నుంచి రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పౌరసరఫరాలశాఖ అధికారులు సన్నాహాలు మొదలుపెట్టారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న లబ్ధిదారుకు ప్రస్తుతం ఆరు కిలోల చొప్పున దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇకపై వీటి స్థానంలో సన్నబియ్యం అందించనున్నారు. రైతుల నుంచి కొన్న సన్నధాన్యాన్ని మరపట్టించి తిరిగి నిరుపేదలకు పంపిణీ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.అక్రమాలకు అడ్డుకట్ట.. ఇన్నాళ్లు 'రేషన్' లబ్ధిదారులకు ప్రతినెలా దొడ్డు బియ్యం పంపిణీ చేశారు. అయితే అందులో ఎక్కువ శాతం మంది వాటిని తినలేక దళారులకు విక్రయించటంతో పథకం లక్ష్యం నీరుగారేది. లబ్ధిదారులు మార్కెట్‌లో సన్న బియ్యాన్ని కొనుగోలు చేస్తుండటంతో వాటి ధరలకు రెక్కలొస్తున్నాయి. ఈనేపథ్యంలో రేషన్‌కార్డుల ద్వారా ఉచితంగా సన్నబియ్యం అందించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. **ఏడు లక్షల కార్డులు.. 11వేల మె.ట. బియ్యం**ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 7,05,950 రేషన్‌కార్డులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటికి ప్రతినెలా సుమారు 11వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని అంచనా వేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇచ్చేందుకు, పాతకార్డుల్లో పేర్లు చేర్చేందుకు చర్యలు చేపట్టింది. దరఖాస్తుల విచారణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఏప్రిల్‌లో కొత్తకార్డులు అందుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. ఇదే జరిగితే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల బియ్యం కోటా పెంచాల్సి ఉంటుంది. సుమారు 60 నుంచి 70వేల వరకు కార్డులు, 3లక్షల వరకు యూనిట్లు పెరిగే అవకాశం ఉన్నందున కనీసం 2వేల మెట్రిక్ టన్నుల బియ్యం అదనంగా కావాలి.

# జోరుగా హవాలా దందా



సిరిసిల్ల : జిల్లాలో విదేశీ నగదు, బంగారం చేతులు మారుతున్న దందా చాపకింద నీరులా సాగుతోంది. ఇటీవల చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన నలుగురు వ్యక్తులు గల్ఫ్ నుంచి 40 తులాల బంగారం తీసుకొచ్చారు. దీనిని వేములవాడకు చెందిన వ్యక్తికి అప్పగించాలి. స్వగ్రామం వచ్చినవారు బంగారం ఇవ్వకపోవడంతో అతను పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల జోగాపూర్‌కు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరూ బంగారం తీసుకొని శంషాబాద్ విమానాశ్రయంలో మిగతా ఇద్దరికి అప్పగించినట్లు పోలీసుల విచారణలో పేర్కొన్నారు. మిగతా ఇద్దరు బంగారంతో పరారైనట్లు గుర్తించారు. గతంలోనూ వేములవాడ పోలీసు సబ్‌డివిజన్‌లో ఏజెన్సీల నుంచి నగదు మార్పిడిలో ఇలాంటి వ్యవహారాలు వెలుగు చూశాయి. నగదు మార్పిడిలో హవాలా దందా ఎక్కువగా జరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీ మొత్తంలో నగదు, బంగారం చేతులు మారడంలో తేడా వస్తే తప్ప విషయం బయటకు రావడంలేదు. అక్రమ మార్గంలో వచ్చేవి కాబట్టి చట్టబద్ధత ఉండదు. పోలీసులకు వచ్చే ఇలాంటి ఫిర్యాదులు విచారణతోనే ముగించేయడం గమనార్హం.

**మార్పిడి జరుగుతోందిలా**

కుటుంబాలకు దూరంగా విదేశాల్లో కష్టపడి సంపాదించిన సొమ్మును స్వస్థలాలకు పంపేందుకు అనేక మార్గాలున్నాయి. స్థానిక నగదు బదిలీ సంస్థలు.. బ్యాంకుల ద్వారా పంపిస్తుంటారు. ఇలా పంపినప్పుడు అక్కడ ఛార్జీలు.. పన్ను రూపంలో నగదులో కోత పడుతుంది. బ్యాంకుల ద్వారా లావాదేవీలు జరపాలంటే చాలా సమయం పడుతుంది. దీనికితోడు ఆంగ్లంలో రాయడం.. అక్కడి భాష తెలిసి ఉండాలి. ఇది తెలియని కార్మికులు ఏజెన్సీలను ఆశ్రయిస్తుంటారు.

అక్కడి ఏజెన్సీల్లో మన రాష్ట్రం వారే ఏజెంట్లుగా పనిచేస్తుంటారు. నగదు, బంగారంతోపాటు పూర్తి వివరాలు అందజేయాలి. వాటి ఆధారంగా గంటల వ్యవధిలోనే ఇక్కడి ఏజెంట్లు నగదు బ్యాంకులో జమ చేస్తారు. నేరుగా తీసుకెళ్లికూడా ఇస్తుంటారు. ఇలా చేసే రూ.లక్షకు రూ.వెయ్యి చొప్పున కమీషన్ తీసుకుంటారు.

గల్ఫ్‌లోని ఏజెన్సీలకు రాష్ట్ర వ్యాప్తంగా ఏజెంట్లున్నారు. అక్కడి నగదు అక్కడే ఉండగా.. ఇక్కడి నగదును తమ ఏజెంట్ల ద్వారా పంపిణీ చేస్తుంటారు.

ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలసవెళ్లే వారు అక్కడ చట్టబద్ధంగా నడిచే బ్యాంకుల వివరాలు తెలుసుకోవాలి. అంతేకాకుండా నగదు బదిలీ చేసుకునేలా అవగాహన పెంచుకోవాలి. ఏజెన్సీలను ఆశ్రయిస్తే డబ్బులు పంపినట్లు ఆధారాన్ని దగ్గర ఉంచుకోవాలి. ఇబ్బందులు తలెత్తినప్పుడు ఫిర్యాదు సమయంలో ఉపయోగపడుతుంది.

# అడుగంటుతున్న జలం



ఎల్లారెడ్డిపేట : మెట్ట ప్రాంతమైన జిల్లాలో యాసంగిలో సాగుచేసిన వరిపంటకు సాగునీటి వినియోగం భారీగా పెరిగింది. వివిధ మండలాల్లో వరిపైరు కోత దశకు చేరుకోగా మరికొన్ని మండలాల్లో ఈనే దశలో ఉంది. ఈ నేపథ్యంలో సాగునీటిని ఎక్కువగా వాడుతున్నారు. ఓ వైపు ఎండలు ముదిరిపోతుండటం, మరోవైపు సాగునీటిని ఎక్కువగా పారించడం వల్ల చెరువులు, కుంటల్లో సైతం నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. ఈ ప్రభావం భూగర్భజల మట్టాలపై పడుతోంది. జిల్లాలో భూగర్భజల మట్టాలు క్రమేణా లోతుకు దిగజారుతున్నాయి. గొట్టపు బావుల నుంచి నీటిధార తగ్గిపోతోంది. ఎంతో కష్టపడి సాగుచేసిన యాసంగి పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే కర్షకులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో అత్యధికంగా 17.84 మీటర్ల లోతుతో భూగర్భజల మట్టాలు ప్రమాదఘంటికలు మోగిస్తున్నాయి.

**జోరుగా పంటల సాగు**

గతేడాది సమృద్ధిగా కురిసిన వర్షాలకు జిల్లాలోని నీటి వనరులు జలకళను సంతరించుకున్నాయి. పల్లెల్లోని సాగునీటి వనరుల్లో నీరు ఆశాజనకంగానే కనిపించింది. ఈ యాసంగిలో ఆయకట్టు భూములకు సాగునీటిని విడుదల చేశారు. నీటి లభ్యత ఆధారంగా జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. రైతులు యాసంగిలో ప్రధానపంటగా 1,78,350 ఎకరాల్లో వరి, 1975 ఎకరాల్లో మొక్కజొన్న, 50 ఎకరాల్లో గోధుమ, 1491 ఎకరాల్లో మొక్కజొన్న, 300 ఎకరాల్లో శనగ, 43 ఎకరాల్లో పెసర, 26 ఎకరాల్లో వేరుశనగ, 1206 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, 109 ఎకరాల్లో గోధుమ సాగుచేశారు.

**అన్నదాతల ఆందోళన**

జిల్లాలో భూగర్భజల మట్టాలు ఒక్కసారిగా పడిపోతున్నాయి. బోరుబావుల్లో నుంచి ఊట క్రమంగా తగ్గిపోతోంది. కొన్నిచోట్ల పూర్తిగా వట్టిపోతుండగా వందల ఎకరాల విస్తీర్ణంలోని వరిపైరు ఎండిపోతోంది. ఫిబ్రవరి మాసంలో జిల్లా సగటు భూగర్భజల మట్టాలు 9.28 మీటర్లుండగా మార్చి నెలలో 11.27 మీటర్ల లోతుకు చేరుకున్నాయి. వేములవాడ గ్రామీణంలో అత్యల్పలోతు 5.84 మీటర్లలో భూగర్భజల మట్టాలుండగా ఎక్కువ లోతు 17.84 మీటర్లలో ఎల్లారెడ్డిపేట మండలంలో జలాలు లభిస్తున్నాయి. గతేడాది మే నెలతో పోల్చితే ఈ ఏడాది మార్చిలో 0.66 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. అదే సంవత్సరం మార్చి మాసానికి ఈ ఏడాది మార్చి నెలతో పోల్చితే 0.53 మీటర్లకు పెరిగాయి. భూగర్భజల మట్టాల్లో తరుగుదల ఏప్రిల్, మే నెలల్లో మరింత ఎక్కువయ్యే అవకాశాలున్నాయి. చాలాచోట్ల పొట్టదశకు చేరుకున్న వరిపైరు పశుగ్రాసం పాలవుతుండంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడులు సైతం చేతికందే పరిస్థితి లేదని వాపోతున్నారు. పంటలను కాపాడుకోవడానికి అప్పులు చేసి కొత్తగా బోరుబావులను తవ్విస్తూ రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు.

# విధుల ఎగవేతపై నిఘా

కరీంనగర్ : విధులకు హాజరైనట్టే హాజరై మధ్యలో వెళ్లి, చివరి నిమిషంలో వచ్చి పనులు చేసినట్లుగా వ్యవహరించే ఉద్యోగులపై ఇక నిఘా ఉండనుంది. వారి హాజరు విధానాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా వైద్యారోగ్య శాఖ కొత్త విధానాన్ని ప్రవేశ పెట్టనుంది. దీనికోసం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది.

**ఆధార్‌తో ఆబాస్**

ఆధార్ నంబరుతో అనుసంధానంగా ఆబాస్ విధానాన్ని అనుసరించి విధుల్లో ఉన్న స్థానం నుంచి హాజరు వేసుకునేలా కొత్త విధానం అమల్లోకి రానుంది. తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ సంస్థ అభివృద్ధి చేసిన చరవాణి ముఖ ఆధారిత జియో ఫెన్సెడ్ పద్ధతిలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టనుంది. ఇదివరకే బయోమెట్రిక్ ఉన్నచోట సైతం ఈ విధానం అమలు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

**వివరాల సేకరణ**

విధులకు వచ్చి మధ్యలో వెళ్లి పనులు చూసుకొని వచ్చే ఉద్యోగులకు, అధికారులకు ఈ విధానం పూర్తి స్థాయిలో చెక్ పెట్టనుంది. ప్రస్తుతం కొందరు ఉద్యోగులు విధులకు వచ్చినట్లే వచ్చి మధ్యలో వెళ్లడం, క్షేత్రస్థాయికి వెళ్తున్నట్లు చెప్పడం వంటివి జరుగుతున్నట్లుగా ఆరోపణలున్నాయి. కొందరైతే మధ్యాహ్నం పని వేళలు పాటించకుండా ఇష్టారీతిగా ఉంటున్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ, వైద్య విధాన పరిషత్ పరిధిలోని అధికారులు, వైద్యులు, సిబ్బంది నుంచి ప్రస్తుతం ఆధార్ వివరాలు సేకరిస్తున్నారు.

ఈ ప్రక్రియ పూర్తి కాగానే త్వరలోనే యాప్ అమల్లోకి రానుంది. దీని ద్వారా అన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారితోపాటు అందరూ హాజరు విధానాన్ని అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. విధుల్లో చేరినప్పుడు కార్యాలయ సమయం ముగియగానే ఆబాస్ ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

సమయానికి హాజరు కావాల్సిందే

కొత్త విధానంతో సమయం ప్రకారం విధులకు హాజరు కావాల్సిందే. నిర్లక్ష్యం చేసే వారి ఆటలిక సాగవు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆధార్ వివరాలు పంపిస్తున్నాం. అక్కడి నుంచి ఉత్తర్వులు రాగానే పకడ్బందీగా అమలు చేస్తాం.

డా.వెంకటరమణ, డీఎంహెచ్‌వో, కరీంనగర్

జిల్లా వివరాలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు :18

పల్లె దవాఖానాలు : 97

పట్టణ ఆసుపత్రులు : 6

జిల్లా కేంద్ర ఆసుపత్రి : 1

మాతా శిశు కేంద్రం : 1

వెల్‌నెస్ సెంటర్ : 1 వైద్యవిధాన పరిషత్తులు :2

# చరిత్రకు సాక్ష్యం..నిలువెల్లా నిర్లక్ష్యం

ధర్మపురి : ధర్మపురిలోని చారిత్రక సత్యవతీ ఆలయం నిర్లక్ష్యానికి గురవుతోంది. పురాతన ఆలయాల్లో ఒక్కటైనా ఈ ఆలయం కొన్ని దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. కనీసం లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా కూడా ఈ ఆలయాన్ని పట్టించుకోవడం లేదు. మౌలిక వసతుల కల్పన.. మరమ్మతులు గగనంగా మారాయి. ఆలయంలో విద్యుత్తు సౌకర్యం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. **చెక్కు చెదరని ఇసుక స్తంభం**సత్యవతీ ఆలయం ఒకనాడు నృసింహాలయమేనని చరిత్రకారులు చెబుతున్నారు. జానపద గీతాలు, కథల ప్రకారం సత్యవతీ అనే స్త్రీ పాము రూపంలో ఉన్న తన భర్తను మనిషి రూపంలో మార్చుకోవడానికి వివిధ పుణ్యక్షేత్రాలు తిరుగుతూ.. ధర్మపురికి చేరుకుంటుంది. ఇక్కడి గోదావరిలో స్నానం చేయడంతో ఆమె భర్త మనిషి రూపంలోకి మారుతాడు. అయితే తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేయడంతో పాతివ్రత్యాన్ని నిరూపించుకోవడానికి సత్యవతీ ఆకాశంలో ఇసుక చిమ్మడంతో అది స్తంభంగా మారుతోంది. దానినే ప్రస్తుతం ఇసుక స్తంభంగా పిలుస్తున్నాం. ఈ స్తంభం చాళుక్యుల కాల నాటిదని చరిత్ర పరిశోధకులు చెబుతారు. ఇక్కడ ఆలయం ఏర్పాటు చేసి సత్యవతీ దేవి, ఆళ్వారుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. దీంతో సత్యవతీ ఆలయంగా ప్రసిద్ధి పొందింది. చీకట్లోనే విగ్రహాలు

ప్రస్తుతం ఆలయమంతా శిథిలావస్థకు చేరింది. కనీసం మరమ్మతులకు నోచుకోకపోవడంతో వర్షాలకు ఉరుస్తోంది.

# మత్తు.. వదిలేదేలా!

మేడిపల్లి: గంజాయి సరఫరాపై పోలీసులు నిఘా పెంచుతున్నా విక్రయాలు ఆగడం లేదు. బాలుర నుంచి యువకుల వరకు బానిసలుగా మారుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు పొరుగు జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి గంజాయి సరఫరా అవుతోంది. సరఫరాదారులు, విక్రేతలు, తాగిన వారిపై కూడా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. అయినా రోజురోజుకూ కేసులు పెరుగుతున్నాయి.

**బాలలపై ప్రభావం**

ముక్కుపచ్చలారని బాలలపై గంజాయి ప్రభావం చూపుతోంది. చాలా పాఠశాలలు, కళాశాలల సమీపాల్లో గంజాయి అమ్మకాలు జరుపుతుండటంతో బానిసలవుతున్నారు. జగిత్యాల జిల్లా నుంచి గంజాయి విక్రేతల కోసం నిజామాబాద్‌కు వెళ్లిన పోలీసులకు బాలురు గంజాయి అమ్ముతుండటం విస్మయం కలిగించింది. చాలా మంది బాలురు గంజాయికి అలవాటు పడి పలు నేరాలకు కూడా పాల్పడుతున్నారు. జగిత్యాలలో ఓ కేసులో బాలికకు గంజాయి అలవాటు చేసినట్లు తెలిసి అధికారులు హతాశులయ్యారు. చాలా నేరాల్లో బాలలు కేవలం గంజాయి ప్రభావంతోనే పాల్గొన్నట్లు చెబుతుండటం దాని తీవ్రతకు అద్దం పడుతోంది. బాలురతో పాటు యువకులు వాహనాలు అతివేగంగా నడపటం, దాడులు, హత్యాయత్నాలు, నేరాలకు పాల్పడటం లాంటి ఘటనల్లో గంజాయి కూడా ఒక కారణంగా తెలుస్తోంది. జగిత్యాలలో ఓ వివాహ వేడుకలో యువకులు ఇతరులపై



దాడులకు పాల్పడిన ఘటనలో గంజాయి తాగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఉమ్మడి జిల్లాలో పలు ఘటనల్లో గంజాయి ప్రభావం చూపినట్లు నిర్ధారణ కావడంతో పలు వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.

**సరఫరా అవుతోందిలా..**

ఆదిలాబాద్, నిజామాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా సరిహద్దుల నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు గంజాయి సరఫరా అవుతోంది.

నిజామాబాద్ జిల్లా నుంచి బస్సులో గంజాయి సరఫరా చేస్తుండగా అనుసరించిన పోలీసులు నిందితులను పట్టుకున్నారు.

పెద్దపల్లి జిల్లాలో రైలుమార్గాల ద్వారా గంజాయి సరఫరా అవుతుందన్న విషయం తెలిసి పోలీసులు నిఘా పెంచారు.

కరీంనగర్ జిల్లాకు విశాఖపట్నం నుంచి కారులో సరఫరా అవుతున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.

హైదరాబాద్ నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాకు గతేడాది నుంచి గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు.

**కేసులు ఇలా..**

ఇటీవల మెట్‌పల్లికి చెందిన గోల్కొండ హరీశ్, బొల్లేపల్లి అభిషేక్‌ను మేడిపల్లి శివారులో పోలీసులు అరెస్టు చేశారు. ఒడిశా నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తుండగా పోలీసులు నిఘా వేసి పట్టుకున్నారు.

రామగుండం కమిషనరేట్ పరిధిలో ఇటీవల 120 కిలోల గంజాయిని పట్టుకున్నారు.జగిత్యాల గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కండ్లపల్లిలో కులదీప్, పవన్‌కుమార్, రాకేశ్ అనే వ్యక్తులను ఫిబ్రవరిలో అరెస్టు చేసి వారి నుంచి 130 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండు నెలల్లో 50 మందిని గంజాయి కేసుల్లో అరెస్టు చేశారు.


**పటిష్ఠ నిఘా–** రాములు, డీఎస్పీ మెట్‌పల్లి

గంజాయి అమ్మిన వారితో పాటు వినియోగించిన వారిపై చర్యలు తీసుకుంటాం. జిల్లా సరిహద్దుల్లో నిఘా ఉంచాం. ఇటీవల యువకులు, బాలలు గంజాయి బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. స్వచ్ఛంద సంస్థల వారు గంజాయిపై అవగాహన కల్పించాలి. గంజాయి అమ్మిన వారి వివరాలు సమీప పోలీస్ స్టేషన్‌కు తెలిపితే చర్యలు తీసుకుంటాం. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

# కరవు తెచ్చిన పట్టుదల.. కన్నీటి నుంచి విడుదల

కరవు కోరలు చాచింది. వర్షాకాలంలోనే భూమి బీడుబారు తోంది. యాసంగికి అయితే తాగడానికి గుక్కెడు నీళ్లు దొరకని పరిస్థితి. కాలువ ఊళ్లోనుంచే వెళ్తున్నా.. చెరువులు మాత్రం నిండవు. ఆ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు వివిధ హోదాల్లో ఉన్నా వీరి కన్నీటిని తుడవలేకపోయారు. దీంతో రైతాంగం సంఘటితమై సమస్యను పరిష్కరించుకున్నారు.

కనగల్ మండలం చిన్నమాదారం గ్రామ పంచాయతీ పరిధిలోని కుమ్మరిగూడెం, ఎర్రగూడెం గ్రామాల్లో రెండేళ్ల క్రితం వరకు పంటలు చివర వరకు పండిన దాఖలాలు లేవు. వందల అడుగుల లోతు బోర్లు వేసిన గంగమ్మ జాడ కనిపించేది కాదు. దీంతో పలువురు వ్యవసాయానికి దూరం అయ్యారు. మరికొందరు ఉన్న నీటితో తిప్పలు పడేవారు. దూరప్రాంతాల నుంచి ట్యాంకర్లతో నీటిని తెచ్చి



పంటలను కాపాడుకునే వారు. కాల్వ, ఎత్తిపోతల ద్వారా చెరువులు నింపాలని రైతులు ఎన్నో ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా.. వారిగోడు ఎవరికి పట్టలేదు.

దీంతో ఈ సమస్యను తామే పరిష్కరించుకోవాలని సంఘటితంగా కదిలారు. సొంత డబ్బుతో పాటు దాతల సహకారంతో మోటార్లకు తీసుకొచ్చారు. తలాపు నుంచి వెళ్తున్న కాలువకు వాటిని బిగించి ఎత్తిపోతల ద్వారా ఆయా చెరువులు, కుంటలను నింపారు. ఆ నీటిని నేరుగా సాగుకు వినియోగించకుండా భూగర్భ జలాలు పెంచుకున్నారు. రైతుల భగీరథ ప్రయత్నంతో నేడు ఆయా గ్రామాల్లో బావులు, బోర్లలో నీటి లభ్యత పెరిగింది. నాడు బీడు భూములుగా ఉన్న భూములు ప్రస్తుతం పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. రెండేళ్ల క్రితం ఎర్రగూడెం చెరువుకు మోటార్లు బిగించగా ఈఏడాది కుమ్మరిగూడెం చెరువును నింపుతున్నారు. ప్రభుత్వాల కోసం ఎదురు చూడకుండా సంఘటితంగా కరవును జయించిన ఈ అన్నదాతల పట్టుదల తోటి రైతులకు స్ఫూర్తిదాయకం.

చురకలు



## నారీ.. నేరవలయంలో సవారీ

హైదరాబాద్ : ఆర్థిక ఇబ్బందులు.. కుటుంబ పరిస్థితులు.. కారణాలేవైనా మహిళల బలహీనతలను మాయగాళ్లు అనువుగా మలచుకుంటున్నారు. ఏవోబీ నుంచి గంజాయి రవాణాకు ఎస్కార్ట్‌గా వాడుకుంటున్నారు. నైజీరియన్ల మత్తు సామ్రాజ్యంలో కీలుబొమ్మలుగా మారి నలిగిపోతున్నారు. సైబర్ మోసాలకు ఏజెంట్లుగా, టెలీ కాలర్లుగా సహకరించి కేసుల్లో చిక్కుకుంటున్నారు. ఇటీవల వేర్వేరు నేరాల్లో పది మంది మహిళలు అరెస్ట్ కావటం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది.

**మత్తు ముఠాలకు చిక్కి..**

నైజీరియా నుంచి ఉపాధి కోసం దిల్లీ చేరిన మహిళ.. డ్రగ్స్ ముఠాల పరిచయంతో కొరియర్‌గా మారారు. స్మగ్లర్ల నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా సరకును చేరవేయడం ఆమె పని. ఎదురు తిరిగితే వేధింపులు.. చంపుతామని బెదిరింపులు. టీజీ న్యాబ్ అంతర్జాతీయ డ్రగ్ హవాలా రాకెట్ ఛేదించే క్రమంలో వెలుగు చూసిన కేసుల్లో ఇదొకటి. నైజీరియన్ మత్తు ముఠాలు సామాజిక మాధ్యమాల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలంటూ యువతులే లక్ష్యంగా వల విసురుతున్నారు. తాము ఇచ్చిన పార్సిల్‌ను నిర్దేశించిన గమ్యానికి



చేర్చితే కమీషన్ ఇస్తామంటారు. వాటిలో కాస్మోటిక్స్ ఉత్పత్తులున్నాయంటూ నమ్మిస్తారు. వాస్తవం తెలిసి బయటపడేందుకు ప్రయత్నిస్తే, అంతుచూస్తామని హెచ్చరిస్తారు. దిల్లీ చేరిన పార్సిల్‌ను ముంబయి, గోవా, హైదరాబాద్, బెంగళూరు చేరవేసేందుకు ప్రతినెల ఒక్కో యువతిని ఎంపిక చేస్తారు. నైజీరియా డ్రగ్‌డాన్ ఎబుకా ఏజెంట్లుగా సుమారు 50–60 మంది యువతులు ఉన్నట్లు టీజీన్యాబ్ అధికారులు గుర్తించారు.

**సైబర్ ఉచ్చులో ఇలా..**

దుబాయ్ కేంద్రంగా సైబర్ మోసగాళ్లు.. అమెరికన్ పౌరులను బ్యాంకు సేవల పేరిట బురిడీ కొట్టించి సొమ్ము కాజేస్తున్నారు. ఇందుకోసం మాదాపూర్ పత్రికా నగర్‌లో ఓ కాల్‌సెంటర్ ఏర్పాటుచేశారు. కాల్‌సెంటర్ ఏర్పాటు చేసిన నష్టపోయిన మహిళను ఎంచుకొని, పెద్ద ఎత్తున కమీషన్ ఆశ చూపి ఆమెతో దందా మొదలు పెట్టించారు. ఇటీవల విషయం బయటపడటంతో ఆమె అరెస్టయి జైలు పాలైంది. పార్ట్ టైమ్ ఉద్యోగం, టాస్కులు, బహుమతుల పేరిట సైబర్ మాయగాళ్ల బారినపడి మోసపోయిన యువతులకు.. తిరిగి డబ్బు ఇస్తామంటూ మభ్యపెడుతున్నారు. తమకు అవసరమైన బ్యాంకు ఖాతాలు సమకూర్చితే అదనంగా కమీషన్ ఇస్తామంటూ ఏజెంట్లుగా మలచుకుంటున్నారు. డిజిటల్ అరెస్టులు, బ్యాంకు ఓటీపీ, ఇన్వెస్ట్‌మెంట్ మోసాలకు పాల్పడేందుకు వారినే టెలీ కాలర్స్‌గా మార్చుకొని దందా సాగిస్తున్నారు.

## నిబంధనలు అతిక్రమణం.. సాగు మాటున తవ్వకం..

తాండూరు : వ్యవసాయం చేసుకొని జీవనం సాగించేందుకు పేద రైతులకు సర్కారు సీలింగ్ భూములు కేటాయించింది. వాటిలో భారీ యంత్రాలతో కొందరు నిక్షేపంగా తవ్వకాలను కానిచ్చేస్తున్నారు. సాగు భూముల్లో పచ్చని పంటలు దర్శనమీయాల్సి ఉండగా పెద్దపెద్ద గుంతలు కన్పిస్తున్నాయి. వెరసి సర్కారు లక్ష్యం నీరుగారుతోంది. రైతుకు నష్టం కలుగుతోంది. దీనికి సంబంధించి 'న్యూస్‌టుడే' కథనం.

**పట్టాలు కూడా జారీ చేశారు**

తాండూరు మండలం మల్కాపూర్‌లోని సర్వే సంఖ్య 72లో 18.22 ఎకరాల సీలింగ్ భూములు ఉన్నాయి. వీటిని మూడు దశాబ్దాల క్రితమే ప్రభుత్వం స్థానికులకు వ్యవసాయం చేసుకునేందుకు అప్పగించింది. వారి పేరిట పట్టాలను కూడా జారీ చేసింది. వీటిలో కొందరు రైతులు వ్యవసాయ చేస్తుండగా మరికొందరు ఇతరులకు కట్టబెట్టి నాపరాయి గనులు నిర్వహిస్తున్నారు. పంటలు పండించి రైతు జీవనం సాగించడంతోపాటు కూలీలకు ఉపాధి కల్పించే వీలుంటుందని సర్కారు భావించింది. అయితే అక్కడి నేలల్లో విలువైన నాపరాయి నిక్షేపాలు ఉండటంతో పెద్దల కన్ను పడింది. రైతులను మచ్చిక చేసుకొని వారి పేరిట లీజులు సాధించారు. అనంతరం వ్యవసాయ భూముల్లో నిక్షేపాల తవ్వకాలకు తెరలేపారు. అప్పటి వరకు పంటల పచ్చదనంతో కళకళలాడిన భూములు తవ్వకాలతో భారీ గుంతలతో ఆనవాళ్లు కోల్పోయాయి.

**ఎకరం విలువ రూ.80లక్షలు**



నాపరాయి నిక్షేపాలుండటంతో ఎకరం భూమిని నాలుగు ప్లాట్లుగా విభజించి తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఒక్కో ప్లాటుకు రూ.20లక్షలు చెల్లించేలా ఒప్పందం చేసుకుంటున్నారు. దీంతో ఎకరాకు రూ.80లక్షలు ఖరారు చేశారు. అందుకు రైతులను ఒప్పిస్తున్న బడా వ్యాపారులు దర్జాగా తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఇక్కడి నాపరాయి కంటైనర్‌ల ద్వారా ఏకంగా విదేశాలకు సైతం ఎగుమతులు చేయడం గమనార్హం.

**అధికారుల విచారణ**

గ్రామానికి చెందిన ఓ యువకుడు గతనెలలో సీలింగ్ భూముల్లో తవ్వకాలపై వికారాబాద్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. దీంతో గనులు భూగర్భ శాఖ ఏడీ సత్యనారాయణ అధ్వర్యంలో గనులు, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా విచారణ చేశారు. అధికారుల బృందం క్షేత్రస్థాయిలో వెళ్లి సీలింగ్ భూములను పరిశీలించింది. సాగుకు బదులు తవ్వకాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఎంత లోతున, ఎంత విస్తీర్ణంలో నాపరాయి తవ్వకాలు జరిపారో కొలతలు చేసి వివరాలు నమోదు చేశారు. నివేదికను జిల్లా పాలనాధికారికి సమర్పించేందుకు సిద్ధం చేసినట్లు ఏడీ వెల్లడించారు. లీజు భూముల్లో తవ్వకాలకు ఆమోదం తెలపడంపై అభ్యంతరం వ్యక్తం చేశామని ఫిర్యాదుదారు తుకారం, గ్రామస్థులు తెలిపారు.

## ఫొటో కొట్టు.. జరిమానా వేసేట్టు



హైదరాబాద్ : అమూల్యమైన జీవజలం వృథాకు అడ్డుకట్ట వేసేందుకు జలమండలి ప్రత్యేక కార్యాచరణకు ముందడుగు వేసింది. శుద్ధి చేసిన నీటిని ఇతర అవసరాలకు వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకోనుంది. జలమండలి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి అందుబాటులో ఉండేలా మొబైల్ యాప్‌ను రూపొందిస్తోంది. నీటి వృథాను గుర్తించి.. ఫొటో, వినియోగదారు సమాచారం, నీటి క్యాన్ నంబర్ తదితర అంశాలను నమోదు చేస్తే యాప్‌లోనే జరిమానా నోటీసు సిద్ధమవుతుంది. వినియోగదారు నమోదు చేసుకున్న ఫోన్ నంబర్, మెయిల్‌కు నోటీసు వెళ్లేలా యాప్ ఉండనుంది.


**అత్యధికం ఉచితం..**

నగరంలో జలమండలి పరిధిలో 13.5లక్షల నీటి కనెక్షన్లలో సుమారు 8.5లక్షల కనెక్షన్లకు ఉచితంగా తాగునీరు ఇస్తోంది. ప్రతి కుటుంబానికి నెలకు 20వేల లీటర్ల వరకు నీటిని సరఫరా చేస్తోంది. నాణ్యతా ప్రమాణాలతో అందించేందుకు సగటున ప్రతి 1000 లీటర్లకు రూ.48 వ్యయం జరుగుతోంది. ఇంత ఖర్చు చేసి ఇస్తున్న తాగునీటిని కొంతమంది వాహనాలు, ఇంటి పరిసరాలను శుభ్రం చేయడానికి, గార్డెనింగ్‌లకు వినియోగిస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. మరో రెండేళ్లపాటు నగరంలో అదనపు నీరు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. ప్రస్తుతం సరఫరా అవుతున్న నీటినే గోదావరి 2, 3 దశలు పూర్తయ్యే వరకు ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. నీటిని పొదుపుగా వాడుకోవడం, వృథాను అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

**మూడున్నర దశాబ్దాలుగా..**

జలమండలి నీటి వృథా సహా వివిధ అంశాలకు సంబంధించి చట్టంలోని జరిమానాలు 35ఏళ్ల క్రితం నాటివి.. అవి కూడా నామమాత్రంగా అమలులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జరిమానాలు పెంచుతూ జలమండలి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. నీటి వృథాకు ప్రస్తుతం మొదటి సారి అయితే రూ.1000 జరిమానా విధిస్తుండగా ఈ మొత్తాన్ని రూ.5000కు పెంచేలా ప్రతిపాదించారు. రిజర్వాయర్ల వద్ద ఫ్లో మీటర్లను ఏర్పాటు చేయనుంది. నీటి లెక్కలు తేలితేనే వృథాకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుందని జలమండలి భావిస్తోంది.

## అన్నదాతకు ఆదాయం.. వినియోగదారుకు సౌలభ్యం




వికారాబాద్ : రాష్ట్రంలోని మార్కెట్ యార్డుల్లో పండ్లు, కూరగాయలు, పూల మార్కెట్లను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా రైతుకు ఆదాయం పెంచడంతో పాటు వినియోగదారులకు అన్ని రకాల పంట ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వీలు కలుగుతుందని ప్రభుత్వం ఈ ప్రణాళికను సిద్ధం చేసింది. దీంతో జిల్లాలోనూ అవకాశాలు ఉండటంతో రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ఇదే సమయంలో యార్డుల్లో సౌకర్యాలు కల్పించడంతోపాటు, సమీకృత మార్కెట్లు పూర్తిచేయాల్సి ఉంది. దీనికి సంబంధించి కథనం.

**తీర్చిదిద్దితేనే ప్రయోజనం**

జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, మర్పల్లి, ధారూర్, కొడంగల్, బషీరాబాద్, కోట్‌పల్లి, కుల్కచర్ల, బషీరాబాద్, నవాబ్‌పేట మార్కెట్ యార్డులున్నాయి. వీటిలో ఉద్యాన పంటల ఉత్పత్తుల విక్రయాలకు అనుకూలంగా మార్కెట్లను తీర్చిదిద్దితే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. వికారాబాద్, తాండూరు, మర్పల్లి తదితర చోట్ల యార్డుల్లో అవసరమైన స్థలాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో రైతులు ఉద్యాన పంటల ఉత్పత్తులు విక్రయించడం ద్వారా గిట్టుబాటు ధరతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది.

సదుపాయాలు లేవు: బషీరాబాద్, నవాబ్‌పేట మార్కెట్‌లున్నా యార్డులు లేవు. ఇక్కడ కేవలం మార్కెట్ ఆఫీసులు మాత్రమే ఉన్నాయి. వీటిలో కూరగాయలు, పూలు పండ్లు విక్రయించడానికి అవసరమైన స్థలం లేదు. పరిగి, వికారాబాద్, తాండూరుల్లో సమీకృత మార్కెట్ యార్డు పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఇవి పూర్తి అయితే కూరగాయలే కాకుండా పండ్లు, పూలు, మాంసం తదితర వాటిని విక్రయించటానికి వీలు కలుగుతుంది. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ చూపాల్సి ఉంది.

**పూడూరులో ఏర్పాటుకు ప్రతిపాదనలు**

– సారంగపాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి.

జిల్లాలో పూడూరు మండలంలో 20 ఎకరాల్లో పూలు, పండ్లు విక్రయం కోసం ప్రత్యేకంగా పూల మార్కెటును ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది. వికారాబాద్, పరిగి, పూడూరు, మోమిన్‌పేట, నవాబ్‌పేట తదితర మండలాల రైతులు పండించిన పూలు, పండ్లు, కూరగాయలను హైదరాబాద్‌లోని గుడిమాల్కపూర్ మార్కెట్‌కు తీసుకెళతారు. వీరు రవాణాలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అన్నీ అనుకూలిస్తే పండ్ల మార్కెట్ ఏర్పాటవుతుంది. రైతులకు లాభం కలుగుతుంది.

## పోటీ పెంచండి.. కోటి గెలవండి



పెద్దపల్లి : సౌర విద్యుత్తు వినియోగంలో ఆదర్శంగా నిలిచిన గ్రామాలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇంటింటికీ సౌర విద్యుత్తును అందుబాటులోకి తేవడానికి పంచాయతీల మధ్య పోటీతత్వం పెంచింది. సౌరశక్తిలో ఆదర్శంగా నిలిచిన జిల్లాకు ఒక గ్రామానికి రూ.కోటి నజరానా ప్రకటించింది. దీనికి సంబంధించి జిల్లా స్థాయి కమిటీ(డీఎల్‌సీ) సభ్యులు అయిదు వేల జనాభా ఉన్న గ్రామాలను ఎంపిక చేస్తున్నారు. వచ్చే ఆరు నెలల్లో ఆయా గ్రామాల్లో ఇంటింటికీ సౌర విద్యుత్తు ప్యానెళ్లు ఏర్పాటు చేసుకొని ఉత్తమంగా నిలిచిన వాటికి నగదు పురస్కారం అందనుంది.

**అయిదు వేల జనాభానే అర్హత**

పర్యావరణ కాలుష్యం తగ్గించడానికి, అందుబాటులోని వనరులను సద్వినియోగం చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల కింద సౌరశక్తి యూనిట్ల ఏర్పాటుకు రాయితీ ఇస్తోంది. ఇప్పటికే గృహావసరాలకు విద్యుత్తు వినియోగం పెరగడంతో చాలా మంది ఇంటి పైకప్పులపై సౌర ఫలకలు ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ క్రమంలో సౌర విద్యుదుత్పత్తిని విస్తరించేందుకు గ్రామాల మధ్య పోటీ పెంచింది. కలెక్టర్ ఛైర్మన్‌గా, రెడ్కో అధికారి కన్వీనర్‌గా, అదనపు కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జడ్పీ సీఈవో, లీడ్ బ్యాంక్ మేనేజర్, జిల్లా పంచాయతీ అధికారి, పీఆర్ ఈఈ, ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ.. సభ్యులుగా ఉన్న కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో అయిదు వేల జనాభా కలిగిన గ్రామాలను ఎంపిక చేస్తారు.

**ఆరు నెలల్లో అత్యధిక ఉత్పత్తికి ప్రాధాన్యం**

కేంద్ర ప్రభుత్వం అందజేసే నజరానా కోసం గ్రామాలు పోటీ పడనున్నాయి. ఉమ్మడి జిల్లాలో పెద్దపల్లిలో 21 గ్రామాలను ఎంపిక చేయగా మిగిలిన మూడు జిల్లాల్లో ఎంపిక చేయాల్సి ఉంది. ఆరు నెలల్లో ఇళ్ల పైకప్పులపై అత్యధికంగా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకొని విద్యుత్తు ఉత్పత్తి చేసిన గ్రామాలను జిల్లా స్థాయి కమిటీ 'మోడల్ సోలార్ విలేజ్'గా గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తుంది. ఈ నిధులతో గ్రామంలోని ప్రభుత్వ భవనాల పైకప్పులపై సౌర ఫలకలు ఏర్పాటు చేస్తారు. కాగా కేంద్రం అందించే ప్రోత్సాహకంతో సౌర విద్యుత్తు తప్ప ఇతర అభివృద్ధికి నిధులు కేటాయించరాదు.

**వినియోగంపై చైతన్యం**ఎంపిక చేసిన గ్రామాల్లో సౌర విద్యుత్తుపై అవగాహన కల్పిస్తారు. సౌర విద్యుత్తు ప్యానెళ్ల ఏర్పాటుకు 2 కిలోవాట్స్‌కు రూ.60 వేలు, 3 కిలోవాట్స్‌కు రూ.78 వేల రాయితీ ఉంటుంది. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల్లో రుణం తీకొనేలా ప్రోత్సహిస్తారు. స్వశక్తి సంఘాల సహకారంతో ప్రజల్లో చైతన్యం కల్పిస్తారు.

కలెక్టర్ పర్యవేక్షణలో గ్రామాల ఎంపిక

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో అయిదు వేల జనాభా ఉన్న గ్రామాలను కలెక్టర్ పర్యవేక్షణలో ఎంపిక చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో సంబంధిత అధికారుల సహకారంతో అవగాహన కల్పిస్తాం. గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి. సోలార్ ఫలకల ఏర్పాటు కోసం ఏజెన్సీలు దరఖాస్తు చేసుకోవాలి. రెడ్కో అనుమతి పొందిన సంస్థల నుంచి మాత్రమే ప్యానెళ్లు తీసుకోవాలి.

అజయ్, రెడ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్

## ఇంటి కొలతలు తప్పాయా.. నోటీసులే!

హైదరాబాద్: నగరంలో ఆస్తిపన్ను కట్టని నిర్మాణాలు, తక్కువ కడుతున్న భవనాలు జీఐఎస్(భౌగోళిక సమాచార వ్యవస్థ) సర్వేలో లెక్క తేలుతున్నాయి. ఇప్పటి వరకు 20 శాతం మేరకు సర్వే పూర్తవగా అందులో 80 వేల నిర్మాణాల కొలతలు, వాటి ఆస్తిపన్నులో తేడాలు ఉన్నట్లు సర్వేయర్లు గుర్తించారు. అందులో పన్ను కట్టని నిర్మాణాలే 20 వేల వరకు ఉన్నాయి. బల్దియా ఐటీ విభాగం ఆయా నిర్మాణాల జాబితాను ఇటీవల కమిషనర్ ఇలంబర్తి ముందుంచగా.. అన్నింటికీ చట్టప్రకారం నోటీసులు ఇవ్వాలని, యజమానుల నుంచి వివరణ తీసుకుని తదుపరి చర్యలు తీసుకోవాలని ఆయన యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ మేరకు జోనల్ కమిషనర్లు చర్యలు ప్రారంభించారు. జీహెచ్‌ఎంసీ చట్టంలోని సెక్షన్ 213 కింద నోటీసులు జారీకి శ్రీకారం చుట్టారు.

**అయిదు లక్షలకు పైగా భవనాలకు..**

జీఐఎస్ సర్వే ఏడాది కిందట మొదలైంది. డ్రోన్‌తో నగరం మొత్తాన్ని చిత్రీకరించారు. నగర భౌగోళిక పటాన్ని రూపొందించారు. ఇప్పుడు ఇంటింటి సర్వే జరుగుతోంది. పూర్తయిన 20 శాతం ఇంటింటి సర్వేలో 80 వేల భవనాలు లెక్క తేలాయి. నగరం మొత్తాన్ని సర్వే చేస్తే..



అయిదు లక్షలకుపైగా భవనాలకు నోటీసులు ఇచ్చే పరిస్థితి ఉత్పన్నమవుతుందని అంచనా.

నోటీసులిస్తూనే..: సర్వేయర్లు గుర్తిస్తున్న సమాచారంలో కూడా లోపాలు ఉండొచ్చనే ఉద్దేశంతో గుర్తించిన ప్రతి ఇంటి యజమానికి నోటీసు ఇవ్వాలని, ఆ వివరాలను సంబంధిత సహాయ మున్సిపల్ కమిషనర్(ఏఎంసీ) ఆన్‌లైన్‌లోనూ నమోదు చేయాలని కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. నోటీసుకు 15 రోజుల్లోపు యజమాని వివరణ ఇవ్వాలి. యజమాని ఇచ్చే వివరణ ఆధారంగా సంబంధిత బిల్ కలెక్టర్ లేదా ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి ఉప కమిషనర్‌కు నివేదిక ఇస్తారు. స్పందించకపోతే విచారణ లేకుండానే పన్ను మదింపు జరిగిపోతుంది. నోటీసులపై పౌరులు అభ్యంతరం వ్యక్తం చేస్తే వారి కోసం ఏదైనా ఒక రోజును కేటాయించి, సంబంధిత ఉప కమిషనర్ యజమాని అభ్యంతరాలపై విచారణ జరపాలని సూచించారు. నోటీసు జారీ, దాని వివరాలను యజమాని ఫోన్ నంబరుకు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేయాలని ఆదేశించారు.

## సన్న బియ్యానికి సై

కరీంనగర్ : సన్న బియ్యంపై ప్రజలు ఆసక్తిని కనబరుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం స్థానంలో వీటిని పంపిణీ చేస్తుండటంతో తమకు వచ్చిన కోటాను తీసుకునేందుకు కార్డుదారులు ఉదయం, సాయంత్రం వేళ దుకాణాల వద్ద వరుస కడుతున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన ప్రక్రియలో భాగంగా గడిచిన 8 రోజుల్లోనే 7,26,344 మంది కార్డుదారులు సన్నబియ్యాన్ని అందుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9,77,317 మంది కార్డుదారులున్నారు. ఉన్నవారిలో దాదాపుగా 8 రోజుల



వ్యవధిలోనే 74 శాతం బియ్యం లబ్ధిదారుల ఇళ్లకు చేరింది.

**రెండింతలకు పైగా...**

గతానికి భిన్నంగా కార్డుదారులు సన్నబియ్యం తీసుకుంటున్నారు. గతంలో దొడ్డు బియ్యం సరఫరా సమయంలో వీలుని బట్టి కొందరు రెండు మూడు నెలలకు తీసుకునేవారు. కానీ ఈసారి సన్నబియ్యం సరఫరా అవుతుండటం.. తినడానికి వీలుగా నాణ్యతతో ఉన్నాయనే ఉద్దేశంతో ఒకరిని చూసి ఇంకొకరు రేషన్ తీసుకునేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. మార్చి నెల మొత్తంగా 8,62,8065 మంది కార్డుదారులు 16,353 టన్నుల బియ్యాన్ని తీసుకోగా ఈ నెలల ప్రస్తుత పరిస్థితిని చూస్తే దాదాపుగా 90 శాతం మంది ఈ సన్న బియ్యాన్ని తీసుకునే అవకాశం కనిపిస్తోంది. కార్డుదారులు ఏ డీలర్ వద్దనైనా తీసుకునే వెసులుబాటు ఉండటంతో వీలుని బట్టి లబ్ధిదారులు తీసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,917 రేషన్ దుకాణాలు ఉండగా ఇందులో ఈ నెల 8వ తేదీన 1,422 దుకాణాల్లోనే బియ్యం అందుబాటులో ఉంది. మిగతా వాటికి సరఫరా చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చొరవ తీసుకుంటున్నారు.

## గడువు పెంచినా ఆసక్తి అంతంతే!

పెద్దపల్లి : లే అవుట్ అనుమతులు లేని స్థలాల క్రమబద్ధీకరణకు 2020లో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. 25 శాతం రాయితీపై మొదట మార్చి నెలాఖరు వరకు గడువు విధించగా తర్వాత ఈ నెల 30 వరకు పొడిగించారు. ఏప్రిల్‌లో వారం రోజులు గడిచినా కొత్తగా ఒక్క దరఖాస్తు కూడా పరిష్కారానికి కూడా నోచుకోలేదు. రిజిస్ట్రేషన్లకు ఎల్‌ఆర్‌ఎస్‌తో ముడి పెట్టినప్పటికీ ఆశించిన స్పందన లేదు. జిల్లాలో మొత్తం దరఖాస్తుల్లో ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపులు 24.42 శాతానికే పరిమితమయ్యాయి.

**ఎందుకీ పరిస్థితి..!**రెండేళ్లుగా స్థిరాస్తి వ్యాపారం ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. నిర్మాణ రంగం కూడా ఆపసోపాలు పడుతోంది. రెండింటికీ కొనుగోలుదారుల నుంచి ఆశించిన స్థాయిలో ఆసక్తి లేదు. ఇక వెంచర్లలో ఇళ్ల స్థలాల అమ్మకాలు కనీస స్థాయికి పడిపోవడంతో వ్యాపారులు, ప్లాట్ల విక్రయదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే క్రమబద్ధీకరణ కోసం ముందుకు రావడం లేదనే ప్రచారం సాగుతోంది. మరోవైపు అయిదేళ్ల కిందట రూ.వెయ్యి చెల్లించి పేర్లు నమోదు చేసుకున్నా, స్థిరాస్తి వెంచర్లలో ఎక్కువ మంది రీసేల్(తిరిగి అమ్మడం) కోసమే ప్లాట్లు కొనుగోలు చేయడంతో స్థలాల క్రమబద్ధీకరణకు ఆసక్తి చూపడం లేదు.

**51 శాతం మందికి ప్రొసీడింగ్స్ జారీ**ఇప్పటికే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించిన వారిలో చాలా మందికి ఇప్పటికీ ప్రొసీడింగ్స్ అందలేదు. స్థలాలను మున్సిపల్ అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించిన తర్వాతే జారీ చేసే అవకాశం ఉంది. జిల్లాలో ఇప్పటివరకు 1,883 మంది ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లిస్తే 962 మంది(51 శాతం)కి ప్రొసీడింగ్స్ జారీ చేశారు. మిగతా వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో పెద్దపల్లి మున్సిపాలిటీ రాష్ట్రంలో 17వ స్థానంలో ఉండగా రామగుండం నగరపాలిక 52వ స్థానంలో ఉంది. మంథని, సుల్తానాబాద్‌లు వరుసగా 27, 114 స్థానాల్లో ఉన్నాయి.

చురకలు




# ఏజెన్సీ భూములకు అక్రమ పట్టాలు!

ఆసిఫాబాద్ : క్రయ విక్రయాలకు వీలులేని ఏజెన్సీ భూములవి. అయినా గద్దల్లా కొందరు తన్నుకుపోయి, అడ్డదారుల్లో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. వీటిని సరిచేసి న్యాయం చేయాలని బాధితులు ఒకవైపు కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే, మరోవైపు కబ్జాదారులు ఇతరులకు విక్రయిస్తున్నారు. ఆయా కార్యాలయాల్లో తిష్ఠవేస్తున్న దళారులు.. చిన్నపాటి లొసుగుల ఆధారంగా అధికారులను మచ్చిక చేసుకుని భూ దందాలను నడిపిస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఏజెన్సీ ప్రాంతం విస్తరించి ఉంది. ఐటీడీఏ కార్యాలయం నుంచి వచ్చే కే-ఫాం, ఎల్-ఫాం సహాయంతో గిరిజనులకు మాత్రమే పట్టాలు అవుతాయి. ఇతరులకు పట్టాల జారీ నిషేధం. ఆసిఫాబాద్, జైనూర్, సిర్పూర్(యు), కాగజ్‌నగర్, తిర్యాణి, సిర్పూర్(టి), కెరమెరి, వాంకిడి, రెబ్బెన మండలాల్లో ఏజెన్సీ భూములు కనుమరుగవుతున్నాయి. ఈ మండలాల్లో అనుమతులు లేకుండానే పదుల సంఖ్యలో వెంచర్లు వేస్తున్నారు. పంచాయతీ, పుర అధికారులు ఇష్టానుసారంగా ఇంటి నంబర్లు జారీ చేయడంతో.. ఈ ప్రాంతాల్లో భవనాలు వెలుస్తున్నాయి.

**జిల్లా కేంద్రంలోనూ...**

జిల్లా కేంద్రంలో గుండి వెళ్లే మార్గంలో కుడివైపు ఏజెన్సీ భూముల్లో వెంచర్ వేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో మూడు, నాలుగు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా.. అధికారులు అటువైపు చూడడం లేదు. సర్వే నం.21/1/1లో 2.30 ఎకరాల వెంచర్‌లో అక్రమ కట్టడాలు పదుల సంఖ్యలో ఉండడం గమనార్హం. చెక్‌పోస్టు ఎదురుగా సైతం బీడీపీపీ కబ్జాలను తొలగించాలని అధికారులు హడావుడి చేసినా.. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆసిఫాబాద్ మండలం ఇప్పల్‌నవేగాం గ్రామానికి





చెందిన ఆత్రం నాగయ్య 2019లో అనారోగ్యంతో మరణించారు. అతనికి సర్వే నం.14/4లో 3.29 ఎకరాలు ఉన్నాయి. భర్త చనిపోవడంతో భార్య లత మహారాష్ట్రలోని పుట్టింటికి వెళ్లింది. సమగ్ర సర్వే అనంతరం ఈ భూమిని మరో వ్యక్తి పేరు (మొండి)తో అధికారులు పట్టా చేసి ఇచ్చారు. పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమైన ఈ చోట, గిరిజనేతరులకు పట్టా చేసి ఇవ్వడం గమనార్హం. లత విరాసత్ కోసం 2024 ఏప్రిల్‌లో రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఇదే సర్వే నంబర్‌తో మరో వ్యక్తికి పట్టా ఉండడంతో, దానిని తొలగించి, న్యాయం చేయాలని బాధితురాలు నాలుగేళ్ల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉంది.

**వారసుల పేరుతో...**

ఆసిఫాబాద్ మండలంలోని రహపల్లి పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం. భూ యజమాని చనిపోతేనే వారసులకు విరాసత్ చేయాలి. కానీ యజమాను లు బతికే ఉన్నా.. వారసులు కాని వారికి (విక్రయించి) పట్టాలు చేస్తున్నారు. కొందరు దళారులు ముఖ్యపాత్ర పోషించి ఈ తతంగాన్ని జరిపించారు. రెండు, మూడు నెలల కిందట ఈ ఒక్క గ్రామంలో వందలాది ఎకరాలకు అక్రమ పట్టాలు పుట్టుకురాగా, రూ.కోటి వరకు చేతులు మారినట్లు సమాచారం. న్యాయం చేస్తాంరోహిత్, తహసీల్దార్ ఏజెన్సీ భూముల్లో ఇతరులకు పట్టాలు జారీ అయిన విషయం గుర్తించాం. వీటిని రద్దు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే తొలగిస్తాం.

# సమన్వయలోపం.. తీరని దాహం

ఆసిఫాబాద్ : పల్లెల్లో తాగునీటి ఎద్దడి నివారించడానికి సౌరనీటి యూనిట్లను ఏర్పాటు చేశారు. బోరు, సింథటిక్ ట్యాంకు, సౌరఫలకలు ఆయా గ్రామాల్లో ఉంచారు. ఇవి బిగించిన నాటి నుంచి నిర్వహణ లేక, నీళ్లందించక మొరాయిస్తున్నాయి. చిన్నపాటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో రూ.కోట్ల ఖర్చు బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారి, గ్రామస్థులు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న ప్రస్తుత సమయంలో ఈ యూనిట్లకు మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీరు అందేలా చూడాల్సిన అవసరం ఉంది. కుమురం భీం జిల్లా తిర్యాణి మండలంలోని జెండగూడ గ్రామంలో ఐటీడీఏ అధికారులు రూ.7 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన సౌర ప్లాంట్ ఇది. నెల రోజులు సైతం పనిచేయక మూలకు చేరింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏ నుంచి సౌర యూనిట్ల ఏర్పాటుకు నిధులు కేటాయించారు. ఆ పనులను మిషన్ భగీరథ అధికారులు చేశారు. అయితే మరమ్మతులు చేయడానికి ఈ రెండు శాఖల అధికారులు నిరాకరిస్తున్నారు. సమన్వయలోపం కారణంగా సౌర యూనిట్లు పనిచేయక మూలకు చేరుతున్నాయి. అయిదు సంవత్సరాల వరకు గుత్తేదారు వీటి బాధ్యతలను చూడాల్సి ఉండగా ఎక్కడా వీటిని పట్టించుకున్న పాపాన పోలేదు.



**రూ.6.30 కోట్ల నిధులు**

కుమురం భీం జిల్లాలో ఐటీడీఏ నుంచి 76, మిషన్ భగీరథ పథకంలో 7 సౌర యూనిట్లు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా పరిధిలో 22 ఉండగా మొత్తం 105 వరకు సౌర యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్కు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు ఖర్చు చేశారు. సగటున రూ.6 లక్షలు ఖర్చు చేసినా మొత్తం రూ.6.30 కోట్లు వీటి కోసమే ఖర్చు చేశారు. చాలా ప్రాంతాల్లో బిగించిన ఒకటి, రెండు నెలలకే ఇవి తాగునీరందించక అలంకారప్రాయంగా మారడంతో రూ.కోట్ల నిధులు గుత్తేదారుల ధనదాహాన్ని మాత్రమే తీర్చాయి. ఆసిఫాబాద్ మండలం గొగియన్ మోవాడ్‌లో ఏర్పాటు చేసిన సౌర ప్యానెల్ ధ్వంసమయ్యాయి.

రెబ్బెన మండలంలోని ఇందిరానగర్ వద్ద ఒక్క రోజూ సౌర ప్లాంట్ తాగునీరు అందించలేదు. వాంకిడి మండలం డొంగరగావ్, సోనాపూర్, ఆకిని, బెజ్జూరు మండలం కాటేపల్లి గ్రామంలోని సౌర యూనిట్లు వృథాగా మారాయి.

**పని చేసేలా చర్యలు-సిద్దిఖీ, ఈఈ, మిషన్ భగీరథ ఇంట్రా**

వేసవి నేపథ్యంలో సౌర యూనిట్లకు మరమ్మతులు చేస్తాం. ఇప్పటికే లొద్దిగూడలో చేశాం. త్వరలో పనిచేయని వాటన్నింటిని పనిచేసేలా చూస్తాం.

# కుదిరిన సయోధ్య.. కొత్త రహదారికి సై




హైదరాబాద్ : కంటోన్మెంట్‌లోని రోడ్ల సమస్య కొలిక్కి వచ్చింది. మల్కాజిగిరి, సైనిక్‌పురి, ఈసీఐఎల్ తదితర ప్రాంతాల నుంచి సికింద్రాబాద్ వైపు రాకపోకలు సాగించే వాహనదారుల కష్టాలు తీర్చేందుకు సైనికాధికారులు, జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు సయోధ్యకు వచ్చారు. ఏఓసీ కూడలి మీదుగా సఫిల్‌గూడ, ఆర్కేపురం వరకు నిర్మించతలపెట్టిన ప్రత్యామ్నాయ రహదారిపై ఇరువర్గాల మధ్య ప్రతిష్టంభన దాదాపు తొలగిపోయింది.

**రోడ్ల మూసివేతపై..**

సికింద్రాబాద్ నుంచి సఫిల్‌గూడ, మల్కాజిగిరి, ఆర్కేపురం, సైనిక్‌పురి, ఈసీఐఎల్ ప్రాంతాల మధ్య రోజూ లక్షలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సికింద్రాబాద్‌లోని ఈస్ట్‌మారేడుపల్లి చెక్‌పోస్టు నుంచి ఆర్మీ ఆర్డినెన్స్ సర్కిల్(ఏఓసీ) మీదుగా ఆయా ప్రాంతాలకు 24గంటల పాటు వాహనరద్దీ ఉంటుంది. సైనిక స్థావరాల్లోని వెల్లింగ్టన్, ఆర్డినెన్స్ రోడ్డు, గఫ్ రోడ్లను ప్రజలు వినియోగిస్తుంటారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలు, ఇతర సందర్భాల్లో అధికారులు ఏఓసీ గేటు, వెల్లింగ్టన్ రోడ్లును పూర్తిగా మూసేస్తుంటారు. దీంతో సఫిల్‌గూడ, ఆర్కేపురం, సికింద్రాబాద్ మధ్య రాకపోకలు స్తంభించిపోతాయి.

**న్యాయస్థానం సూచనతో..**

రహదారులను మూసివేయాల్సి వస్తే.. మీ ప్రాంతంలో ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మించేందుకు స్థలం ఇవ్వాలని న్యాయస్థానం లోకల్ మిలటరీ అథారిటీ(ఎల్‌ఎంఏ)ని ఆదేశించిందని, ఆమేరకు కొత్త రోడ్డు అభివృద్ధి ప్రాజెక్టును రూపొందించామని జీహెచ్‌ఎంసీ చెబుతోంది. మూడేళ్ల కిందట ఈ ప్రతిపాదనను జీహెచ్‌ఎంసీ ఎల్‌ఎంఏ ముందు ఉంచగా.. తాము కోల్పోతున్న 42ఎకరాల భూమికి రూ.450కోట్ల నష్టపరిహారం ఇవ్వాలని సైనికాధికారులు బల్దియాను కోరారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించకపోవడంతో.. ఆ ప్రతిపాదన అటకెక్కింది.

**తాజా ప్రతిపాదనతో..**

ఆర్డినెన్స్ రోడ్డు, గఫ్ రోడ్డులను పూర్తిగా మూసేసి.. ఆర్కేపురం రైల్వే స్టేషన్ నుంచి సఫిల్‌గూడ రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ) వరకు రోడ్డును నిర్మించాలన్నది కొత్త ప్రతిపాదన. సఫిల్‌గూడ ఆర్‌యూబీ నుంచి ఏఓసీ చౌరస్తా వరకు కొత్త రోడ్డు మార్గం, కొంత పైవంతెన నిర్మాణం ఉండనుంది. రోడ్డు నిర్మాణం కోసం 35.5ఎకరాలు నష్టపోతున్నామని, ఆమేరకు వేరే చోట భూమిని ఇవ్వాలని ఎల్‌ఎంఏ కోరుతోంది. ఏడు ఎకరాల పరిధిలో పైవంతెనను నిర్మిస్తున్నందున.. ఆ భూమికి ఏటా లీజు రుసుము చెల్లించాలని ప్రతిపాదించింది. వాటిపై మరోసారి సమావేశమై, క్షేత్రస్థాయిలో పర్యటించి తుది నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ ఇలంబర్తి ఎల్‌ఎంఏ అధికారులకు స్పష్టం చేశారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.400కోట్లు అని, 100అడుగుల వెడల్పు, 6కి.మీ పొడవున రోడ్డును అర్ధ చంద్రాకారంలో అభివృద్ధి చేయనున్నట్టు ఇంజినీర్లు తెలిపారు.

**విలీనంపై కదలిక..**

కంటోన్మెంట్ బోర్డును జీహెచ్‌ఎంసీలో విలీన ప్రక్రియపై బల్దియా కసరత్తు ప్రారంభించింది. గతంలో ఏర్పాటైన కమిటీ ఏడు ప్రధానాంశాలను తెరపైకి తెచ్చిందని, వాటిపై చర్చించేందుకు వారంలో బోర్డు అధికారులతో సమావేశం కానున్నట్టు కమిషనర్ ఇలంబర్తి తెలిపారు.

# ఎల్‌ఆర్‌ఎస్‌లో ప్రొరేటా గందరగోళం



హైదరాబాద్: అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్)కు సంబంధించి భవిష్యత్తు అవసరాల కోసం వదిలిన ఖాళీ స్థలానికి చెల్లించాల్సిన ఛార్జీల్లో ప్రొరేటా విధానంపై గందరగోళం నెలకొంది. దీని ప్రకారం ఓపెన్ స్పేస్ ఛార్జీలు చెల్లిస్తే సరిపోతుందని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ఈ విధానం ప్రకారం ఎలాంటి మినహాయింపు ఇవ్వకుండా పూర్తి స్థాయిలో ఛార్జీలు వసూలు చేస్తున్నారు. కొందరు దరఖాస్తుదారులు సైతం దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా మొత్తం 14 శాతం ఛార్జీలు చెల్లిస్తున్నారు.

**అవగాహన లేకపోవడంతో..**

ఈ నెల 31లోగా ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లించిన వారికి 25శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆగస్టు 26, 2020కు ముందు ఉన్న పంచాయతీ లేఅవుట్లకు మాత్రమే ఈ అవకాశం కల్పించారు. ఇలాంటి లేఅవుట్లలో కనీసం 10 శాతం ఇప్పటికే రిజిస్ట్రేషన్ అయి ఉండాలనేది నిబంధన. ఎల్‌ఆర్‌ఎస్ రుసుముతోపాటు 14 శాతం ఓపెన్ స్పేస్ ఛార్జీలు చెల్లించాలి. నిబంధన ప్రకారం ప్రతి లేఅవుట్‌లో పది శాతం ప్రజా అవసరాల కోసం ఖాళీ స్థలాన్ని వదలాలి. అక్రమ లేఅవుట్లలో మాత్రం చాలావరకు వదల్లేదు. వీటికి కూడా అదనంగా 14 శాతం ఛార్జీలు వసూలు చేస్తున్నారు. కొందరు పది శాతానికి బదులు ఐదు శాతమే వదిలేశారు. దీని ప్రకారం ఐదు శాతానికే ఓపెన్ స్పేస్ ఛార్జీలు వసూలు చేయాలి. ఇందుకు విరుద్ధంగా 14 శాతానికి తీసుకుంటున్నారు. దరఖాస్తుదారులకు సైతం అవగాహన లేక మొత్తం ఫీజులు చెల్లిస్తున్నారు.

**ఫీజులు చెల్లిస్తున్నారు... తర్వాత ఏమిటి?**ఒక్క హెచ్‌ఎండీఏలోనే 3.2 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. చెరువులు, ఇతర నీటి వనరులకు 200 మీటర్లలో దూరంలో ఉన్న లేఅవుట్లను విడదీసి రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాలకు పంపి ఆరా తీస్తున్నారు. వివాదాలు లేని ప్లాట్లకు ఆటోమేటిక్‌గా ఫీజు జనరేట్ కావడంతో చాలామంది ముందుకువస్తున్నారు. ఫీజులు చెల్లింపు ప్రక్రియ చురుగ్గా నడుస్తోందని అధికారులు చెబుతున్నారు. ఫీజు చెల్లింపు తర్వాత రసీదు లేదా ఇతర వివరాలు ఏవీ వినియోగదారులకు ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో కనిపించకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కట్టిన డబ్బులు ప్రభుత్వానికే వెళుతున్నాయో.. లేదో తెలియడం లేదని వాపోతున్నారు. ఫీజు చెల్లిస్తే ఆన్‌లైన్‌లోనే ప్రొసీడింగ్స్ ఇస్తామని అధికారులు అంటున్నారు.

# ఎకో క్లబ్‌ల ఏర్పాటుకు నిధుల మంజూరు

కాగజ్‌నగర్ : పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా.. ఎకో క్లబ్‌ల ఏర్పాటుతోపాటు వాటికి సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించడానికి నిర్దేశించింది. ఇందుకు అవసరమైన నిధులను మంజూరు చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కళాశాలలు కలిపి మొత్తం 2,742 ఉన్నాయి. వీటిల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు యూత్, ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేసి వాటి ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. విద్యార్థి దశలోనే పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో వారిలో మార్పు వస్తుందనేది ప్రభుత్వ ఆలోచన. గతంలోనూ ఈ కార్యక్రమాలను నిర్వహించారు. తాజాగా ప్రస్తుత విద్యాసంవత్సరంలోనూ దీని అమలుకు అవసరమైన నిధులు రాష్ట్ర సమగ్ర శిక్షా ద్వారా విడుదల చేసింది.

**వినియోగం ఇలా..**నిధులను మూడు రకాల కార్యక్రమాలకు వెచ్చించాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. నీరు, నేల, గాలి, శక్తి, వ్యర్థం నుంచి అర్థంకు సంబంధించిన అయిదు జట్లు ఏర్పాటు చేయాలి. ఒక్కో జట్టులో పది మంది విద్యార్థులు ఉండాలి. వాటర్ హార్వెస్టింగ్, వృథా నీటిని ఉపయోగంలోకి తేవడం, నీటిని పొదుపుగా వాడటం, నిల్వ ఉంచడం, శుభ్రం చేయడం వంటివి ఉంటాయి. నేల, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచడం, హరితహారం పెంపునకు



చర్యలు, పాఠశాలల్లో పచ్చదనం, కిచెన్‌గార్డెన్ నిర్వహణ, పూలు, పండ్ల మొక్కల పెంపకం, వినాయక చవితి పండగకు మట్టి గణపతుల తయారీ, బ్యానర్లు, పర్యావరణ దినోత్సవం, ఓజోన్ పొర, ధరిత్రి, నీటి దినోత్సవాల నిర్వహణ, వ్యాసరచన, క్విజ్, పోస్టర్ మేకింగ్, నినాదాలు రాయడం, తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందించేందుకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఉన్నతాధికారులకు పంపించాల్సి ఉంటుంది.

**రూ.9.84 కోట్లు విడుదల**

ప్రాథమిక పాఠశాలలకు రూ.3 వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు, కళాశాలకు రూ.5 వేల చొప్పున కేటాయించారు. వీటిని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఖాతాల్లో జమ చేశారు. ఈ నిధులను ఆయా కమిటీల భాగస్వామ్యంతో ఖర్చు చేయాల్సి ఉంటుంది.

# అనుమతులు సున్నా..!

భానుపురి : జిల్లాలోని పురపాలికల్లో వాటర్‌ప్లాంటు నిర్వాహకులు నమూనాలు పాటించడం లేదు. దీంతో శుద్ధ జలాలు అందక పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి గుర్తింపు లేకుండా యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నారు. వాస్తవానికి ఐఎస్ఐ(ఇండియన్ స్టాండర్డ్ ఇనిస్టిట్యూట్) గుర్తింపు తప్పనిసరిగా ఉండాలి. కానీ ఇలాంటి నిబంధనలు పాటించడం లేదు. పదుల సంఖ్యలో మాత్రమే అనుమతులున్నాయి.

**57 ప్లాంట్లకే అనుమతులు..**

జిల్లాలోని ఐదు పురపాలికల్లో 357 వాటర్ ప్లాంటులు ఉన్నాయి. వీటిలో ఇప్పటివరకు 55 ప్లాంట్లకు మాత్రమే అనుమతులు తీసుకున్నారు. మిగతావి ఎలాంటి అనుమతులు పొందకుండా నిర్వహణ చేపడుతున్నారు. గతంలో రెవెన్యూ, పురపాలిక, పోలీసు అధికారులు దాడులు చేసేవారు. ఇప్పుడు రెవెన్యూ, పురపాలికలను బాధ్యతలు



అప్పగించారు. కానీ పట్టణాల్లో ఎలాంటి తనిఖీలు చేపట్టం లేదు.

**పరిశుభ్రత కరవు..**

ప్లాంట్ల నిర్వాహకులు పరిశుభ్రత పాటించడం లేదు. ఇష్టానుసారంగా నీటిని శుద్ధి చేసి విక్రయిస్తున్నారు. కనీసం లవణాల శాతం ఎంత ఉంది అనికూడా పరీక్షించడం లేదు. స్వచ్ఛమైన నీటిగా మార్చేందుకు సోడియం బయోసల్ఫైడ్‌ను వినియోగిస్తున్నారు. ఇది ప్రాణ మూలకాలను హరిస్తుంది. దీనికితోడు 20 లీటర్ల క్యాన్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు తీసుకుంటుండగా, లీటర్‌కు నీటికి రూ.5 విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టి స్వచ్ఛ నీటిని అందించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

**అనుమతి తప్పనిసరి..-వేణుమాధవరావు, ఆర్డీవో సూర్యాపేట**

పురపాలికల్లో ఏర్పాటు చేసుకొనే వాటర్ ప్లాంట్లకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. నిబంధనల ప్రకారం నడుచుకోకుంటే చర్యలు తప్పవు. ఇప్పటికైనా యజమానులు ముందుకు రావాలి.

# 'అప్పు'డు.. ఇప్పుడు.. అదేతీరు!

ఖమ్మం: పెట్టుబడులు పెరుగుతుండటం, దిగుబడులు క్షీణిస్తుండటంతో వ్యవసాయం రోజురోజుకూ భారంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు దన్నుగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ)లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో వీటి వినియోగం అంతంతమాత్రంగానే ఉండటం విచారకరం. కేసీసీల ప్రయోజనాలపై కర్షకులకు అవగాహన కల్పించటంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరటం లేదు. బ్యాంకుల్లో ఖాతాలున్న ప్రతి రైతుకూ కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలు పూర్తిస్థాయిలో అమలవటం లేదు.

**ఖాతాదారులు లక్షల్లో.. రుణగ్రహీతలు వేలల్లో..**

పెట్టుబడులకు ఇబ్బందులు పడే రైతులకు రుణాలివ్వాలనే ఉద్దేశంతో కేంద్రం కేసీసీలు అందజేస్తోంది. ఖమ్మం జిల్లాలో 31 బ్యాంకుల ద్వారా 3,63,000 మందికి, భద్రాద్రి జిల్లాలో 34 బ్యాంకుల ద్వారా 1,73,000 మందికి కిసాన్ క్రెడిట్ కార్డులు ఉన్నాయి. ఇవన్నీ పాతవే. ఇప్పటివరకు ఖమ్మం జిల్లాలో 71,259 రైతు ఖాతాల ద్వారానే రుణాలు అందించినట్లు బ్యాంకర్లు చెబుతున్నారు. భద్రాద్రి జిల్లాలో రుణాలు పొందిన ఖాతాల సంఖ్య 50వేలు దాటలేదు. కొత్తగా బ్యాంకు ఖాతాలు తెరిచిన అన్నదాతలకు కొన్నేళ్లుగా కేసీసీలు ఇవ్వటం లేదు. ఒకసారి కార్డు పొందితే కాలపరిమితి ఐదేళ్ల వరకు ఉంటుంది. బ్యాంకు రుణం పొందిన తర్వాత కేసీసీలను ఏటీఎం కార్డు మాదిరిగా వినియోగించుకోవచ్చు. దుక్కి దున్నటం మొదలుకొని నాట్లు, కలుపులు, ఎరువులు, పురుగుమందుల కొనుగోలు తదితర అవసరాలను బట్టి నగదు డ్రా చేసుకోవచ్చు.

**అవగాహన లేమి..**

పంటలు పండించే రైతులతో పాటు పౌల్ట్రీ, చేపలు, గేదెల పెంపకం, సహకార సంఘాల సభ్యులూ కేసీసీలను పొందటానికి అర్హులు. కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితిని రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచింది. వీటిపై 3% వడ్డీ రాయితీ కొనసాగిస్తున్నట్లు తెలిపింది. కేసీసీల ప్రయోజనాలపై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవటంతో సింహభాగం రైతులు సద్వినియోగం చేసుకోవటం లేదు. బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారుల నిర్లక్ష్యమూ మరో కారణం. తద్వారా రైతులు తెలిసిన వారి నుంచి అధిక వడ్డీలకు అప్పులు చేస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు.

బ్యాంకుల నుంచి తీసుకునే ఇతర అప్పుల కంటే కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పొందే రుణాలకు తక్కువ వడ్డీ పడుతుందని బ్యాంకర్లు చెబుతున్నారు. తనఖా లేకుండానే రూ.2 లక్షల వరకు కేసీసీలు పొందవచ్చుననే నిబంధనా ఎక్కడా అమలవటం లేదని సమాచారం. పంటల సాగుకు తక్కువ వడ్డీకి రుణాలందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డుల రుణపరిమితిని రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు పెంచింది. వీటి ప్రయోజనాలపై క్షేత్రస్థాయిలో రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

# జన ఔషధి.. అవగాహనే పరమావధి

జన్నారం : ప్రస్తుత పరిస్థితుల్లో అనేక మంది ప్రజలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. అందుకు కావలసిన మందులను ప్రతి రోజు వాడాల్సిందే. బీపీ, మధుమేహం, చెడు కొలెస్ట్రాల్‌ను నిరోధించేందుకు వాడే మాత్రల ధర ప్రతి నెల రూ.వేలల్లోనే ఉంటుంది. అయితే ఎనిమిది నెలల క్రితం ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాలు పేదలకు వరంగా మారాయి. మంచిర్యాల జిల్లాలో జన్నారం, చెన్నూరులో వీటిని ఏర్పాటు చేశారు. గత ఏడాది జులైలో జన్నారంలో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రానికి దీర్ఘకాలిక వ్యాధి బారిన పడిన వారు వెళ్లి నెలకు సరిపడా మాత్రలు కొనుగోలు చేస్తున్నారు. మధుమేహానికి వాడే ఒక మాత్రల ప్యాకెట్ ధర బయట మార్కెట్‌లో రూ.292 కాగా ఔషధి కేంద్రంలో అదే మందు బిళ్ల రూ.26కే లభిస్తుండటంతో చాలా మంది మొగ్గు చూపుతున్నారు.ప్రతీనెల రూ.2 వేలు ఆదా అవుతున్నాయి- బి.నర్సింగరావు, జన్నారంకొంతకాలంగా మధుమేహం, బీపీ, కొన్ని ఇతర దీర్ఘకాలిక రోగాల కోసం మందులు కొనుగోలు చేస్తున్నా. జన్నారంలో ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రం ఏర్పాటయ్యాక 50 శాతం డబ్బులు ఆదా అవుతున్నాయి. గతంలో రూ.4 వేలు చెల్లించి కొనుగోలు చేసిన అన్ని రకాల మందులు ఇక్కడ రూ. 2 వేలకే లభిస్తున్నాయి.సద్వినియోగం చేసుకోవాలి- కడ అనిల్, జన్నారం కేంద్రం నిర్వాహకుడు మాది జన్నారం మండలంలోని ఇంధన్‌పల్లి గ్రామం.

# కళ్లు'కప్పి.. గెడ్డల కబ్జా'

విశాఖపట్నం : సహజ సిద్ధమైన గెడ్డలను పూడ్చి కబ్జాకు తెగిస్తున్నారు. రూ.కోట్ల విలువైన భూమిలో దర్జాగా పాగా వేస్తున్నారు. రుషికొండ సమీపంలోని ఓ వైకాపా నాయకుడి కనుసన్నల్లో గెడ్డల ఆక్రమణ జరగుతోంది. ఫలితంగా వర్షాకాలంలో నీరు పోటెత్తి కాలనీలను ముంచేసే ప్రమాదం పొంచి ఉంది.

**పూడ్చి.. కలిపేసుకొని**

ఇది పెద్ద రుషికొండలోని గెడ్డ. సర్వే నెంబరు 28లో ప్రవహిస్తుంది. ఈ పక్కనే సర్వే నెంబరు 27లో ప్రైవేటు స్థలాలున్నాయి. వాటికి చేరుకోవడానికి సరైన దారి లేదని ఏకంగా గెడ్డను చదును చేసి దాదాపు 400 గజాల మేర స్థలంలో కలిపేసుకున్నారు. దాని విలువ సుమారు రూ.2.50 కోట్లు. శ్రీరాం ప్రాపర్టీస్, గీతం ఆసుపత్రి, ఎండాడ పరిసర ప్రాంతాల్లోని వ్యర్థపు నీరు ఈ గెడ్డ ద్వారా ప్రవహించి ఒమ్మివారిపాలెం, రుషికొండ మీదుగా సముద్రంలో కలుస్తుంది. సుమారు 5 కి.మీ. ప్రవహించే ఈ గెడ్డ 20–30 అడుగులు వెడల్పు ఉండాలి. కానీ, ఆక్రమణలతో బక్కచిక్కిపోయింది.

**వంతెన వద్ద..**

ఈ చిత్రం కూడా సర్వే నెంబరు 28లోని గెడ్డే. పెద్ద రుషికొండలోని ఆక్రమణకు 500 మీటర్ల దూరంలో మరో చోట కబ్జాకు గురయింది.



స్వర్ణ భారతి నగర్–పెదరుషికొండ మధ్యలో ఓ వంతెన వద్ద గెడ్డను ఇలా కప్పేశారు. సుమారు రూ.2 కోట్ల విలువైన 300 గజాల స్థలంపై కన్నువేశారు.

**దుకాణాల ఏర్పాటుకు..**

సర్వే నెంబరు 17లోని శుద్ధ గెడ్డ వంతెన సమీపంలో వ్యర్థాలు పోసి ఆక్రమిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని పూడ్చి దుకాణాల ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నారు. ఎంతో విలువైన సుమారు 200 గజాల స్థలంలో దర్జాగా పాగా వేసేందుకు పావులు కదుపుతున్నారు.

**చదును చేసి..రేకుల షెడ్లు వేసి..**

ఈ గెడ్డ ఎండాడ రాజీవ్ స్వగృహ వద్ద ప్రారంభమై చిన్న కాలువతో కలిసి ఎండాడ, గొల్లల ఎండాడ, లక్ష్మీప్రసాద్ లేఅవుట్ మీదగా బీచ్‌లో కలుస్తోంది. సర్వే నెంబరు 100లో 3.02 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఆ ప్రాంతంలో గజం ధర దాదాపు రూ.80 వేలుంటుంది. గొల్లల ఎండాడ ప్రధాన గ్రామానికి సమీపంలో భవన నిర్మాణ వ్యర్థాలతో కప్పి చదును చేసి సమీప స్థలంలోనే కలిపేసుకున్నారు. అక్కడే కార్తీకవనం సమీప ప్రాంతంలోనూ కొంత ఆక్రమణలకు గురైంది. గతంలో రెవెన్యూ అధికారులు ఇక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. కబ్జా చేసిన స్థలంలో మొక్కలు సైతం నాటారు. ఫైరింగ్ రేంజ్‌ను ఆనుకుని గెడ్డ ప్రవహిస్తున్న చోట రేకులు షెడ్డు ఏర్పాటు చేసి వినియోగించుకుంటున్నారు.

# వారధి కష్టాలు సారథులకేం తెలుసు?

బుచ్చెయ్యపేట : వైకాపా ప్రభుత్వ హయాంలో వడ్డాది, విజయరామరాజుపేట సమీపంలోని వంతెనలు కూలిపోయిన విషయం తెలిసిందే. రాకపోకలకు వీలుగా తాత్కాలికంగా కాజ్‌వేలను ఏర్పాటు చేసిన నాటి ప్రభుత్వం కొత్తగా వంతెనల నిర్మాణం చేపట్టకుండా వదిలేసింది. నాటి నుంచి భీమునిపట్నం – నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థులు వడ్డాది, విజయరామరాజుపేట వంతెనలను ప్రస్తావిస్తూ హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చాక గత ఏడాది జూన్ 17న ఎంపీ సీఎం రమేశ్, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెదేపా జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ఈ రెండు వంతెనల పరిశీలనకు వచ్చారు. కొత్తగా వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఎంపీ ఆదేశించారు. ఏడాది అవుతున్నా.. ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

వడ్డాది సమీపంలో పెద్దేరుపై పాత వంతెన 2022 మే నెలలో కూలిపోయింది. నెల రోజులపాటు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. నర్సీపట్నం – చోడవరం మధ్య తిరిగే వాహనాలను వేరే మార్గాల్లోకి మళ్లించారు. ఆ తర్వాత తాత్కాలికంగా మరమ్మతు చేపట్టి కూలిన వంతెన పక్కగా రాకపోకలను పునరుద్ధరించారు. రూ.కోటి వ్యయంతో కాజ్‌వే నిర్మించినా.. తక్కువ ఎత్తులో ఉండటంతో తరచూ ముంపునకు గురవుతోంది. పెద్దేరులో నీటి ప్రవాహం పెరిగినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఏటా వర్షాకాలంలో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వడ్డాది –



చోడవరం మధ్యలో విజయరామరాజుపేట వద్ద తాచేరుపై వంతెన 2023 డిసెంబరు 20న కుప్పకూలింది. పాడేరు, మాడుగుల, వడ్డాది నుంచి వాహనాలు చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం వైపు వెళ్లాలంటే ఈ వంతెన మీదుగానే ప్రయాణించాలి. తాత్కాలికంగా కాజ్‌వే నిర్మించినా.. ఇబ్బందులు తప్పడం లేదు. కాజ్‌వేలు లోతట్టుగా ఉండటంతో వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయి. గతేడాది భారీ వర్షాలకు వడ్డాది కాజ్‌వే ఒకవైపు కొట్టుకుపోయింది. కొద్దిరోజులపాటు రాకపోకలు నిలిపివేసి మరమ్మతు చేశారు. విజయరామరాజుపేట వద్ద తాచేరులో సిమెంటు తూములు వేసి మట్టి రోడ్డు నిర్మించారు. గతేడాది భారీ వర్షాలకు ఈ రోడ్డు కొట్టుకుపోయింది. నెల రోజులపాటు వాహన చోదకులందరూ చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఇప్పటివరకు వంతెనల నిర్మాణం ఊసే లేదు. వానాకాలం వస్తోంది. ఈసారీ రాకపోకలకు ఇక్కట్లు తప్పేలా లేవు.

**అక్కడ అనుమతులు రావాలి.. ఇక్కడ గుత్తేదారు రాలేదు**

వడ్డాది వద్ద వంతెన నిర్మాణానికి రూ.25 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. విజయరామ రాజుపేట దగ్గర వంతెన నిర్మాణం ఎన్‌డీబీ ప్రాజెక్టులో ఉంది. రహదారి అభివృద్ధితో పాటు రూ.5 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టాలి. ఈ పనులు చేసేందుకు గుత్తేదారు ముందుకు రావడం లేదు. సాయిశ్రీనివాస్, సత్యప్రసాద్, ఏఈలు, ఆర్అండ్‌బీ మాడుగుల, చోడవరం సెక్షన్

# మామిడి రైతుకు తీపి పంచలేరా?



తిరుపతి: అందరికీ తీపిని పంచే మామిడి రైతుకు ధరల విషయంలో ఏటా చేదు అనుభవాలే ఎదురవుతున్నాయి. సీజన్ ప్రారంభమైన 15 – 20 రోజుల తర్వాత మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించడం.. కర్షకులు ఉసూరుమనడం రివాజుగా మారింది. యంత్రాంగం తీరిగ్గా రైతు సంఘాలు– వ్యాపారులతో చర్చలు జరిపి మద్దతు ధర నిర్ణయించే తంతు జరుగుతోంది. ఒకట్రెండు రోజులకే యాజమాన్యాలు బేఖాతరు చేస్తున్నాయి. ఈ పరిస్థితికి ఈ ఏడాదైనా చరమగీతం పాడాలని అన్నదాతలు కోరుకుంటున్నారు. సీజన్‌కు ముందుగానే అప్రమత్తమై సంప్రదింపులు జరిపి.. ధరలు ఇవ్వకపోతే ఎదురయ్యే పర్యవసానాలు చెబితే రైతుల ఇక్కట్లు తీరతాయి. మామిడి ధరలు తగ్గించేందుకు యాజమాన్యాలు ఏటా ఏదో ఒక సాకు చెబుతూనే ఉంటాయి. సీజన్ ప్రారంభం, చివర్లో తప్ప కర్షకులకు ధరలు ఎక్కువ ఇచ్చిన దాఖలాలు పెద్దగా లేవు. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా గతేడాది కొనుగోలు చేసిన మామిడికి సంబంధించిన గుజ్జును అధికంగా ఎగుమతి చేయలేకపోతున్నామని వ్యాపారులు అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం అడ్డంకులను తొలగించాలని కోరుతున్నారు. స్థానికంగా వినియోగం పెరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. ఈ డిమాండ్లపై ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందిస్తే నిల్వలు క్రమంగా తగ్గిపోతాయి. ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించాలి. లేదంటే పేరుకున్న గుజ్జును చూపిస్తూ పరిశ్రమల నిర్వాహకులు ధరలు గణనీయంగా తగ్గించినా ఆశ్చర్యం లేదు.

**పది రోజులకోసారైనా సమీక్షిస్తేనే..**

సాధారణంగా ప్రతిసారీ ధరలు భారీగా తగ్గినప్పుడు మాత్రమే చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు స్పందిస్తున్నారు. యాజమాన్యాలు, రైతులకు సమాచారం ఇచ్చిన రెండు రోజుల తర్వాత సమీక్ష నిర్వహిస్తున్నారు. ఆరోజుకు ధర గురించి ఇబ్బంది లేదని వ్యాపారులు చెప్పి బయటకు వచ్చేస్తున్నారు. అదే పది రోజులకోసారి సమావేశమై.. గతంలో నిర్ణయించిన ధరను అమలు చేశారా? లేదా? యాజమాన్యాల వైఖరి ఎలా ఉంది? అని చర్చిస్తేనే బాధ్యతగా మెలుగుతారు.

తిరుపతి జిల్లా కలెక్టర్ కూడా ఇదేవిధంగా సూచనలిచ్చినా వ్యాపారులు ఒక్కరోజే పాటించారు. రెండు రోజుల వ్యవధిలోనే టన్ను ధరను రూ.2వేలు– రూ.5వేలకు తగ్గించారు. మండీలు, ర్యాంపుల నిర్వాహకులైతే రూ.7వేల కోత విధించారు. 2023 మే నెలలో సైతం ఇదే విధంగా నాటి చిత్తూరు కలెక్టర్ షన్మోహన్.. యాజమాన్యాలు, అన్నదాతలతో సంప్రదింపులు జరిపిన తర్వాత టన్ను ధరను రూ.19వేలుగా నిర్ణయించారు. ఇది తమకు గిట్టుబాటు కాదని పరిశ్రమల యజమానులు చెప్పడంతో రెండు రోజులకే రూ.15,500కు తగ్గించారు. అయినా కూడా వ్యాపారులు టన్ను మామిడిని రూ.10 వేలు– రూ.12వేలకు కొన్నారు.

# నాటి నియామకాలు.. నేడు శాపాలై



కుప్పం : ద్రవిడ విశ్వవిద్యాలయంలో గత పాలకులు ఇష్టారాజ్యంగా పొరుగు సేవల ఉద్యోగులను నియమించడంతో ప్రస్తుతం జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఇక్కడ పనిచేసేందుకు 28 మందికి మాత్రమే 2010లో ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అయినా.. కాంగ్రెస్ హయాంలో అప్పటి పాలకులు 254 మందికి పొరుగు సేవల కింద ఉద్యోగాలు ఇచ్చారు. దీంతో ఆ ఉద్యోగులంతా జీతాల కోసం పోరాటం చేస్తున్నారు.

ద్రవిడ విశ్వవిద్యాలయంలో దూరవిద్య ద్వారా యూజీ, పీజీతోపాటు ఆఫ్ క్యాంపస్ పీహెచ్‌డీల్లో వేలాది మంది విద్యార్థులు చదువుకునేవారు. అప్పట్లో వర్సిటీకి పుష్కలంగా ఆదాయం వచ్చేది. న్యాక్ ఎ–గ్రేడు గుర్తింపు ఉన్న విశ్వవిద్యాలయాలకు మాత్రమే దూరవిద్యకు అనుమతులు ఇస్తామని డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో నిబంధనలు విధించింది. దీంతో ద్రవిడలో దూరవిద్య కార్యకలాపాలు ఆగిపోయాయి. అప్పటి నుంచి జీతాల సమస్య ఏర్పడింది. ప్రస్తుతం న్యాక్ ద్రవిడ విశ్వవిద్యాలయానికి బి–గ్రేడు ఇచ్చింది.

**నాడు 144 రోజుల పోరాటం** వైకాపా హయాంలో ఇక్కడి 254 మంది ఉద్యోగులకు జీతాలు అందకపోవడంతో 144 రోజులపాటు నిరసనలు.. ధర్నాలు.. రాస్తారోకోలు చేపట్టారు. అప్పట్లో వారికి కంటితుడుపుగా అరకొర నిధులు అందించి చేతులు దులుపుకొన్నారు.

**'లెక్క' తేల్చాల్సిందే..!:** ప్రభుత్వం నుంచి ప్రతిసారీ నిధులు సర్దుబాటు చేయడం కుదరదు. ప్రత్యేక కమిటీ వేసినా.. జీతాల సమస్యకు పరిష్కారం లభించలేదు. పది మంది విద్యార్థులకు ఒక పొరుగు సేవల ఉద్యోగి ఉండాలి. వర్సిటీలో ప్రస్తుతం 1,407 మంది విద్యార్థులు ఉండగా. ఎంతమంది ఉద్యోగులకు ప్రతిపాదనలు పంపాలో అర్థంకాక వర్సిటీ తలలు పట్టుకుంటున్నారు.

**స్పందించిన కూటమి ప్రభుత్వం:** కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనకు వచ్చారు. పొరుగు సేవల ఉద్యోగులు తమ జీతాలు ఇప్పించాలంటూ మొర పెట్టుకున్నారు. సీఎం తక్షణం ప్రత్యేక నిధుల నుంచి రూ.2.86 కోట్ల నిధులు మంజూరు చేయించారు. పెండింగ్ జీతాలను చెల్లించిన వర్సిటీ పాలకులు ఆపై నిధుల కొరతతో జీతాలు ఆపేశారు.

త్వరలో జీతాలు అందిస్తాం.: రూ.4.50 కోట్లకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలో పొరుగు సేవల ఉద్యోగులకు జీతాలు అందిస్తాం. కిరణ్‌కుమార్, రిజిస్ట్రార్, ద్రవిడ వర్సిటీ

# స్వర్ణముఖిని ఊడ్చేస్తున్నారు!


నాయుడుపేట : మూడు మండలాల్లో స్వర్ణముఖినదిలో ఇసుకను అక్రమార్కులు ఊడ్చేస్తున్నారు. తాగునీటి పథకాలు, రైతుల పంపుసెట్ల వద్ద విచ్చలవిడిగా రాత్రి పగలు తవ్వకాలు జరిపి తరలిస్తున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు నిస్తేజంగా వ్యవహరిస్తున్నారు. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు ఒకటి, రెండు రోజులు తవ్వకాలు నిలిపి అనంతరం యథావిధిగా ఇసుకను తరలిస్తున్నారు. కొందరు నాయకులు రాజకీయ పరపతితో రీచ్‌లు ఏర్పాటు చేసుకొని రెవెన్యూ, పోలీసుల సహకారంతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమార్కులు చెప్పిన ధరలకే ఇసుకను కొనుగోలు చేయాల్చి రావడంతో మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లేకుంటే పోలీసులు వాహనాలు స్వాధీనం చేసుకుంటున్నారని కొందరు వాపోతున్నారు.

**ప్రమాదకరంగా తాగునీటి పథకాలు**

నాయుడుపేట పట్టణ పరిధిలో తాగునీటి పథకాలున్న ప్రాంతాల్లో స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు నిషేధించారు. పురపాలిక సంఘం తిమ్మాజికండ్రిగ కాజువేదగ్గర గేటు ఏర్పాటు చేశారు. ఈ గేటును మాఫియా స్వాధీనం చేసుకొని తమ వాహనాలు మాత్రమే నదిలోకి వెళ్లనిస్తున్నారు. లోతువానిగుంట, పాత, కొత్త బీడీకాలనీ, ఏల్.సాగరం ప్రాంతాల్లో భారీగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఇక్కడ పురపాలిక సంఘానికి తాగునీటిని సరఫరా చేసే బావులు ఉన్నప్పటికీ తవ్వి తరలిస్తున్నారు.

**వాహనాలకు అనుమతి లేదు**

నాయుడుపేట పట్టణంలో ఇసుక తవ్వకాలను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన గేటును తీసి ఉంచడంపై కమిషనర్ ఫజులుల్లాతో ప్రస్తావించగా ఎండ్లబండ్ల ద్వారా మాత్రమే ఇసుక తీసుకెళ్లడానికి అనుమతి ఇచ్చామన్నారు. మిగిలిన వాహనాలు వెళ్లడానికి అవకాశం లేదన్నారు.



**గాడులు పూడ్చి దారులు**

పెళ్లకూరు మండలంలో పెన్నేపల్లి, చావాలి సమీపంలో ఇటీవల రెవెన్యూ అధికారులు ఇసుక దారులకు గాడులు తీసినా మళ్లీ పూడ్చి ఇసుక తరలిస్తున్నారు. ఓజిలి మండలం జోష్యులవారికండ్రిగ వాసులు ఇసుక తవ్వకాలకు అభ్యంతరాలు తెలిపినా తవ్వకాలు చేస్తూనే ఉన్నారు.

**అక్రమ రీచ్‌లున్న ప్రాంతాలివే..**

నాయుడుపేట మండలంలో భీమవరం, చిగురుపాడు, మూర్తిరెడ్డిపాళెం, అయ్యపురెడ్డిపాళెం, మర్లపల్లి, అన్నమేడు, పెళ్లకూరు మండలం చావాలి, పెన్నేపల్లి, కప్పగుంటకండ్రిగ, చింతపూడి, పుల్లూరు, కలవకూరు గ్రామాల్లో అనధికారరీచ్‌లు ఏర్పాటుచేసి భారీగా ఇసుక తరలిస్తున్నారు. ఈ ప్రాంతంలో సాగునీటి పంపుసెట్లు ఉన్న రైతులు భూగర్భ జలాలు అడుగంటుతాయని ఆందోళన చెందుతున్నారు.

# శ్రీకాళహస్తికి పరిశ్రమల హారం

శ్రీకాళహస్తి : కూటమి పాలనలో శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిశ్రమల హారంగా మారనుంది. సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టిసారించి ప్రణాళికలు రూపొందించాలని సమీక్షిస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయి. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

గతంలో తెదేపా ప్రభుత్వంలో అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో రేణిగుంట, ఏర్పేడు మండలాల పరిధిలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రం–1, 2గా ఏర్పేడు– వెంకటగిరి ప్రధాన రహదారిపై ఈఎంసీ–3గా కేటాయించి ఏపీఐఐసీకి పెద్దఎత్తున భూములు కేటాయించారు. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపి పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ



నేపథ్యంలో ఈఎంసీ–1,2లో 830.5 ఎకరాల ఏపీఐఐసీకి భూములు కేటాయించగా.. 330 ఎకరాల్లో రూ.వేల కోట్లు పెట్టుబడులతో డిక్సన్, సిలికాన్, కార్బన్, టీసీఎల్ వంటి 56 భారీ పరిశ్రమలను ఏర్పాటుకు పందగలా భూమి చేశారు. అప్పటికే 30కిపైగా పరిశ్రమలు ఉత్పత్తులను ప్రారంభించడం గమనార్హం.

**పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు**

ఈఎంసీ–1, 2, 3లో వెయ్యి ఎకరాలకు పైగా ఏపీఐఐసీకి కేటాయించిన భూములు అందుబాటులో ఉండటంతో పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి నూతన పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై ప్రత్యేక దృష్టిసారిస్తూ అధికారులతో చర్చలు జరపడంతో రానున్న రోజుల్లో కదలికలు ఏర్పడనున్నాయి.

**తెదేపా హయాంలో శ్రీకారం**

తిరుపతి ప్రాంతం అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు సమీపంలో ఉండటంతో 2014లో పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెదేపా శ్రీకారం చుట్టింది. అతి తక్కువ కాలంలోనే దేశంలోనే ఆదర్శవంతమైన ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రంగా మార్చేందుకు సంకల్పించారు. తర్వాత ప్రభుత్వం మారడంతో అభివృద్ధి కుంటుపడింది.

**వైకాపాలో వెనుదిరిగినవెన్నో**

వైకాపా ఐదేళ్ల పాలనలో నూతన పరిశ్రమలు ఏర్పాటుకాకపోగా జియో, విన్‌టెక్, ఎయిల్‌డిక్సన్, ఫాక్స్‌లింక్ వంటి కొన్ని ప్లాంట్‌లు వెనుదిరిగాయి. శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరు సమీపంలో అపాచీ పరిశ్రమ ఏర్పాటుకు భూమిపూజ చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఏపీఐఐసీకి కేటాయించి భూములు బీడు భూములగానే దర్శనమిస్తున్నాయి.

# బె'ధర'గొడుతున్నారు

చిత్తూరు : వ్యవసాయ శాఖలో అన్నదాతకు వ్యక్తిగత యంత్ర పరికరాలు అందించే యాంత్రీకరణ పథకం ఐదేళ్ల తరవాత అమల్లోకి వచ్చింది. కొన్ని పరికరాలపై 50శాతం.. మరికొన్నింటికి నిర్దేశిత మొత్తాన్ని రాయితీగా నిర్ణయించారు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే వీటి ధరలు ఎక్కువగా నిర్ణయించడం గమనార్హం.. తైవాన్ స్ప్రేయర్‌నే పరిశీలిస్తే.. వ్యవసాయ శాఖ ప్రైవేటు కన్నా రూ.4,132 అధికంగా నిర్ణయించింది. ఇదే స్ప్రేయరుకు ఉద్యానశాఖ రూ.10 వేలు రాయితీ ఇస్తుండగా రైతులు రూ.23 వేలకే కొనుగోలు చేసి బిల్లులు సమర్పిస్తున్నారు.

**తగ్గిపోతున్న సాయం..**

వ్యవసాయ శాఖ సీలింగ్ నిర్ణయించడం వల్ల అన్ని పరికరాలపై 50 శాతం రాయితీ అందడం లేదు. పైకా కొన్నింటి ధరలను అధికంగా



పేర్కొనడంతో రైతుకు వాస్తవంగా దక్కే ఆర్థిక ప్రయోజనం 25 నుంచి 30 శాతమే ఉంటోంది. ఫలితంగా ప్రభుత్వం ఆశించిన మేరకు అన్నదాతకు లబ్ధి చేకూరడం లేదు. ఉద్యానశాఖలో అమలవుతున్న యాంత్రీకరణ పథకం వారికి మేలు చేసేలా ఉంది. ఎందుకంటే రైతులే స్వయంగా బేరమాడి కొనుగోలు చేసి బిల్లులు పెడుతుంటే అధికారులు రాయితీ జమ చేస్తున్నారు. సాధారణంగా ఒక్క పరికరాన్నే కొనుగోలు చేసే రైతు బాగా బేరమాడితే వ్యాపారులు ధర తగ్గిస్తున్నారు. అలాంటిది రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో పరికరాలు కొనుగోలు చేసినప్పుడు ధర ఇంకా తగ్గాల్సి ఉంది. అయితే పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

**పెరిగింది ఇందుకేనంటా..**

నోడల్ ఏజెన్సీగా ఉన్న ఆగ్రోస్‌కు 2శాతం కమీషన్, జీఎస్టీ కారణంగా ధరలు పెరిగాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. యాంత్రీకరణ పథకం కింద రైతులు యంత్రాలు సరఫరా చేసిన కంపెనీలకు రాయితీ సొమ్ము జమ చేసేందుకు 3–4 నెలలు సమయం పడుతుండటంతో ఆయా కంపెనీల ధరలు ఐదు నుంచి 10 శాతం అధికంగా ఉన్నాయని మరికొందరు అధికారులు పేర్కొంటున్నారు.

**అంతంత మాత్రంగానే దరఖాస్తులు**

2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యంత్రీకరణ పరికరాలను రాయితీపై అందిస్తున్నట్లు ప్రభుత్వం ఈ నెల మూడో తేదీన ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలకు లక్ష్యాలను కేటాయించి జిల్లా వ్యవసాయాధికారులకు పంపింది. 24 రోజులు గడిచినా ఉమ్మడి జిల్లాలో కేవలం 1,208 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇక మూడు రోజులే గడువు ఉందని ఈలోగా రైతులు దరఖాస్తు చేసుకుని నాన్ సబ్సిడీ చెల్లించిన వారికి ఆగ్రోస్ ద్వారా యాంత్రీకరణ పరికరాలను రాయితీపై పంపిణీ చేస్తామని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆగ్రోస్ జిల్లా మేనేజరు శశిచంద్రమౌళిరెడ్డి తెలిపారు.

# అవస్థ.. ఆధార్ లేక!

కందుకూరు : పాఠశాలల్లో ప్రవేశానికి ఆధార్ తప్పనిసరి. దీంతో పాటు మరే ఇతర పత్రాలు లేని కొందరు పిల్లలు.. వారి ప్రాథమిక విద్యాహక్కును కోల్పోతున్నారు. అధికారిక ధ్రువీకరణ పత్రాలు లేక ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు పొందలేకపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఏళ్లుగా ఈ తరహా సమస్యలు వింటున్నారేగానీ.. పరిష్కారం మాత్రం చూపడం లేదు.

**వేలాది మందికి.. సమస్య**

జిల్లా వ్యాప్తంగా వేలాది మందికి ఈ సమస్య ఉంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని శివారు కాలనీల్లో అధికంగా ఉంది. సాధారణంగా ఆసుపత్రుల్లో కాన్పు జరిగితే.. అక్కడి సిబ్బంది బిడ్డ, తల్లిదండ్రుల వివరాలను పురపాలికల్లోనో, పంచాయతీల్లోనో అందజేస్తారు. తదనుగుణంగా జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు ఇతర పత్రాలు మంజూరవుతాయి. గిరిజనులు, సంచారల జాతుల వారు ఇళ్ల వద్ద ప్రసవం జరిగాక.. ఆ వివరాలు ప్రభుత్వ కార్యాలయాల్లో అందించకపోవడంతో సమస్యలు వస్తున్నాయి. జనన ధ్రువీకరణ పత్రంతో పాటు ఏదో ఒక ధ్రువీకరణపత్రం ఉంటేనే ఆధార్ నమోదు చేస్తామని నిర్వాహకులు చెబుతున్నారు. ఆధార్ లేని విద్యార్థులు కందుకూరు పట్టణంలో 91 మంది ఉండగా.. రూరల్‌లో 78, గుడ్లూరు 80, కొండాపురం 75, వరికుంటపాడు 28, లింగసముద్రం 82 మంది ఉన్నారు. కావలి, ఆత్మకూరు, నెల్లూరు విద్యాశాఖ సబ్ డివిజన్లను పరిగణనలోకి తీసుకుంటే.. ఈ తరహా విద్యార్థుల సంఖ్య వేలల్లోనే ఉంటుంది. ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి.. సమస్య పరిష్కరించాలని




పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**లేకుండానే పాఠశాలకు..**

– పద్మ, విద్యార్థి తల్లి, జనార్దన కాలనీ

మా కాలనీలో ఎస్టీలు ఎక్కువ మంది ఉన్నాం. మహిళల్లో అధిక శాతం మంది ఇళ్ల వద్దే పురుడు పోసుకుంటుండటంతో.. పుట్టిన పిల్లల వివరాలు ప్రభుత్వ కార్యాలయాల్లో అందజేయడం లేదు. దాంతో మా పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు లేవు. ఆధార్ తీయిద్దామని కేంద్రాలకు వెళితే.. జనన సర్టిఫికెట్ కావాలంటున్నారు. దాంతో ఆధార్ లేకుండానే బడికి పంపిస్తున్నాం.

**పథకాలు అందడం లేదు...**

– అక్షయ, విద్యార్థిని, విప్పగుంటరోడ్డు

మేము విప్పగుంట రోడ్డులో నివాసం ఉంటున్నాం. అమలనాథునిపాలెం ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నా. నాకు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు లేదు. గత ఏడాది మా స్నేహితులకు ‘అమ్మఒడి’ అందినా.. నాకు మంజూరు కాలేదు. ఆధార్ లేకపోతే.. ఇక ఏ పథకం అందదని చెబుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం** చాలా మంది ఎస్టీ పిల్లలకు ఆధార్ కార్డులు ఉండటం లేదు. జనన, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఉంటేనే ఇస్తామంటున్నారు. విద్యా, రెవెన్యూశాఖల ఉన్నతాధికారులతో మాట్లాడి.. అందించేందుకు చర్యలు తీసుకుంటాం.పి.పి. నరసింహారావు, కందుకూరు ఉప విద్యాశాఖాధికారి

# టిడ్కో ఇళ్లు.. మళ్లీ కాంతులు

నెల్లూరు: సొంత ఇల్లు ప్రతి ఒక్కరి కల. దాన్ని నెరవేర్చేందుకు నాడు తెదేపా ప్రభుత్వం చేసిన ప్రయత్నాలకు.. గత వైకాపా పాలకులు గండికొట్టారు. నిరుపేదల కోసం చేపట్టిన టిడ్కో ఇళ్లపై అయిదేళ్లు కక్ష సాధించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో అక్కడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఈ నెలాఖరులోపు లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఆదేశించడంతో.. జిల్లా అధికారులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు.

**90 శాతం పూర్తి**

ఇప్పటికే గుత్తేదారులకు చెల్లించాల్సిన రూ. 40 కోట్లను ఏర్పాటు చేసింది. కొత్తగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వెంకటేశ్వరపురం–1 4,800, కావలిలో 2,112, నెల్లూరుపాళెం 1056, కందుకూరు 1408 ఇళ్లను పూర్తి చేయగా.. అల్లీపురంలో 3984, అక్కచెరువుపాడులో 1576, కల్లూరుపల్లిలో 912, కొండ్లపూడిలో 288 ఇంకా నిర్మించాల్సి ఉంది. ఆయా ప్రాంతాల్లో ఎస్టీపీలు, పార్కులు మినహా.. మిగిలిన అన్ని సౌకర్యాలు కల్పించారు. **రుణాలు ఇప్పిస్తేనే...**జిల్లాలో మొత్తం 31,888 ఇళ్ల నిర్మాణం చేపట్టగా– వీటిలో 24,928 పూర్తి చేశారు. 15,707 లబ్ధిదారులకు




ఇచ్చినట్లు చెబుతున్నా.. ఆ మేరకు ఆక్యుపెన్సీ రేషియో లేకపోవడం గమనార్హం. వీరిలో 5,712 మందికి రుణాలు అవసరంగా కాగా.. ఇప్పటి వరకు 3,320 మందికి రూ.100 కోట్లు అందజేశరు. ఇంకా 2,392 మందికి రూ. 96.73 కోట్లు అవసరం ఉంది. దీన్ని అధిగమిస్తే.. టిడ్కో ఇళ్లు.. ఊళ్లుగా మారుతాయి.

**మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం**

జిల్లాలో టిడ్కో ఇళ్లను 94.70 శాతం పూర్తి చేయగా.. 98.90 శాతం మౌలిక సదుపాయాలు కల్పించాం. వాటిని స్థానిక సంస్థలకు అప్పగించాం. లబ్ధిదారులు ఇప్పుడు చేరినా.. ఎలాంటి ఇబ్బందులు ఉండవు. నగర, పురపాలక సంస్థలు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తున్నాయి. మహేష్, ఇన్‌ఛార్జి ఎస్ఈ, టిడ్కో

# మేలుకోకపోతే.. కన్నీటి కష్టాలే!




కదిరి : ఎండలు మండిపోతున్నాయి. వేసవి తాపానికి తాగునీటి అవసరమూ పెరిగింది. దాహార్తికి, దైనందిన కార్యక్రమాలకు సాధారణ రోజులకంటే నీటి అవసరం ఎక్కువగా ఉంటోంది. కదిరి మున్సిపాలిటీకి పార్నపల్లి చిత్రావతి రిజర్వాయరు నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ముదిగుబ్బ మండలం దొరిగల్లులోని పంప్‌హౌస్ నుంచి రెండు మోటార్లతో నీటిని కదిరికి పంపింగ్ చేస్తున్నారు. అయితే రెండు రోజుల కిందట ఒక మోటారు రిపేరీకి గురైంది. ఫలితంగా సాధారణ రోజుల్లో పంపింగ్ చేసిన నీటిలో సగం మాత్రం కదిరి పట్టణానికి చేరుతోంది. దీంతో జనాభా అవసరాలకు తగిన నీరు సరఫరా జరగక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మోటారు మరమ్మతుకు పది రోజుల సమయం పడుతుందని సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రకటించారు. ఈ నెల 17 వరకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అయితే నీటి ఎద్దడి అధిగమించేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై తీసుకున్న చర్యలు నామమాత్రంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు మేలుకోకపోతే రోజులు గడిచేకొద్దీ సమస్య తీవ్ర రూపం దాల్చనుంది.

**ప్రత్యామ్నాయ చర్యలు ఏవీ?**

వేసవి కావడంతో ప్రస్తుతం పట్టణంలో రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తున్నారు. దొరిగల్లు పంప్‌హౌస్‌లో రెండు మోటార్లు పని చేసినప్పుటి పరిస్థితి అది. గత రెండు రోజులుగా ఒక మోటారు మాత్రమే పనిచేస్తుండటంతో సరిపడినంత నీరు పంపింగ్ చేయలేకపోతున్నారు. ఫలితంగా మూడు, నాలుగు రోజులకోసారి నీరు సరఫరా చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నీటి అవసరాలు పెరగనున్నాయి. దీంతో మున్సిపాలిటీ సరఫరా చేసే నీరు ఏమాత్రం పట్టణ ప్రజలకు సరిపోవు. ఒక మోటారుతోనే పంపింగ్, దీనికితోడు విద్యుత్తు కోతలు, వృథా అయ్యే నీటితో సమస్య మరింత జటిలం కానుంది. మున్సిపల్ అధికారులు ముందుచూపుతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాల్సి అవసరం ఉంది.

**ఇబ్బంది లేకుండా సరఫరా-సందీప్, మున్సిపల్ సహాయ ఇంజినీరు**

మోటారు మరమ్మతుకు గురైనా ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా సరఫరా చేస్తాం. ఇప్పటికే పట్టణంలోని ప్రధాన ట్యాంకులన్నీ నీటితో నింపాం. ఒక మోటారు పనిచేసినా మున్సిపాలిటీలోని అన్ని ప్రాంతాలకు నీళ్లందేలా చూస్తున్నాం. వేసవిని దృష్టిలో పెట్టుకునే మోటార్లు బాగు చేయిస్తున్నాం. తాగునీటి సమస్య లేకుండా చూస్తాం.

# ఐదేళ్ల నిర్లక్ష్యానికి స్వస్తి.. ఇండోర్ స్టేడియం పూర్తి




మడకశిర : తెదేపా హయాంలో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని ఐదేళ్ల పాటు క్రీడాకారులకు అందుబాటులోకి రాకుండా వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే క్రీడాకారులను ప్రోత్సహించేందుకు శ్రీకారం చుట్టింది. మారుమూల ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలో ఎంతో మంది పేద విద్యార్థులు అరకొర సౌకర్యాలతోనే క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగి ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. 2017లో తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.2 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టారు. 2019 నాటికి 85శాతం పనులు పూర్తి చేయగా వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనీసం పట్టించుకోలేదు. దీనిపై ‘ఈనాడు’ కథనాలు ఇవ్వడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 3 నెలల్లో మిగిలిన పనులను పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేసింది. ఈ నెలలో క్రీడా శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**వందల మంది క్రీడాకారులకు ఉపయోగం**

స్టేడియం ప్రారంభమైతే ఇందులో షటిల్, బాల్ బ్యాడ్మింటన్, చెస్, టెన్నిస్ తదితర క్రీడల్లో శిక్షణ పొందడానికి అవకాశం ఉంటుంది. ఇండోర్ క్రీడలు ఆడేందుకు క్రీడాకారులు అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పూర్తి కావడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ఇండోర్ స్టేడియానికి ఎదురుగా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని యువత, మహిళలు, వృద్ధులు ఉదయం, సాయంత్రం వేళల్లో మైదానానికి వస్తుంటారని, బహిరంగ వ్యాయామశాల ఎంతగానో ఉపయోగపడుతుందని త్వరితగతిన పూర్తి చేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. స్టేడియం ఈ నెలలో క్రీడాకారులకు అందుబాటులోకి రానుంది.

**అన్ని ఏర్పాట్లు ఉన్నాయి - కార్తీక్, మడకశిర**

తెదేపా హయాంలో ప్రారంభమైన ఇండోర్ స్టేడియం గత ఐదేళ్లలో పూర్తికాక వృథాగా ఉండేది. ప్రస్తుతం స్టేడియాన్ని పూర్తిగా నిర్మించి అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇండోర్ క్రీడలు ఆడాలని అనుకున్న ఈ ప్రాంత క్రీడాకారులకు ఒక వరంగా మారనుంది. వెంటనే ప్రారంభించి అన్ని సౌకర్యాలు కల్పించాలి.

**శిక్షకుడిని నియమిస్తే బాగు.. - హరిప్రసాద్, క్రీడాకారుడు, మడకశిర**

వెనుకబడిన ప్రాంతం కావడంతో ఇండోర్ ఆటలు ఆడేందుకు పిల్లలు, యువత, విద్యార్థులకు శిక్షకులను నియమిస్తే బాగుంటుంది. క్రీడల్లో ఈ ప్రాంతం నుంచి ఎంతో మంది ప్రతిభ చూపి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ఇండోర్ స్టేడియం ప్రారంభించడం అందరికీ ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

# పురం మున్సిపాలిటీకి ఇంజినీర్ల కొరత




హిందూపురం : పట్టణాల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగాలన్నా, నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలన్నా ఇంజినీరింగ్ విభాగమే కీలకం. రెండు లక్షల జనాభా ఉన్న హిందూపురం పట్టణంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో అధికారులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మున్సిపాలిటీ తరఫున ఏ పనికి టెండర్లు పిలిచి, పనులు చేయించాలన్నా మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) తప్పనిసరి. ఆరు నెలలుగా ఈఈ లేక రూ.లక్ష కన్నా ఎక్కువ విలువైన పనికి టెండర్లు పిలవలేకపోతున్నారు. గతంలో టెండర్లు పిలిచి, గుత్తేదారులను ఖరారు చేసిన పనులకు వర్క్ ఆర్డర్లు ఇవ్వాలంటే ఈఈ సంతకం చేయాల్సి ఉంది. దీంతో పనులు చేయలేకపోతున్నారు.

**తప్పని భారం..**మున్సిపాలిటీలో ఒక్క ఈఈ, నలుగురు డీఈలు, నలుగురు ఏఈలు ఉండాలి. అయితే ఈఈతో పాటు రెండు డీఈ, రెండు ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఇద్దరు డీఈలు ఉండగా ఒకరు సెలవులో ఉన్నారు. ఉన్న ఒక్కరూ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఇతరత్రా పనులతో పని భారం పెరిగి అల్లాడిపోతున్నారు. క్షేత్రస్థాయిలో పనులను చేయించాల్సిన ఏఈలు ఇద్దరే ఉన్నారు. ఒక్క ఏఈ పూర్తిగా నీటి సరఫరాను చూడాల్సి ఉంది. మిగిలిన అన్నీ పనులు మరో ఏఈ చూడాల్సి వస్తోంది.

**ఇవీ కష్టాలు..**పట్టణంలో రూ.1.50 కోట్ల కరవు నిధులతో నీటి సరఫరాను మెరుగుపర్చడానికి టెండర్లు పిలిచి గుత్తేదారును ఖరారు చేశారు. అయితే వర్క్ ఆర్డర్ ఇవ్వకపోవడంతో పనులు జరగలేదు. ఇంటింటా చెత్త సేకరణకు ఆటోలు నిలిచిపోయిన తరువాత, చెత్తను తోపుడు బండ్ల(పుష్‌కార్ట్‌లు)తో కార్మికులు సేకరిస్తున్నారు. ఇవి అవసరమైనన్ని లేవు. రూ.20 లక్షలతో గతంలోనే టెండర్లు పిలిచి, గుత్తేదారును ఖరారు చేశారు. ఆయన వాటిని సరఫరా చేసినా తీసుకోవడానికి ఈఈ అనుమతి అవసరం.

గొల్లపల్లి ప్రాజెక్టులో పలు పంపుహౌస్‌ల వద్ద మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. ఇన్‌టెక్‌వెల్ వద్ద స్టార్టర్లు దెబ్బతిని ప్రమాదాలు జరిగి, విద్యుదాఘాతంతో కార్మికులు గాయపడుతున్నారు. వాటికి మరమ్మతులు అవసరం.

పారిశుద్ధ్య విభాగ కార్మికులకు వస్త్రాలు, కొబ్బరినూనె, బూట్లు, పనిచేయడానికి పరికరాలు అందించాల్సి ఉంది. ఈఈ లేక టెండర్లు పిలవలేకపోతున్నారు. నీ నీటి సరఫరాను పర్యవేక్షణ చేయడానికి ఇంజినీర్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పారిశుద్ధ్య విభాగాన్ని పర్యవేక్షించడానికి పర్యావరణ ఇంజినీర్ లేక, ఇతరులతో చేయించాల్సి వస్తోంది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా..–** శ్రీనివాసులు, పుర కమిషనర్, హిందూపురం ఇంజినీరింగ్ విభాగంలో అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమే.. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో ఇంజినీర్లను నియమిస్తామని వారు తెలిపారు.

# చెత్త తరలింపులో.. అవినీతి కంపు!

నెల్లూరు: నెల్లూరును చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాలన్న ప్రజాప్రతినిధుల కల.. కలగానే మిగిలిపోతోంది. ఇప్పటికే పారిశుద్ధ్య నిర్వహణలో ప్రత్యేక సిబ్బంది పేరుతో దోపిడీకి పాల్పడిన కొందరు అధికారులు.. తాజాగా చెత్త తరలింపు వాహనాల ఏర్పాటులోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నెల్లూరు నగర, రూరల్‌లో చెత్త తరలింపు వాహనాలను గుత్తేదారులు పంచుకున్నారు. టెండర్ల పేరుతో మభ్యపెట్టి.. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.వేయి అదనంగా దక్కించుకున్నారు. అలా అయినా.. సేకరణ సక్రమంగా చేస్తున్నారా? అంటే అదీ లేదు. నిర్దేశించిన ట్రిప్పుల కంటే తక్కువే. అధికారం అండ ఉండటంతో.. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రశ్నించే సాహసం చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. మొత్తంగా ప్రజాధనం వృథా కావడంతో పాటు నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**నెలకు రూ. 31 లక్షల దోపిడీ**

నగరంలో నిత్యం 350 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. దీన్ని మొదట ఇళ్ల నుంచి సేకరించి.. ట్రాక్టర్లలో బోడిగారితోట దగ్గరున్న డంపింగ్ యార్డుకు తరలిస్తారు. అనంతరం అక్కడి నుంచి దొంతాలి యార్డుకు తీసుకువెళతారు. వైకాపా ప్రభుత్వంలో క్లాప్ వాహనాలు ఏర్పాటు చేశారు. పేరుకు 95 కేటాయించినా.. వాటిలో 65 మాత్రమే వినియోగ



ంలోకి వచ్చాయి. అందులోనూ చాలా పనిచేయలేదు. గుత్తేదారు ఫైనాన్స్ కట్టకపోవడంతో.. వాటిని స్వాధీనం చేసుకున్నారు. దాంతో నగరంలో చెత్త తరలింపునకు ఒప్పంద ప్రాతిపదికన ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకోగా.. కొందరు వాటిని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. మొత్తం 105 ట్రాక్టర్లు తీసుకోగా.. వాటిని నగర, రూరల్ నియోజకవర్గాల నాయకులు పంచుకున్నారు. అంతటితో ఆగకుండా.. గతంలో రోజుకు ట్రాక్టర్ అద్దె రూ. 2,750 చెల్లిస్తుండగా.. ఆ మొత్తాన్ని రూ. 3,750కి పెంచి తీసుకున్నారు. దాంతో నగరపాలక సంస్థకు రోజుకు రూ. 1.05 లక్షలు కాగా.. నెలకు రూ. 31.50 లక్షలకు నష్టం వాటిల్లుతోంది.

దీనిపై నగరపాలక సంస్థ ఎస్ఈ రామమోహన్‌రావు వివరణ కోరగా.. చెత్త తరలింపునకు అద్దె ప్రాతిపదికన ట్రాక్టర్లు తీసుకున్నామని.. టెండర్లు పిలిచి గుత్తేదారులకు అప్పగించామని అన్నారు. వారు సక్రమంగా తరలిస్తున్నారో? లేదో? చూడాల్సిన బాధ్యత పారిశుద్ధ్య విభాగానిదని తెలిపారు.

# స్త్రీనిధి.. స్వశక్తి పెన్నిధి

ఒంగోలు : మహిళలు స్వయం ఉపాధిని మెరుగుపర్చుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్న ఉద్దేశంతో స్త్రీనిధి క్రెడిట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏటా రుణాలు మంజూరు చేస్తోంది. జీవనోపాధి యూనిట్ల ఏర్పాటుతో నెలవారీ వాయిదాల్లో రుణాన్ని తిరిగి చెల్లించేలా లబ్ధిదారులకు వెసులుబాటు కల్పించింది. సొమ్ము అవసరమున్న సభ్యులు సులభంగా రుణం పొందవచ్చు. స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించి స్వశక్తితో ఆర్థికంగా ఎదగొచ్చు. అందుకు స్త్రీనిధి రుణం అక్కరకు రానుంది.

**సంఘానికి రూ.5 లక్షలు:** జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే వాణిజ్య బ్యాంకుల ద్వారా సంఘానికి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు రుణం మంజూరవుతోంది. అవి కాకుండా సభ్యులు ఎవరైనా ఉపాధి యూనిట్ విస్తరణ, ఇతర అవసరాలకు అదనంగా నగదు కావాలంటే సదరు సంఘం సభ్యుల తీర్మానంతో మండల డీఆర్డీఏ–వెలుగు కార్యాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత రెండు రోజుల్లోనే మంజూరు చేస్తారు. సభ్యులు ఎందరున్నా ఒక్కో సంఘానికి గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు, ఒక మహిళకు రూ.లక్ష చొప్పున ఇవ్వనున్నారు.



**దాపరికానికి లేదు చోటు**

గతంలో సంఘంలో సభ్యులకు తెలియకుండా రుణాలు వాడుకునే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం అందుకు తావు లేదు. రుణం పొందిన సభ్యురాలు లేదా కుటుంబ సభ్యులకు స్మార్ట్ చరవాణి ఉంటే.. ప్లేస్టోర్ నుంచి స్త్రీనిధి ఆన్‌లైన్ పేమెంట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా ఈ నెలాఖరులోపు అమల్లోకి తేనున్నారు. సభ్యురాలి ఫోన్ నంబరుతో సంఘం పేరు, ఇతర వివరాలను అందులో నమోదు చేయాలి. అనంతరం వన్‌టైం పాస్‌వర్డ్ వస్తుంది. ప్రతి నెలా రుణ వాయిదాను తిరిగి ఆన్‌లైన్ ద్వారా నేరుగా.. లేదంటే గ్రామ సమాఖ్య సంఘానికైనా చెల్లించొచ్చు. తద్వారా ఇతరులు దారి మళ్లించే అవకాశం ఉండదు.

**మహిళలు సద్వినియోగం చేసుకోవాలి**

డాక్యుమెంటేషన్ పూర్తి చేసిన 48 గంటల్లోనే సభ్యురాలికి రుణం మంజూరు చేస్తాం. తొలుత సంఘానికి జమ చేసి, ఆ తర్వాత వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు నగదు జమ అవుతుంది. రూ.50 వేల రుణం రెండేళ్లు, రూ.లక్ష రుణం అయితే చెల్లించేందుకు మూడేళ్లు గడువు విధించగా, అందుకు వడ్డీ 11 శాతం చొప్పున వసూలు ఉంటుంది. అవసరమైన వారికి సత్వరమే రుణాలు మంజూరు చేస్తాం. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. హర్షవర్ధన్, ఏజీఎం, స్త్రీనిధి సంస్థ

చురకలు



# నీరు.. నీడా కరవే!



పుట్టపర్తి : రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్నాయి. రానున్న ఐదు రోజుల్లో మరింత పెరగనున్నట్లు బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట వాతావరణ కేంద్రం శాస్త్రవేత్తలు ప్రకటించారు. పగటి ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలు దాటనుందని తెలిపారు. ఈ క్రమంలో శ్రీసత్యసాయి జిల్లాలో వేసవి ఎండ వేడిమి నుంచి ఉపశమనం కల్పించేందుకు అధికారులు ఉపాధి హామీ పథకం కూలీలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలేదు. పెరుగుతున్న ఎండల నేపథ్యంలో ఉపాధి కూలీలకు తాగునీరు, నీడ తదితర వసతి కల్పించకపోవడంతో పనులు చేసేందుకు వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడిప్పుడే ఉష్ణోగ్రతలు ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎలా ఉంటాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 2.50 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా రోజూ 34 వేల మంది ఉపాధి కూలీలు పనులకు వెళ్తున్నారు. వర్షభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు సాగు చేయలేక, పల్లెల్లో పనులు లేక వ్యవసాయ కూలీలు పట్టణాలకు వలసలు వెళ్తున్నారు. ఉన్న కొద్ది మంది ఉపాధి పనులు చేసుకుంటూ పొట్ట నింపుకొంటున్నారు. అయితే పనిచేసే ప్రదేశాల్లో వారికి వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులదే. ఎండల ముదరకముందే కూలీలకు మజ్జిగ, తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. పని చేసే క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉంచాలి. చంటి బిడ్డలకు పాలివ్వడానికి, పిల్లలను నిద్రపుచ్చేందుకు నీడ వంటివి సమకూర్చాలి. అయితే సంబంధిత అధికారులు ఇవేవీ ఏర్పాటు చేయడంలేదు. కూలీల క్షేమం గురించి అసలు పట్టించుకోవడంలేదు. ఎండలు పెరుగుతున్న వేళ వాటిని సమకూర్చడంపైనా వారు దృష్టిసారించకపోవడం విచారకరం. **వసతులు కల్పిస్తాం..- విజేంద్రప్రసాద్, డ్వామా పీడీ**

వేసవిలో కూలీలు పనిచేసే ప్రాంతంలో నీడ, తాగునీటి సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాం. ఉదయమే పనులకు వచ్చి, ఉష్ణోగ్రతలు పెరిగే సమయానికే పనులు ముగించుకుని వెళ్లాలని సూచించాం. వేసవిలో కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

# అర్ధరాత్రి హల్‌చల్

విశాఖపట్నం : విశాఖ మహా నగరంలో దందాలు, భూ కబ్జాలు కొనసాగిస్తున్న కొందరు ప్రజాప్రతినిధుల పేరుచెప్పి హల్‌చల్ చేస్తున్నారు. తాజాగా... ఓ వివాదాస్పద స్థలంలో జోక్యం చేసుకుని రౌడీ మూకలతో బెదిరింపులకు పాల్పడటం చర్చనీయాంశమైంది. అర్ధరాత్రి ఏకంగా జేసీబీతో నిర్మాణాలను కూలగొట్టారు. దీనిపై ఫిర్యాదు చేసిన వారిపైనే పోలీసులతో ఒత్తిళ్లు తెస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. పెందుర్తి సమీప సుజాతనగర్‌లో టీచర్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో కొంత భూమి ఉంది. ఈ సొసైటీలోని సభ్యుల వారసులకు...సంఘానికి అధ్యక్షులుగా ఉన్న వీఎస్ శర్మ ద్వారా కొన్ని ప్లాట్లు కేటాయించారు. అందులో ప్లాట్ నెంబరు 267, 269, 271ల స్థలాల దస్తావేజులు ముగ్గురి పేరిట ఉన్నాయి. మరో నలుగురి ప్లాట్లతో కలిపి మొత్తం 1,500 చదరపు గజాల ఖాళీ స్థలం చుట్టూ రక్షణ గోడ ఏర్పాటు చేసి, షెడ్డు నిర్మించి గేటు ఏర్పాటు చేసుకున్నారు. అయితే...ఈ నెల 7వ తేదీ అర్ధరాత్రి 2 గంటల సమయంలో కొందరు రౌడీమూకలతో స్థలంలోకి ప్రవేశించి జేసీబీతో గోడలు ధ్వసం చేశారు. షెడ్డును నేలమట్టం చేశారు. దీంతో రూ. లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు చెబుతున్నారు. భూ కబ్జా చేయడానికి యత్నించిన వారిపై సమీపంలోని సీసీ కెమెరాల ఆధారాలతో చర్యలు తీసుకోవాలని 8వ తేదీన పెందుర్తి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిర్మాణాలు కూల్చుతున్న వీడియోలతో 9న వాట్సప్ ద్వారా సీపీకి ఫిర్యాదు చేశారు.

**స్థలంపై వివాదాలు:** టీచర్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ 1980లో సుమారు 4.20 ఎకరాల స్థలం కొనుగోలు చేసింది. అయితే రైతుల వారసులు తమ సంతకాల్లేవంటూ కోర్టును ఆశ్రయించడంతో సర్వే సంఖ్య 184/1ఏలో 1.16 ఎకరాలు, 184/1బిలో



1.16ఎకరాలు, 184/1సిలో 38సెంట్లు చొప్పున మొత్తం 2.70 ఎకరాలు వెనక్కి ఇచ్చేయాలని కోర్టు ఆదేశించింది. ఇలా రైతులకు వచ్చిన ఆ భూమిని వేరే వ్యక్తి కొనుగోలు చేసి విక్రయించారు. అయితే 184/1ఏ డాక్యుమెంట్‌తో 184/1సి పక్కన ఉన్న 80 సెంట్ల సొసైటీ స్థలాన్ని కొనుగోలుదారులకు చూపిస్తున్నారనేది బాధితుల వాదన.

నివేదిక వచ్చిన తరువాత..: స్థల వివాదం నేపథ్యంలో దస్త్రాలు పరిశీలించాలని పెందుర్తి తహసీల్దార్‌కు లేఖ రాశాం. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం. దస్త్రాల్లో స్పష్టత లేని నేపథ్యంలో గతంలో భూమి విక్రయించిన వ్యక్తిని విచారణకు రావాలని కోరాం' అని సీఐ కె.వి. సతీశ్‌కుమార్ పేర్కొన్నారు.

**విలువైన స్థలం కావడంతో...**

సుమారు ఏడుగురు పేర్లతో డాక్యుమెంట్స్ ఉన్న సొసైటీ స్థలంలో ఒక షెడ్డును నిర్మించి కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారు. ఖాళీ స్థలం పన్ను (వీఎల్టీ) సైతం చెల్లించారు. ఈ స్థలంలో ప్రహరీ, షెడ్డు కూల్చడంతోపాటు ఎవరైనా అడుగుపెడితే చంపేస్తామంటూ బెదిరిస్తున్నట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారినే స్టేషన్‌లో సాయంత్రం నుంచి రాత్రి వరకు కూర్చోబెట్టి కనీసం స్థల సమస్య వినకుండా పంపించారని చెబుతున్నారు. మొత్తం సర్వే చేసి స్థలం హద్దులు నిర్ణయించాలని, అక్రమంగా చొరబడి నిర్మాణాలను కూల్చినవారిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు కోరుతున్నారు. అయితే..రూ. కోట్ల విలువైన ఈ స్థలం వ్యవహారంలో కొందరు నాయకు లు జోక్యం చేసుకోవడంతో యంత్రాంగంపై ఒత్తిళ్లు పెరిగినట్లు సమాచారం.

# బియ్యం మగ్గిపోతున్నాయ్!



గుంతకల్లు: అనంతపురం జిల్లాకే కాకుండా రాయలసీమకు అందించడానికి కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల్లో సేకరించిన బియ్యాన్ని గుంతకల్లులోని భారత ఆహార సంస్థకు చెందిన గోదాముల్లో ఒకటిన్నర ఏడాదిగా నిల్వ చేశారు. వీటిని తీసుకోవడానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పౌరసరఫరాల విభాగం నిరాకరించడంతో అలానే ఉండిపోయాయి. గుంతకల్లులోని 9 గోదాముల్లో కేంద్ర ప్రభుత్వం రూ.96 కోట్లు విలువ చేసే 2,40,000 వేల క్వింటాళ్ల బియ్యాన్ని నిల్వ ఉంచింది. ఇందులో ఎక్కువగా నూకలు ఉన్నాయనే ఉద్దేశంతో పౌరసరఫరాల విభాగం బియ్యాన్ని తీసుకోవడానికి తిరస్కరించినట్లు తెలిసింది.

**అధికారులకు తప్పని తిప్పలు**

చాలా కాలం పాటు బియ్యం బస్తాలను గోదాముల్లో నిల్వ ఉంచడంతో అవి దెబ్బతింటున్నాయి. నిల్వలు పాడవ్వకుండా ఉంచడానికి అధికారులు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. దేశంలోని నలుమూలల నుంచి గూడ్సు వ్యాగన్ల ద్వారా బియ్యం బస్తాలను గుంతకల్లు గోదాములకు తరలించారు. ప్రారంభంలోనే బియ్యాన్ని వినియోగించుకుని ఉంటే అవి ప్రజలకు చక్కగా ఉపయోగపడేవి. వినియోగం ఆలస్యం అవుతుండటంతో రోజురోజుకు దెబ్బతింటున్నాయి. సకాలంలో వాటిని వినియోగించుకోక పోతే ప్రభుత్వానికి పెద్ద నష్టం వచ్చే అవకాశం ఉంది. బస్తాల నుంచి పురుగులు బయటికి వస్తుండడంతో రాత్రి సమయాల్లో పరిసరాల్లో ఉండే జనం ఇబ్బంది పడున్నారు. రోజూ తినే ఆహారంలో పడుతున్నాయని వాపోతున్నారు.

**త్వరలోనే ఇతర రాష్ట్రాలకు..- విజయలక్ష్మి, భారత ఆహార సంస్థ ఆంధ్రప్రదేశ్ విభాగం డైరెక్టరు**

గోదాముల్లో కేంద్రం నిల్వ ఉంచిన బియ్యాన్ని తీసుకోవడానికి రాష్ట్ర పౌరసరఫరాల అధికారులు ముందుకు రావడంలేదు. బియ్యంలో నూకలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. వాటిని వేరే రాష్ట్రాలకు తరలించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిది. సాధ్యమైనంత త్వరగా బియ్యం నిల్వల తరలింపు ప్రారంభమవుతుంది.

# అన్నప్రసాదానికి అధునాతన భవనం

కాణిపాకం : కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో భక్తుల రద్దీకి అన్నదాన భవనం సరిపోక చాలామంది స్వామివారి అన్నప్రసాదం కోసం నిరీక్షించాల్సి వస్తోంది. దీన్ని పరిష్కరించేందుకే సామూహిక కల్యాణ మండపంలో అధునాతన వసతులు సమకూర్చి అన్నదాన భవనంగా మార్చనున్నారు.

కాణిపాకం ఆలయానికి నిత్యం 20 వేల మందికి తగ్గకుండా భక్తులు వస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 2,500 మందికి అన్నదానం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న అన్నదాన భవనం 20 ఏళ్ల కిందట అప్పటి రద్దీకి



అనుగుణంగా నిర్మించారు. ఇక్కడ ఒకసారి 190 మంది భోజనం చేయొచ్చు. ఆలయానికి భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ఒకేసారి 450 మంది కూర్చొని భోజనం చేసేలా కల్యాణ మండపంలో రూ.3.6 కోట్లతో మార్పులు చేస్తున్నారు. ఆ తర్వాత రూ.2.8 కోట్లతో రెండో దశ పనులు చేపడతారు. అవి పూర్తయితే మరో 450 మంది భోజనం చేసే వీలుంటుంది. అలా రోజుకు అన్నదానాన్ని రోజుకు ఐదు వేల మందికి పెంచనున్నారు. ఇందుకు అనుగుణంగా రూ.80 లక్షలతో అధునాతన వసతులతో కూడిన వంట గదులు నిర్మిస్తున్నారు.

మేలో ప్రారంభం..మొదటి దశ నిర్మాణం మే నెలలో పూర్తిచేసి భవనాన్ని ప్రారంభిస్తాం. భక్తులకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన, రుచికరమైన అన్న ప్రసాదం అందజేస్తాం. పెంచల కిషోర్, కాణిపాకం ఆలయ ఈవో

# ఉపకులపతి నియామకంపై సందిగ్ధం

గుత్తి : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి నియామకంపై సందిగ్ధం నెలకొంది. గతేడాది జులై 18న ఎంబీఏ విభాగం ఆచార్యులు బి.అనితను ఇన్‌ఛార్జి వీసీగా ప్రభుత్వం నియమించింది. అప్పటి నుంచి వర్సిటీలో ఇన్‌ఛార్జి పాలన కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల 8 విశ్వవిద్యాలయాలకు రెగ్యులర్ వీసీలు నియమితులయ్యారు. ఈక్రమంలోనే గత నెల 18న జేఎన్‌టీయూ వీసీగా సుదర్శనరావును ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఎస్కేయూకి సైతం నియమిస్తారనే చర్చ జరిగింది. ఇంతవరకూ తేల్చకపోవడంతో పలు ప్రగతి పనులు ముందుకు సాగడంలేదు. ఉపకులపతుల నియామకంలో సెర్చ్ కమిటీ పాత్ర కీలకం. ఇందులో ముగ్గురు సభ్యులుంటారు. వర్సిటీ పాలకమండలి ఒక సభ్యుడు, ప్రభుత్వం మరో సభ్యుడిని... యూజీసీ మూడో సభ్యుడి నియమిస్తుంది. ఈ కమిటీ అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి ముగ్గురు పేర్లను ఎంపికచేస్తుంది. వారిలో ఒకరిని వీసీగా గవర్నర్ నియమిస్తారు. విశ్వవిద్యాలయాల్లో బోధన మెరుగు పరచాలని, నూతన కోర్సులు, విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీయడం, వర్సిటీలను అభివృద్ధి పథంలో నడిపించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. వర్సిటీలను బలోపేతం చేయడంలో భాగంగా ఎన్ఐటీ, ఐఐటీ విద్యాసంస్థల్లోని ఆచార్యులను ఉపకులపతులుగా నియమిస్తున్నట్లు మంత్రి లోకేశ్ సైతం స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిపాదించిన ఉపకులపతి అభ్యర్థి పేరు సెర్చ్ కమిటీ ఎంపిక చేసిన జాబితాలో లేనట్లు సమాచారం. దీంతో ఎంపిక ప్రక్రియ కొంత ఆలస్యమవుతోంది. ప్రస్తుతం ఉన్న సెర్చ్ కమిటీతోనే పునఃపరిశీలన చేయించడమా..? లేదంటే నూతన సెర్చ్ కమిటీ ఏర్పాటుతో ఎంపిక ప్రక్రియ చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. కొత్త కమిటీ ఏర్పాటు చేస్తే నియామకం మరింత ఆలస్యం కానుంది.

**పోటాపోటీ..**

ఉపకులపతి పదవికి పలువురు పోటీ పడుతున్నారు. కొందరు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. విశ్రాంత ఆచార్యులు సుధాకర్‌బాబు, దశరథరామయ్య, శ్రీధర్, రమణ, వేణుగోపాల్‌రావు, పుల్లారెడ్డి, ప్రస్తుత ఆచార్యులు వెంకటనాయుడు, ఆంజనేయులు ఉపకులపతి పదవి కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

# హెచ్చెల్సీ కాలువలో ఆగిన ప్రవాహం

బుక్కరాయసముద్రం : వారం రోజుల కిందట హెచ్చెల్సీ ఆయకట్టు కాలువకు నీటి సరఫరా ఆగిపోవడంతో వివిధ రకాల పంటలు సాగుచేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. హెచ్చెల్సీ కాలువ పరిధిలో గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల, శింగనమల, పుట్లూరు మండలాల్లో దాదాపుగా 30 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా 5 నెలల పాటు కాలువకు సాగునీరు విడుదల చేశారు. ప్రస్తుతం హెచ్చెల్సీ ఆయకట్టు కింద రబీ సీజన్ గత డిసెంబరులో వరి, వేరుసెనగ, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు సాగుచేశారు. కాలువలో నీరు పారడంతో దాని పరివాహక ప్రాంతాల్లో బోర్ల కింద మరో 10 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలైన అరటి, దానిమ్మ, బత్తాయి, బొప్పాయి పంటలు సాగు చేశారు. అయితే ఈ నెల ప్రారంభంలోనే అధికారులు హెచ్చెల్సీ కాలువకు నీరు సరఫరా నిలిపివేశారు.

పంటలు చేతికి రాకముందే నీటి సరఫరా నిలిపివేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉద్యాన పంటలు, కూరగాయలు, ఆకుకూరల పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ నెల చివరి వరకూ నీరు విడుదల చేస్తే రబీ పంటలు చేతికొస్తాయని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, హెచ్చెల్సీ అధికారులు చొరవ తీసుకుని కాలువకు నీరు విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

# కడలిలోకి కలుషిత జలాలు..

అనకాపల్లి : అచ్యుతాపురం, పరవాడ మండలాల సరిహద్దునున్న తంతడి తీరాన్ని వైకాపా నేతకు చెందిన హేచరి కలుషితం చేస్తోంది. రొయ్య పిల్లల పెంపకంలో ఉపయోగించే రసాయనాలను శుద్ధి చేయకుండానే నేరుగా సముద్రంలోకి విడిచిపెట్టేస్తున్నారు. వీటి ఘాటుకు స్థానిక మత్స్యకారులే కాదు, తీరంలో సరదాగా గడపడానికి వచ్చే పర్యాటకులు ఇబ్బందులు పడాల్సివస్తోంది. వైకాపాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి చెందిన ఈ హేచరి వైపు గత అయిదేళ్లు ఎవరూ అటుగా కన్నెత్తి చూడనేలేదు. వేటికి అనుమతులు తీసుకున్నారు.. ఏమి పెంచుతున్నారు.. ఏయే రసాయనాలు వినియోగిస్తున్నారో కూడా పరిశీలన చేయలేదు. కలుషిత జలాలను అలానే తీరంలోకి వదిలేసేవారు. ఆ ప్రాంతంలో తాబేళ్లు కూడా మృత్యువాత పడ్డాయి. ఆర్థిక, అంగబలం ఉండడంతో మత్స్యకారులు నోరు మెదపలేకపోయేవారు. అప్పుడు అధికారంలో ఉండడంతో అధికారులు కూడా పట్టించుకుండేవారు కాదు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ హేచరీ నిర్వహణ మరోకరి చేతులోకి వెళ్లింది. వ్యర్థాల నిర్వహణ మాత్రం గతంలో లాగే కొనసాగిస్తుండడం గమనార్హం. హేచరీ నిర్వహణలోనూ నిబంధనలను మీరుతున్నారు. ఇదివరకు ఓ



రకం రొయ్య పిల్లల పెంపకానికి అనుమతి తీసుకుని మరో రకం రొయ్యలు పెంచినట్లు మత్స్యశాఖ అధికారులు గుర్తించి వాటిని సముద్రంలోకి పారబోసినట్లు తెలిసింది. హేచరీ నిర్వహణ చేతులు మారినా మాజీ ఎమ్మెల్యేకు చెందింది కావడంతో ఎవరూ ఫిర్యాదు చేయడానికి సాహసించడం లేదు. తీరం కోతకు గురవ్వకుండా అటవీ శాఖ పరిధిలో ఉండే క్లస్టర్ బెల్ట్‌లో అనుమతుల్లేకుండా బోర్లు తీసి నీటిని వాడుకుంటున్నారనే ఆరోపణలూ ఉన్నాయి.

**ముక్కు మూసుకోవాల్సిందే..**

తంతడి వాడపాలెం తీరం పర్యాటకానికి పెట్టింది పేరు. ఇక్కడ లోకేషన్లు అందంగా ఉండడంతో సినిమా చిత్రీకరణలు జరుగుతుంటాయి. అలాంటి చోట నేడు పర్యాటకులు ముక్కు మూసుకోకుండా పట్టుమని పది నిమిషాలు ఉండలేకపోతున్నారు. సముద్రంలో స్నానాలకు దిగిన ప్రాంతంలో రొయ్యల హేచరీ నుంచి వ్యర్థ జలాలు పైపుల ద్వారా తీరంలోకి వదిలేస్తున్నారు. వాటి నుంచి వెలువడే గాఢమైన వాసన భరించలేక పర్యాటకులు వెనుదిరగాల్సి వస్తోంది. పగటి పూట కొంతవరకు నియంత్రణ పాటించినా రాత్రి వేళల్లో ఇష్టారాజ్యంగా రసాయన వ్యర్థాలను సాగరంలోకి విడిచిపెడుతున్నారు. దీంతో చుట్టుపక్కల చేపలవేట కూడా సాగించలేకపోతున్నామని స్థానిక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఫిర్యాదులొస్తే చర్యలు**

కలుషిత జలాల విషయమై డీఎఫ్‌వో శామ్యూల్ వద్ద ప్రస్తావించగా అక్కడ హేచరీపై ఇప్పటి వరకు ఫిర్యాదులు ఏవీ రాలేదన్నారు. నిబంధనలు మీరినట్లు తెలిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. మత్స్యశాఖకు చెందిన స్థానిక ఎఫ్‌డీవో రవితేజ వద్ద ప్రస్తావించగా, 'శుద్ధి చేసిన తర్వాతనే వ్యర్థ జలాలు విడిచిపెట్టాలి. అలాచేయకుండా వదిలినప్పుడు ఎవరైనా మాదృష్టికి తీసుకొస్తే నిర్వాహకులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామ'ని స్పష్టంచేశారు.

# విస్తరణకు ఆరేళ్ల గ్రహణం

నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలో రహదారుల విస్తరణ కలగానే మిగిలింది. దశాబ్దాల కిందటి ఇరుకు రోడ్లపై రద్దీ పెరగడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు వేధిస్తున్నాయి. పాత బస్టాండు మార్గం, పటేల్ కూడలి నుంచి బ్రహ్మంగారి మఠం వరకు వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. మిడుతూరు రోడ్డు, ఆసుపత్రి రహదారిలోనూ ఇదే పరిస్థితి. దీంతో పట్టణ వాసులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కేజీ రోడ్డును విస్తరించడంతో పాటు బైపాస్ ఏర్పాటుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**పనులన్నీ అసంపూర్తే..**

పట్టణంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ఆరేళ్ల కిందట కేజీ రహదారిని 80 మీటర్లకు విస్తరించారు. ఇరువైపులా దానిని అభివృద్ధి చేయాల్సి ఉన్నా.. ప్రజాప్రతినిధులు, అధికారులు దుకాణదారుల ఒత్తిళ్లకు లొంగి పనులు చేయడం లేదు. రాజకీయ కారణాలతో ఈ పనులు నిలిచిపోయాయి. ఇప్పటికీ కేజీ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు పూర్తి కాలేదు.

కొత్త బస్టాండు నుంచి పోలీస్ స్టేషన్ వరకు కేజీ రహదారికి ఇరువైపులా రెండు మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణం చేసి వదిలేశారు. దీంతో గతంలో ఉన్న ప్రధాన కాల్వలు పూడిపోయాయి. నూతన కాల్వల నిర్మాణం చేపట్టలేదు.

**అంబులెన్స్‌లు వెళ్లాలన్నా అవస్థే..**

పట్టణంలోని పగిడ్యాల, మిడుతూరు, ఆసుపత్రి రహదారులు చాలా ఇరుకుగా మారాయి. 108 వాహనం రాకపోకలకు కూడా అంతరాయం కలుగుతోంది.

పగిడ్యాల మార్గంలో రహదారిపైనే తోపుడుబండ్లు పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. జరిగే సంతకు పగిడ్యాల, మిడుతూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, గడివేముల మండలాల నుంచి ప్రజలు వచ్చి సరకులు కొనుగోలు చేస్తుంటారు. ఆ రోజు పగిడ్యాల రోడ్డు వాహనాలు, జనంతో కిటకిటలాడుతుంది.

**వన్‌వే మాట మరిచారు**

పట్టణంలో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు పాతికేళ్ల కిందట పగిడ్యాల రోడ్డు నుంచి ఆత్మకూరు రహదారిని కలుపుతూ బైపాస్ రోడ్డు ఏర్పాటు చేసి వన్‌వేగా మార్చారు. పట్టణంలోకి వచ్చే వాహనాలు పాతబస్టాండు వైపు రాకుండా ఈ బైపాస్ గుండా పంపించి వెళ్లి పట్టణం బయట కేజీ రోడ్డులో కలిసేవి. దీంతో ట్రాఫిక్ సమస్య తక్కువగా ఉండేది. దీనిని కొన్నాళ్లే అమలు చేశారు. ప్రస్తుతం వాహనాలన్నీ పట్టణంలోకి ప్రవేశిస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు మళ్లీ

చురకలు



# చెరువుల అనుసంధానం.. గెడ్డలకు జీవం

: పట్టణీకరణ ప్రభావం ప్రకృతి వరప్రసాదాలైన సాగునీటి చెరువులపై పడింది. నర్సీపట్నంలో ఈ పరిస్థితి మరీ ఎక్కువగా ఉంది. ఇటీవల నిర్వహించిన సర్వేలో పెద్దచెరువు గెడ్డ కొంతమేర ఆక్రమణకు గురైనట్టు జలవనరుల శాఖ సిబ్బంది గుర్తించారు. ఆక్రమణలకు అడ్డుకట్ట వేయకపోతే గెడ్డలు మరింత కుదించుకుపోయే ప్రమాదం ఉందని ఆ శాఖ అధికారులు శాసనస భాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లారు. మానవాళి మనుగడకు మేలు చేసే సాగునీటి చెరువులు, గెడ్డలు, కాలువలు ఏ విధంగానూ అన్యాక్రాంతం కావడానికి వీల్లేదని అయ్యన్న స్పష్టం చేశారు. పరిరక్షణకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో గెడ్డకు నర్సీపట్నం శారదానగర్ ప్రాంతంలో సుమారు



150 మీటర్ల మేర రక్షణ గోడలు నిర్మించేందుకు, మిగతాచోట్ల గెడ్డ విస్తీర్ణం మేరా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇందుకు రూ.25 లక్షలు అవసరమని అంచనా వేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపారు. నర్సీపట్నంలో గెడ్డకు ఇరువైపులా సెంటు భూమి రూ. ఏడు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు పలుకుతోంది. నర్సీపట్నం పెద్దచెరువు పూర్తిగా నిండిన తరవాత అదనపు నీరు పొర్లుకట్ట మీదుగా గెడ్డ ద్వారా ధర్మసాగరం పెద్దచెరువులో ప్రవేశిస్తుంది. గెడ్డ దాదాపు పట్టణ ప్రాంతంలోనే ఉంది. గతంలో నర్సీపట్నం పెద్దచెరువు గర్భాన్ని దాదాపు ఏడెకరాల మేర ఆక్రమించేశారు. 23 ఎకరాల్లో పేదలు ఇళ్లు కట్టుకున్నారు. ఈ చెరువు మరింత ఆక్రమణకు గురి కాకుండా దశాబ్దం క్రితమే అయ్యన్న గట్టు వేయించారు. దీంతో ఆక్రమణలకు అడ్డుకట్ట పడింది. నర్సీపట్నం పెద్దచెరువు 121.04 ఎకరాల విస్తీర్ణం ఉంది. గతంలో 345.26 ఎకరాల ఆయకట్టు ఉండేది. పట్టణీకరణ నేపథ్యంలో పంటభూముల్లో ఇళ్లు వెలిశాయి. ప్రస్తుతం ఆయకట్టు 140 ఎకరాలు మాత్రమే. ధర్మసా గరం చెరువు గ్రామీణ ప్రాంతంలో ఉంది. 101 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువుకింద అధికారికంగా 260 ఎకరాల ఆయకట్టు ఉన్నా, అనధికారికంగా మరో వంద ఎకరాల వరకు సాగుతున్నాయి.

**లింకు చెరువులను కాపాడేందుకే** లింకు చెరువులను కాపాడే ప్రతిపాదన ఆమోదం పొందగానే పనులు మొదలవుతాయి. సాగునీటి వనరులకు అవసరమైన చోట మరమ్మతులు చేయించేందుకు ప్రభుత్వం నిధులిచ్చింది. పనులు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నాం. సాగునీటి చెరువులు, కాలువలు ఆక్రమణకు గురి కాకుండా పర్యవేక్షణ పెంచాం. ఎక్కడైనా ఆక్రమణలు చోటుచే సుకుంటే చర్యలు తీసుకుంటాం. బాలసూర్యం, డీఈఈ, జలవనరుల శాఖ

# పన్నుల గుదిబండ దించితేనే

చిత్తూరు : చిత్తూరు గ్రానైట్‌కు మంచి గిరాకీ ఉండేది.. ఉమ్మడి జిల్లా నుంచి పలు రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. వ్యాపారం లాభసాటిగా సాగేది. గత వైకాపా ప్రభుత్వ విధానాలతో వందల పరిశ్రమలు మూతపడ్డాయి.. వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు.. ఆ పరిస్థితి నుంచి ఇంకా కోలుకోలేదు. కూటమి ప్రభుత్వం పైనే గ్రానైట్ పరిశ్రమ నిర్వాహకులు ఆశలు పెట్టుకున్నారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో కుప్పం, పలమనేరు, బంగారుపాళ్యం, గుడిపాల, యాదమరి, జీడీనెల్లూరు, పాలసముద్రం, వెదరుకుప్పం, ఎస్.ఆర్.పురం ప్రాంతాల్లో పరిశ్రమలు ఉండేవి. గత ప్రభుత్వం తెచ్చిన విధానాలతో నిర్వహణ భారమై ప్రస్తుతం 175 మాత్రమే నడుస్తున్నాయి. అప్పట్లో నాలుగు సార్లు విద్యుత్తు ఛార్జీలు పెంచడంతో నెలకు ఒక్కో పరిశ్రమకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు బిల్లు వచ్చేది. ప్రైవేట్ వారికి రాయల్టీ వసూలు అప్పగించడంతో వృథాగా వెళ్లే గ్రానైట్ రాయికీ పన్ను వేసేవారు. ఒక్కో లారీకి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకూ ప్రభుత్వం 18 శాతం పన్ను వసూలు చేసేది. గ్రానైట్, టైల్స్‌కు రాజస్థాన్ రాష్ట్రంలో 5 శాతమే పన్ను ఉండటంతో అక్కడ తక్కువ ధరకే లభిస్తోంది. దీంతో ఇక్కడి గ్రానైట్‌కు డిమాండ్ తగ్గి పరిశ్రమలు



మూతపడ్డాయి. కొందరు బాడుగకు ఇస్తున్నారు. మరికొందరు యంత్రాలను తక్కు కింద విక్రయిస్తున్నారు.

**మూతపడినా భారం..**

పరిశ్రమలు మూతపడినా ఒక్కో దాని నుంచి రూ.18 వేలు వసూలు చేస్తున్నారు. వైకాపా ప్రభుతంలో తీవ్రంగా నష్టపోయామని, కూటమి ప్రభుత్వమైనా ఆదుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

**పన్ను తగ్గించాలి..** వైకాపా హయాంలో అమలు చేసిన విధానాలను రద్దు చేయాలి. ప్రధానంగా పన్ను భారం తగ్గించాలి.

– రహీమ్, గ్రానైట్ పరిశ్రమ నిర్వాహకులు

**నెలలో 15 రోజులే పని..**

గతంలో నెలలో 25 రోజులు గ్రానైట్ పాలిషింగ్ పని ఉండేది. ఇప్పుడు 15 రోజులు కూడా ఉండటం లేదు. జీవనం భారంగా మారింది.– మునికృష్ణ, కార్మికుడు

**పర్మిట్ల మంజూరులో మార్పు**

గ్రానైట్‌కు పర్మిట్లు ఇదివరకు ప్రైవేటు సంస్థ ఇచ్చేది. వారి గడువు ముగియడంతో మా శాఖ ద్వారానే ఇస్తున్నాం. ఇతర విధానాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.– సత్యనారాయణ, డీడీ, మైన్స్

# అక్రమార్కుల చెరలో.. పురం చెరువులు



హిందూపురం : హిందూపురం పట్టణం విస్తరిస్తుండటంతో శివారుల్లోని చెరువులపై అక్రమార్కుల కన్ను పడింది. పట్టణంలో అంతర్భాగమైన కొట్నూరు, సూగూరు చెరువులు, సూరప్పకుంటలకు చెందిన రూ.కోట్లు విలువచేసే స్థలాలు ఇప్పటికే కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయి. ఈ విషయం ఆశాఖ అధికారులకు తెలిసినా అడ్డుకట్టవేయక పోవటంతో ఒకరిని చూసి మరొకరు నిర్మాణాలు చేపడుతూ చెరువులోపలికి వెళ్లిపోతున్నారు. గతంలో 80 అడుగులు ఉన్న చెరువు మరువ నీరు వెళ్లే కాలువలు ప్రస్తుతం 20 అడుగులకు చేరాయి. కాలువలకు అటూఇటూ నివాసం ఉన్న వారు మూసుకుంటూ ఇళ్లు నిర్మించుకొంటున్నారు. దీనిపై ఎలాంటి చర్యలు చేపట్టక పోవటంతో ఆక్రమణ దారుల ఇష్టారాజ్యంగా మారింది.

**తాజాగా సూగూరు గేట్ వద్ద..**

హిందూపురం పట్టణం సూగూరుగేట్ వద్ద బెంగళూరు ప్రధాన రహదారికి అతి సమీపంలో ఉన్న రూ.కోటి విలువ చేసే సూగూరు చెరువు మరువ స్థలాన్ని చిలమత్తూరు మండలం దేమకేతేపల్లికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి భర్త సోమవారం ఆక్రమించుకొనేందుకు ప్రయత్నించాడు. తనకు పట్టా ఇస్తామని చెప్పారని ఆఘమేఘాలపై దాదాపు నాలుగు సెంట్ల స్థలంలో నిర్మాణం చేపట్టేందుకు భూమి పూజ చేశాడు. దీనిపై స్థానికులు అభ్యంతరం చెప్పినా తనకు పెద్దలు చెప్పారని బుకాయించి చకచకా పునాదులు తవ్వి కంకర తరలించాడు. సోమవారం ఉదయం పునాది నిర్మించేందుకు రాళ్లు లారీలో తీసుకొని రావటంతో అప్రమత్తమైన సాగునీటి సంఘం ప్రతినిధులు చెరువు మరువ స్థలంలో నిర్మాణం ఎలా చేస్తారని అడ్డుకోవడంతో రాళ్లు వెనక్కి పంపారు. అనంతరం వారు తహసీల్దార్ వెంకటేశులుకు ఫిర్యాదు చేయటంతో ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు స్థలాన్ని పరిశీలించి చెరువు మరువ స్థలం అని నిర్ధారించి ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని ఆదేశాలిచ్చారు. దీంతో ఆక్రమణదారుడు పలాయనం సాగించాడు.

**ఇది రెండోసారి..**

పట్టణం బెంగళూరు ప్రధాన రహదారికి అతి సమీపంలో చెరువు మరువ స్థలం ఉంది. ఇప్పటికే ఈ స్థలం ఆక్రమణకు గురికాగా కొంత స్థలం మాత్రమే మిగిలింది. ఈ స్థలాన్ని గతంలో ఓ సంఘం వారు ఆక్రమించుకొనేందుకు ప్రయత్నించగా అప్పుడు అడ్డుకొన్నారు. ఈసారి ఆ స్థలంపై ఓ మాజీ ప్రజాప్రతినిధి భర్త కన్నుపడింది.

**ఎప్పటికప్పుడు చర్యలు తీసుకొంటున్నాం - యోగానంద్, డీఈ, ఇరిగేషన్**

చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదు వచ్చిన వెంటనే వాటిని అడ్డుకొని ఆక్రమణలు నిరోధిస్తున్నాం. ఇప్పటికే అనేకచోట్ల ఆక్రమణకు గురైన చెరువు ప్రాంతాలను తిరిగి తమ పరిధిలోకి తీసుకొన్నాం. చెరువు స్థలాలు, కాలువలను ఎవరు ఆక్రమించినా వారిపై ఉన్నతాధికారుల సహకారంతో చర్యలు తీసుకొంటున్నాం.

# ప్రగతి మాటున అవినీతి



గుత్తి : గుత్తి పురపాలిక పరిధిలో ప్రగతి పనుల పేరుతో అవినీతికి ఆజ్యం పోశారు. తమకు పర్సెంటేజీలు వస్తే చాలన్న రీతిలో ఇంజినీర్లు పని చేశారు. మిగులుబాటు అయితే చాలని గుత్తేదారులు నాసిరకంగా పనులు చేశారు. గడిచిన వైకాపా అయిదేళ్ల పాలనలో ఇదే జరిగింది. ప్రధానంగా మురుగు కాలువలు, సిమెంట్‌రోడ్ల నిర్మాణాల్లో పెద్ద ఎత్తున అవినీతికి పెద్దపీట వేశారు. ఆయా పనులన్నీ శిథిలమయ్యాయి. గుత్తి పురపాలికలో సుమారు రూ.5 కోట్ల విలువైన పనులు జరిగాయి. ఆయా పనులన్నీ కల్వర్టులు, మురుగు కాలువలు, సీసీ రోడ్ల పనులే అత్యధికం. వైకాపా ప్రభుత్వం ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున కేటాయించగా ఆ పనులన్నీ ఒకే గుత్తేదారుడు కైవసం చేసుకుని నిధులను దండుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయా పనుల్లో అవినీతికి పెద్ద పీట వేశారన్న విమర్శలున్నాయి.

**క్షేత్రస్థాయిలో ఎక్కడెక్కడంటే?**

ఏడాది కిందట రూ.2 కోట్లతో గుత్తి, గుత్తిఆర్.ఎస్, చెట్నేపల్లిలో మురుగు కాలువలు, సిమెంట్ రోడ్లు నిర్మించారు. చెట్నేపల్లిలోని దళిత వాడలో రూ.15 లక్షలతో నిర్మించిన మురుగు కాలువకు క్యూరింగ్ చేయలేదు. గుంతకల్లుకు చెందిన గుత్తేదారు హడావుడిగా పనులు చేసి బిల్లులు దండుకున్నాడు. ప్రస్తుతం ఆ కాలువ సిమెంట్ పెచ్చులూడి కంకర తేలింది. ఏడాది కాకముందే శిథిమైంది.

గుత్తిలోని మారుతీ నగర్‌నూ మురుగు కాలువలు పనికి రాకుండా పోయాయి. గుత్తిఆర్.ఎస్.లోని యూనియన్ బ్యాంకు సమీపంలో నిర్మించిన కాలువలను కొందరు పూడ్చి వేశారు.

గుత్తిలో ఆర్థిక సంఘం నిధులు రూ.25 లక్షలతో రెండేళ్ల కిందట అవసరం లేని చోట కాలువలు నిర్మించారు. అక్కడ మురుగు నీరు పారే పరిస్థితి లేదు. ఆ కాలువ ఇప్పటికీ నిరుపయోగంగానే ఉంది. ఐదేళ్ల కిందట ఎంపీ నిధులతో అనంతపురం రోడ్డులోని ఓ కళాశాల వసతి గృహం వద్ద నిర్మించిన సిమెంట్ రోడ్డు అప్పుడే పాడైపోయింది. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని మండల ఇంజినీర్‌ను ఉన్నతాధికారులు అప్పట్లో సస్పెండ్ చేశారు.

**నాణ్యతా ప్రమాణాలను బట్టే బిల్లులు**

–జబ్బార్‌మియా, కమిషనర్, గుత్తి

ప్రగతి పనుల్లో ఎక్కడా అవినీతి, అక్రమాలకు తావివ్వడం లేదు. పనులన్నీ నాణ్యతగానే చేయిస్తున్నాం. స్థానిక ఇంజినీర్లతోపాటు థర్డ్‌పార్టీ ఇంజినర్లు తనిఖీ చేసిన తరువాతే గుత్తేదారులకు బిల్లులు ఇస్తున్నాం. లోపాలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం.

# 127 గ్రామాల్లో తాగునీటికి కటకట!



అనంతపురం : గ్రామీణ పరిధిలోని 16 గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఈమేరకు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఆయా గ్రామాల్లో 66,597 మంది నివాసం ఉంటున్నారు. రోజుకు ఒక్కొక్కరికి సగటున 15 లీటర్లు అవసరం. వారికి నిర్దేశిత లీటర్లు అందుబాటులో లేవు. కంబదూరు మండలంలోని 12 గ్రామాల పరిధిలో 25,381 మంది ఉన్నారు. ఆయా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో భూగర్భజలాలు అడుగంటి బోర్లు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో తాగునీటి సమస్య తలెత్తే పరిస్థితులు నెలకొన్నాయి. ఈక్రమంలో ఏయే గ్రామాల్లో సమస్య రానుందో పరిశీలించి నివేదిక పంపాలని జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలోని 31 మండలాల పరిధి 127 గ్రామాల్లో సమస్య నెలకొనే పరిస్థితి ఉందని అధికారులు నివేదిక పంపారు. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాల్సి ఉంటుందని.. ఇందుకు రూ.5.87 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. మండలాల వారీగా తాగునీటి ఎద్దడి తలెత్తనున్న గ్రామాలను పరిశీలిస్తే... అనంతపురం గ్రామీణ మండలంలో 16, కంబదూరు 12, బుక్కరాయసముద్రం 6, శింగనమల 9, గార్లదిన్నె 4, నార్పల 8, పుట్లూరు 6, యల్లనూరు 8, కుందుర్పి 5, శెట్టూరు 5, బ్రహ్మసముద్రం 3, కళ్యాణదుర్గం 8, ఉవరకొండ 4, విడపనకల్లు 5, కూడేరు 5, ఆత్మకూరు 6, రాప్తాడు 2, గుత్తి 6, గుంతకల్లు 6, బెళుగుప్ప 1, పామిడి మండలంలోని ఒక గ్రామంలో దాహం కేకలు వినిపించే అవకాశాలు ఉన్నాయి. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోతే సమస్య మరింత జఠిలం అలయ్యే ప్రమాదం పొంచి ఉంది.

**ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం..**

– సురేష్, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్, అనంతపురం

వేసవి ప్రారంభం నుంచి ముగిసే వరకూ తాగునీటి సమస్య ఎదురయ్యే గ్రామాలను గుర్తించాం. వాటి వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి పంపాం. ఎక్కడైనా సమస్య తలెత్తినా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం.

# బడుగుల ప్రాంతాల్లో బంగారు బాటలు

చిత్తూరు : నాణ్యమైన సామాజిక ఆస్తుల సృష్టి, గ్రామీణ పేదలకు జీవనోపాధి కల్పించేందుకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టారు. ఈ పథకం అమలు లక్ష్యానికి వైకాపా పాలనలో గండి కొట్టగా.. కూటమి ప్రభుత్వం పట్టా లెక్కించింది. ఈ క్రమంలోనే జిల్లావ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మట్టి రోడ్ల స్థానే సిమెంట్ రహదారులు నిర్మించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో స్థానిక శాసనసభ్యులనూ భాగస్వాములుగా చేసి.. ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

2014– 19 మధ్య తెలుగుదేశం అధికారంలో ఉన్న సమయంలోనూ ఎస్సీ, ఎస్టీ కాలనీలపై ప్రధానంగా దృష్టి సారించారు. ఉపాధిహామీ పథకం కింద అడిగినన్ని నిధులు ఇచ్చి మట్టి రోడ్ల స్థానంలో సిమెంట్ రహదారులు నిర్మించడంతో ఈ ప్రాంతాల ముఖచిత్రమే మారిపోయింది. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక రోడ్లు వేసేందుకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. చెరువుల్లో యంత్రాలతో పనిచేసి నిధులు కాజేశారు. గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఇవి ఓ దశకు చేరిన తర్వాత బిల్లులు ఇవ్వలేదు. దీంతో జిల్లావ్యాప్తంగా కొన్ని సచివాలయాల్లో మాత్రమే కొంతవరకు పూర్తయ్యాయి. మిగతా వాటిలో మండలానికి ఒకట్రెండు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి.

**గృహ నిర్మాణ.. పంచాయతీరాజ్ శాఖకు బాధ్యతలు**

ప్రస్తుతం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఎక్కడెక్కడ మట్టి రోడ్లు ఉన్నాయనే వివరాలు సేకరించాలని గృహ నిర్మాణ సంస్థ అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఈ సమాచారాన్ని పంచాయ



తీరాజ్ శాఖకు పంపి నిర్మాణ వ్యయం అంచనా వేస్తారు. ఆపై డ్వామాకు వివరాలు సమర్పిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సింహభాగం నిధులు ఖర్చు చేసినందున 2025– 26 బడ్జెట్ నుంచి వెచ్చిస్తారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి పూర్తిస్థాయిలో పనులు మొదలయ్యే అవకాశం ఉంది.

**వీలైనంత త్వరగా నిర్మిస్తాం**

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మట్టి రోడ్లు ఉండకూడదన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు యత్నిస్తున్నాం. వీలైనంత త్వరగా వివరాలివ్వాలని గృహ నిర్మాణ, పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించాం. అంతే వేగంగా నిధులు మంజూరు చేస్తాం.. సిమెంట్ రహదారులు నిర్మించి ఆవాసాల్లో ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– సుమిత్‌కుమార్, కలెక్టర్

**ఎమ్మెల్యేలూ వివరాలు ఇవ్వాలంటూ**

ఆయా నియోజకవర్గాల్లోని శాసనసభ్యులు తమ పరిధిలోని ఏయే ప్రాంతాల్లో రహదారులు వేయాలనే ప్రతిపాదనలు ఇవ్వాలని ఇప్పటికే సూచించారు. గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ ఇటీవల వివరాలు సమర్పించారు. మిగతావారూ త్వరగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని యంత్రాంగం ఒత్తిడి చేస్తోంది.

# ఇసుక తవ్వేయ్.. మట్టి కొల్లగొట్టేయ్

తిరుపతి: ప్రకృతి వనరుల దోపిడీని ఉపేక్షించనని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే హెచ్చరిస్తున్నా అక్రమార్కులు తీరు మార్చుకోవడం లేదు. మట్టి, గ్రావెల్, ఇసుక.. ఇలా ఏ సహజ వనరునైనా మాఫియా కొల్లగొడుతోంది. జిల్లా కేంద్రానికి సమీపంలోని చంద్రగిరి నియోజకవర్గంలో ఈ విధ్వంసం జరుగుతోంది. పట్టపగలే ఇసుక ట్రాక్టర్లు, మట్టి, గ్రావెల్ టిప్పర్లు దూసుకెళుతున్నాయి. ముఖ్య నేతలకూ వాటాలు అందుతుండటంతో రెవెన్యూ, గనుల శాఖల అధికారులు నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారనే ఆరోపణలున్నాయి.

నదులు, వాగులు, వంకలున్న ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకునే వ్యక్తులు ఉచితంగా ఇసుక తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం ఆదేశించగా.. ఈ ముసుగులో అక్రమార్కులు దందా చేస్తున్నారు. చంద్రగిరి మండలం శానంభట్ల, చంద్రగిరి, బుచ్చినాయుడుపల్లి, నాగయ్యగారిపల్లి, రెడ్డివారిపల్లి, భీమవరం, నడింపల్లి, రంగంపేట కేంద్రంగా అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారు. తిరుపతి గ్రామీణ మండలంలో దుర్గసముద్రం, సి.గొల్లపల్లి, చిగురువాడ తదితర ప్రాంతాల్లో తవ్విన ఇసుకను చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాలకు రవాణా చేస్తున్నారు. స్థానికంగా రూ.3వేల వరకు, తిరుపతిలో రూ.5వేల వరకు విక్రయిస్తున్నారు. ఎక్కడెక్కడంటే..చంద్రగిరి మండలంలో గంగుడుపల్లి, భీమవరం, రంగంపేట, నాగపట్ల, మడపంపల్లిబీ రామచంద్రాపురం మండలంలో పిల్లారికోన, ఎల్వీపురం, బొప్పరాజుపల్లి, సి.రామాపురం, నెత్తకుప్పంలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి.

రోజూ మూడు మండలాల నుంచి దాదాపు 250– 300 టిప్పర్ల మేర మట్టి, గ్రావెల్‌ను తరలిస్తున్నారు.

ఒక్కో టిప్పర్‌ను స్థానికంగా అయితే రూ.2వేలు– రూ.3వేలకు విక్రయిస్తున్నారు. తిరుపతి నగరంలోని వెంచర్లకు రూ.5వేలు– రూ.6వేలకు అమ్ముతున్నారు.

రోజూ రమారమి రూ.10 లక్షలు– రూ.12 లక్షల విలువైన మట్టి, గ్రావెల్‌ను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు.

నెలకు రూ.3 కోట్లు– రూ.3.50 కోట్ల విలువ చేసే ప్రకృతి సంపద మాయమవుతోంది.

స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చిన సందర్భాల్లో రెవెన్యూ, పోలీసు, గనుల శాఖల అధికారులు అడపాదడపా నాలుగైదు ట్రాక్టర్లు, టిప్పర్లు స్వాధీనం చేసుకుని మమ అనిపిస్తున్నారు.

సమాచారం చేరవేస్తూ..

మద్యం, ఇసుక, గ్రావెల్, మట్టి, గ్రానైట్ అక్రమ తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని ప్రభుత్వం తరచూ చెబుతోంది.

వాహనాలు సీజ్ చేయడంతోపాటు భారీ జరిమానాలు విధించాలనే నిబంధనలున్నా.. సంబంధిత యంత్రాంగం ఫిర్యాదులు వచ్చిన సందర్భాల్లో దందాలకు పాల్పడుతోన్న వ్యక్తులకు సమాచారం ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. తర్వాత తీరిగ్గా వెళ్లి తనిఖీలు చేసి తవ్వకాలే జరగడంలేదని ఉన్నతాధికారులకు సమాధానమిస్తున్నారు.

తీరు మార్చుకుంటేనే అడ్డుకట్ట

అధికారులు తమ వైఖరి మార్చుకుంటేనే అక్రమ తవ్వకాలు, రవాణాకు అడ్డుకట్ట పడుతుంది. ఇటీవల రామచంద్రాపురం మండలంలో అనధికారికంగా జరుగుతోన్న మట్టి తవ్వకాలపై రెవెన్యూ, గనుల శాఖ అధికారులతో సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేశారు. ఎవరెవరికి.. ఎక్కడెక్కడ, ఎంత విస్తీర్ణంలో అనుమతులు ఇచ్చారు? ప్రస్తుతం అక్కడ ఎంతవరకు తవ్వకాలు జరిగాయో తెలపాలని సూచించారు. అనుమతులు తీసుకోకుండా ఏయే ప్రాంతాల్లో మట్టి తీస్తున్నారో కూడా గుర్తించాలన్నారు.ఇదేవిధంగా చంద్రగిరి, తిరుపతి గ్రామీణ మండలాల్లోనూ కమిటీలను నియమిస్తే ప్రయోజనం ఉంటుంది.

వాహనాలు సీజ్ చేయడంతోపాటు బాధ్యులపై కేసులు నమోదు చేస్తే దారిలోకి వస్తారు.

చురకలు



## టెన్నిస్ రాకెట్ పట్టిన ముద్దుగుమ్మ

ఈమధ్య కాలంలో తెలుగు సోషల్ మీడియాలో దేవియాని శర్మ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఈమె సేవ్ ది టైగర్స్‌లో నటించడం ద్వారా ఒక్కసారిగా పాపుతారిటీని సొంతం చేసుకుంది. అంతకు ముందు ఈమె పలు సినిమాల్లో, సిరీస్‌ల్లో నటించినప్పటికీ రాని గుర్తింపు సేవ్ ది టైగర్స్ వెబ్ సిరీస్‌తో దక్కించుకుంది. మొదటి సీజన్‌లో నటనతో ఆకట్టుకున్న ఈమె ఆ తర్వాత అందంతో అలరించింది. తక్కువ సమయంలోనే సోషల్ మీడియాలో అత్యధిక ఫాలోవర్స్‌ను సొంతం చేసుకున్న ఈ అమ్మడు టాలీవుడ్‌లో వరుస ఆఫర్ల కోసం వెయిట్ చేస్తోంది. త్వరలోనే ఈమె మరో సినిమా, సిరీస్‌లో నటించబోతున్నట్లు తెలుస్తోంది. సేవ్ ది టైగర్స్ వెబ్ సిరీస్‌లో శ్రీమతి పాత్రలో కనిపించి పద్దతి అయిన ఔట్ ఫిట్‌లో కనిపించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. అయితే ఈమె సోషల్ మీడియాలో షేర్ చేసే ఫోటోలు మాత్రం హీట్ పెంచే విధంగా ఉంటాయి. వెబ్ సిరీస్‌లో చూసిన దానికి, ఈమె షేర్ చేసే ఫోటోలకు చాలా భిన్నంగా ఉంటుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. ఈ మధ్య కాలంలో ఈమె ఇన్‌స్టాలో షేర్ చేస్తున్న ఫోటోలు, వీడియోలు



రెగ్యులర్‌గా వైరల్ అవుతూ వస్తున్నాయి. ముఖ్యంగా ఈమె స్కిన్ షో ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తూ చూపు తిప్పుకోనివ్వడం లేదు అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో దేవియాని శర్మకు దాదాపు రెండున్నర లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. వరుసగా ఈమె షేర్ చేస్తున్న అందమైన ఫోటోల కారణంగా, సమ్మర్‌లో మరింత హీట్ పెంచే విధంగా ఈమె షేర్ చేస్తున్న పోటోల కారణంగా మరింత వైరల్ అవుతూ వస్తోంది. విభిన్నమైన ఔట్ ఫిట్ ధరించడం ద్వారా ఎప్పుడూ వైరల్ అవుతూ ఉంటుంది. తాజాగా మరోసారి ఈమె అందమైన ఫోటోలను షేర్ చేసింది. తాజా ఫోటోల్లో టెన్నిస్ రాకెట్ చేతిలో పట్టి, పొట్టి స్కర్ట్ ధరించి ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. నడుము అందం చూపిస్తూ కవ్వించే చూపులతో దేవియాని శర్మ స్టార్ హీరోయిన్ మెటీరియల్ అన్నట్లుగా కామెంట్స్ దక్కించుకుంటుంది. ఇంత అందంగా ఉన్న దేవియాని శర్మకు పెద్దగా ఆఫర్లు రాకపోవడం విడ్డూరంగా ఉంది అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. టాలీవుడ్‌లో ప్రస్తుతం ఉన్న హీరోయిన్స్‌లో చాలా మందితో పోల్చితే దేవియాని శర్మ చాలా అందంగా ఉంది అంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో దేవియాని శర్మ ఇదే స్థాయిలో అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటే ఏదో ఒక రోజు ఈమె కచ్చితంగా మంచి గుర్తింపు దక్కించుకోవడం మాత్రమే కాకుండా నటిగానూ బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయంటూ మీడియా సర్కిల్స్ వారు అంటున్నారు.

## శ్రీలీల లవ్.. ట్విస్ట్ ఇచ్చిన యువ హీరో!

బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్, టాలీవుడ్ యంగ్ బ్యూటీ శ్రీలీల.. ప్రేమలో మునిగి తేలుతున్నట్లు కొద్దిరోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం అనురాగ్ బసు దర్శకత్వంలో శ్రీలీల తన బీటౌన్ డెబ్యూ మూవీ చేస్తుండగా.. అందులో కార్తీక్ హీరోగా నటిస్తున్నారు. ఆ మూవీ షూటింగ్ టైమ్ లోనే ఇద్దరూ లవ్ లో పడ్డట్టు టాక్ వచ్చింది. ఆ తర్వాత మూవీ షూటింగ్ కు సంబంధించిన కొన్ని ఫోటోలు ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అందులో ఇద్దరూ చాలా క్లోజ్ గా కనిపించారు. అంతకుముందు కార్తీక్ తల్లి ఓ కార్యక్రమంలో తనకు కాబోయే కోడలు గురించి మాట్లాడారు. ఓ మంచి డాక్టర్ ను తమ ఇంటి కోడలిగా



చేసుకోవాలనుందని అన్నారు. రీసెంట్ గా శ్రీలీల.. ఇన్ స్టాగ్రామ్ చిట్ చాట్ లో ప్రేమపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. దీంతో శ్రీలీల, కార్తీక్ లవ్ లో ఉన్నారని అంతా ఫిక్సయిపోయారు. అయితే తాజాగా కార్తీక్ ఆర్యన్ ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మరో విషయంపై మాట్లాడుతూ.. తనకు ఇండస్ట్రీలో గర్ల్ ఫ్రెండ్ లేదని తెలిపారు. అయితే కార్తీక్ రూ.50 కోట్ల రెమ్యునరేషన్ తీసుకున్నట్లు కొద్ది రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. దీనిపై స్పందించిన ఆయన.. ఇండస్ట్రీలో అంత పారితోషికం తీసుకునే నటుడు తాను ఒక్కడినేనా అని క్వశ్చన్ చేశారు. ఇంకా చాలా మంది ఉన్నారని అన్నారు. కానీ వారి గురించి ఎవరూ వార్తలు రాయరని అన్నారు. తనకు ఇండస్ట్రీలో ఎవరి సపోర్ట్ లేదని, అందుకే అలాంటి వార్తలు రాస్తారని వ్యాఖ్యానించారు. ఎలాంటి సినీ బ్యాక్ గ్రౌండ్ లేకుండా వచ్చిన తనకు ఇండస్ట్రీలో అన్నదమ్ములు, ఫ్రెండ్స్, గర్ల్ ఫ్రెండ్ లేరని తెలిపారు. రూమర్స్ క్రియేట్ చేయడానికి కొందరు ఎప్పుడూ రెడీగా ఉంటారని, తమకు నచ్చని వారి కోసం అలా చేస్తారని చెప్పారు. అయితే తన కామెంట్స్ లో శ్రీలీల పేరు ఎక్కడా కార్తీక్ ఆర్యన్ ప్రస్తావించకపోయినా.. సినీ ఇండస్ట్రీలో గర్ల్ ఫ్రెండ్ లేదని చెప్పడం గమనార్హం. కానీ నెటిజన్లు మాత్రం ఇద్దరూ లవ్ లో ఉండడం నిజమేనని అంటున్నారు. మొత్తానికి శ్రీలీల, కార్తీక్ లవ్ మ్యాటర్ హాట్ టాపిక్ గా మారింది. మరి ఆ విషయంలో అసలు నిజమేంటో వాళ్లకే తెలియాలి.





## ఆ స్టార్ హీరోలు రిస్క్ తీసుకోవడం లేదుగా!



టాలీవుడ్ స్క్రీన్ పై మాస్ అప్పిరియన్స్ కొత్తేం కాదు. మాస్ కంటెంట్ లో హీరోలు బాక్సాఫీస్ ని రప్ఫాడించిన సందర్భాలెన్నో. రామ్ చరణ్, ఎన్టీఆర్, ప్రభాస్, బన్నీ లాంటి స్టార్ హీరోలు ఎప్పుడో మాస్ ని పరిచయం చేసారు. ఆ తర్వాత తెరపై మాస్ అనేది వివిధ రకాలుగా రూపాంతరంచెందుతూ వచ్చింది. మాస్ లో కొత్త ఆవిష్కరణలకు తెర తీసారు. రంగస్థలంలో రామ్ చరణ్, అర్జున్ రెడ్డిలో విజయ్ దేవరకొండ, పుష్పలో అల్లు అర్జున్, దసరాలో నాని ఇలా సరికొత్త ఆవిష్కరణలు జరిగాయి. ఇవన్నీ భారీ విజయం సాధించిన చిత్రాలు. దీంతో అదే ట్రెండ్ గా మారింది. తాజాగా రామ్ చరణ్ 16వ చిత్రం పెద్దిలోనూ చరణ్ మాస్ లుక్ కాక పుట్టిస్తోన్న సంగతి తెలిసిందే. చిట్టిబాబు ను మంచిన రగ్గడు పాత్రను పెద్దిలో చరణ్ పోషిస్తున్నాడని గ్లింప్స్ తో తేలిపోయింది. అలాగే అక్కినేని వారసుడు అఖిల్ కూడా లెనిన్ తో మాస్ ని ట్రై చేస్తున్నాడు. రాయలసీమ బ్యాక్ డ్రాప్ స్టోరీలో అకిల్ రోల్ ని ఊరమాస్ గా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. మెగా మేనల్లుడు సాయితేజ్ కూడా సంబరాల ఏటిగట్టు కోసం మాస్ ని గట్టిగానే ప్లాప్ చేసాడు . అతడి భారీ దేహం గుబురు గెడ్డం కటౌట్ చూస్తుంటే మామూలు మాస్ కాదది. ఇంకా యంగ్ హీరో సాయి శ్రీనివాస్ భైవర కోసం ఎక్కడా తగ్గలేదు. శ్రీనివాస్ మాస్ లుక్ అదిరిపోయింది. అతడి కటౌట్ కి తగ్గ సరైన రోల్ గా హైలైట్ అవుతుంది. అయితే సినిమాల్లో ఈ మాస్ యాంగిల్ అన్నది కథ కోసమైతే పర్వాలేదు. కానీ ట్రెండ్ ని ఫాలో అయి మాస్ యాంగిల్ ట్రై చేస్తే గనుక చేతులు కాల్చుకోవడం ఖాయమనే విమర్శ కూడా వ్యక్తమవుతుంది. మాస్ పాత్రలతో ప్రేక్షకులకు దగ్గరవ్వొచ్చు అన్నది పాత పద్దతి. ప్రేక్షకుడు ఇప్పుడు కథలో దమ్ము ఎంతుందో విశ్లేషిస్తున్నాడు. అనవసర ఎలివేషన్ సన్నివేశాలకు కనెక్ట్ అవ్వడం లేదు. కథకి ఆ సీన్ ఎంత డిమాండ్ చేస్తుంది? అని లోతైన విశ్లేషణ కూడా అంతే అవసరం అని ఆలోచించే స్థాయికి కామన్ ఆడియన్ రీచ్ అయ్యాడు. ఇవన్నీ మేకర్స్ దృష్టిలో పెట్టుకుని ప్రేక్షకుడిని ఎంగేజ్ చేయాల్సి ఉంటుంది సుమీ.

## త్రిష-ఛార్మి: 20 ఏళ్లుగా కాల పరీక్షను తట్టుకుని!




రెండు దశాబ్దాలకు పైగా సౌత్ సినిమాని ఏలిన త్రిష ఇప్పటికీ అగ్ర నాయికగా కెరీర్ రన్ కొనసాగిస్తోంది. అయితే తన స్నేహితురాలు ఛార్మి కౌర్ మాత్రం నటనకు దూరమై, ప్రస్తుతం నిర్మాతగా కొనసాగుతున్నారు. గ్రేట్ ఫ్రెండ్స్ త్రిష- చార్మి మధ్య స్నేహబంధం కాలపరీక్షను తట్టుకుని నిలబడటం చర్చగా మారింది. త్రిష ఎంత పెద్ద స్టార్ అయినా తన స్నేహితులను అస్సలు విడిచిపెట్టరనడానికి ఇది ఒక ఉదాహరణ. చాలా మంది సహెూద్యోగులతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగిస్తున్నా.. ఏళ్లతరబడి కొద్దిమందితో మాత్రమే సన్నిహిత బంధాన్ని కొనసాగించగలరు.

అటువంటి శాశ్వత స్నేహం త్రిషకు నటి చార్మీ కౌర్‌తో ఉంది. ఇటీవలి ఎగ్జయిటింగ్ ఇన్‌స్టా పోస్ట్ దీనికి ప్రూఫ్. నిజానికి తమిళం నుంచి తెలుగు పరిశ్రమకు వచ్చారు ఛార్మి. కాదల్ అళివతిల్లైలో సింబు సరసన తమిళంలోకి అడుగుపెట్టిన చార్మీ తరువాత కాదల్ కిసు కిసులో కనిపించారు. తరువాత టాలీవుడ్‌పై దృష్టి సారించి ఇక్కడ ఛార్మి అగ్రనటిగా స్థిరపడ్డారు. తరువాత నిర్మాతగాను మారారు. ఈ ప్రయాణం ఎలా ఉన్నా కానీ త్రిషతో ఛార్మి వ్యక్తిగత బంధం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ స్నేహం కాల పరీక్షను తట్టుకుని నిలిచిందంటూ చర్చ సాగుతోంది. ఇటీవల త్రిష – చార్మి చాలా కాలం తర్వాత తిరిగి కలిశారు. ఇద్దరూ తమ రీయూనియన్ సెలబ్రేషన్ ని ఇన్‌స్టాగ్రామ్‌లో ఫోటోల రూపంలో షేర్ చేసారు. 20 సంవత్సరాలకు పైగా గడిచినప్పటికీ వారి స్నేహం ఎలా బలంగా ఉందో వారి పోస్టలలో కనిపిస్తోంది. 20 సంవత్సరాల తర్వాత కూడా మా స్నేహం బలంగానే ఉంది అని ఛార్మి తన పోస్ట్ లో రాశారు, దీనికి త్రిష కూడా ఆనందం వ్యక్తం చేసారు. ఈ అపురూపమైన స్నేహితుల మాటలు అభిమానుల హృదయాలను తాకాయి. నిరంతరం మారుతున్న ఇండస్ట్రీ స్నేహాల విలువను ఈ పునఃకలయిక హైలైట్ చేసింది. ప్రస్తుతం ఛార్మి– త్రిష జోడీ ఫోటోలు వైరల్ గా మారుతున్నాయి. అభిమానులు వారి అవినాభావ బంధాన్ని ప్రశంసిస్తున్నారు. సంబంధాలు ఇలా వచ్చి అలా వెళ్లి పోయే పరిశ్రమలో త్రిష – చార్మి స్నేహానుబంధం అందమైన ఉదాహరణగా నిలుస్తుంది. రెండు దశాబ్దాల తర్వాత కూడా ఒకరిపై ఒకరు నిజమైన స్వచ్ఛమైన ప్రేమ, అభిమానాలను ప్రదర్శించడం అందరినీ ఆకట్టుకుంటోంది. నిజమైన స్నేహం కాల పరీక్షను తట్టుకోగలదని అభిమానులకు గుర్తు చేసింది.

## టైట్ డ్రెస్‌లో అందాల కృతి

మహేష్ బాబుకి జోడీగా '1 : నేనొక్కడినే' సినిమాలో హీరోయిన్‌గా నటించి సినిమా ఇండస్ట్రీకి పరిచయం అయిన ముద్దుగుమ్మ కృతి సనన్. మొదటి సినిమా నిరాశ పరచడంతో బాలీవుడ్‌లో ఈ అమ్మడు ప్రయత్నాలు చేసింది. లక్కీగా ఈ అమ్మడికి హిందీలో 'హీరోపంతి' సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో బాలీవుడ్‌లో ఒక్కసారిగా బిజీ అయింది. తెలుగులో దోచెయ్ సినిమాలో నటించిన ఈమెకు మరోసారి తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి నిరాశే మిగిలింది. దోచెయ్ సినిమా తర్వాత టాలీవుడ్‌కి దూరం అయింది. ప్రభాస్‌కి జోడీగా ఆదిపురుష్ సినిమాలో నటించిన విషయం తెల్సిందే. 2019లో ఏకంగా అర డజను సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన కృతి సనన్ ఆ తర్వాత కూడా ఏడాదికి కనీసం రెండు మూడు సినిమాలు చేస్తూ వచ్చింది. గత ఏడాది ఈమె నటించిన నాలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఈ ఏడాదిలో రెండు లేదా మూడు సినిమాలతో



ఈమె ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈమె తేరే ఇష్క్ మే సినిమాలో నటిస్తుంది. త్వరలోనే ఆ సినిమా విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. మరో రెండు సినిమాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఆ సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్ త్వరలోనే వచ్చే అవకాశాలు ఉన్నాయి. మరో వైపు ఈమె సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో కృతి సనన్‌కి దాదాపుగా ఆరు కోట్ల ఫాలోవర్స్‌ను కలిగి ఉంది. తక్కువ సమయంలోనే ఈమెకు ఈ స్థాయిలో ఫాలోవర్స్ దక్కారు. సోషల్ మీడియాలో అత్యధిక సంపాదన కలిగి ఉన్న హీరోయిన్స్‌లో ఈమె ఒకరు అనడంలో సందేహం లేదు. అందుకు తగ్గట్లుగానే ఈమె రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను, వీడియోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఆకట్టుకునే అందంతో పాటు, పొడుగు కాళ్ళ సుందరిగానూ పేరు దక్కించుకుంది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్‌లో ఈ అమ్మడు ముందు వరుసలో ఉంది. అత్యధిక పారితోషికం తీసుకునే హీరోయిన్స్ జాబితాలోనూ ఈమె ముందు ఉన్న విషయం తెల్సిందే. తాజాగా ఈమె టైట్ డ్రెస్‌లో అందంగా కనిపించి అలరించింది. స్కిన్ టైట్ డ్రెస్లో కొందరు ముద్దుగుమ్మలు ఎబ్బెట్టుగా ఉంటారు. కానీ ఈమె మాత్రం చాలా అందంగా ఉందనే కామెంట్స్ దక్కించుకుంది. ఈమె నటించిన మిమి సినిమాకు గాను జాతీయ అవార్డును సొంతం చేసుకున్న విషయం తెల్సిందే.

సరోగేట్ తల్లి పాత్రలో నటించి విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. జాతీయ అవార్డుతో పాటు ఉత్తమ నటిగా ఫిల్మ్ ఫేర్ అవార్డును సొంతం చేసుకుంది. ఆదిపురుష్ సినిమాలో సీత పాత్రలో నటించడం ద్వారా మంచి పేరు సొంతం చేసుకుంది. అదే సమయంలో ఆమె మేకోవర్, స్కిన్ షో విమర్శలు ఎదుర్కొంది. ప్రస్తుతం పలు బిగ్ ప్రాజెక్ట్‌ల్లో నటిస్తున్న ఈమె సౌత్ సినిమాల్లోనూ నటించేందుకు రెడీగా ఉంది. యంగ్ స్టార్ హీరోలకు జోడీగా ఈమె భవిష్యత్తులో నటించే అవకాశాలు ఉన్నాయా అనేది చూడాలి.

## కీర్తి లీగ్ లోనే ఉంది.. రుక్మిణి ఛాన్స్ కొట్టేసింది..!

మహానటిగా సినీ ప్రియుల మన్నలను పొందిన కీర్తి సురేష్ నటిగా తనని తాను ప్రూవ్ చేసుకుంటూ వచ్చింది. ఎలాంటి ఛాలెంజింగ్ రోల్ అయినా కూడా తన దాకా వస్తే పాత్రలో పరకాయ ప్రవేశం చేసి అదరగొట్టేస్తుంది అమ్మడు. ఐతే పెళ్లి తర్వాత ఎవరికైనా అవకాశాలు కాస్త సన్నగిల్లుతాయన్న పరిస్థితి ఉంటుంది. ఐతే కీర్తి సురేష్ విషయంలో కూడా అలాంటిది ఉంటుందని అనుకున్నారు. కానీ ఆమెకు వస్తున్న ఆఫర్లు చూస్తే అది నిజం కాదన్నదని అర్థమవుతుంది. ముఖ్యంగా పెళ్లైన కీర్తి సురేష్ ఒక ఆరు నెలలుగా ఎలాంటి కొత్త సినిమాకు సైన్ చేయలేదు. ఐతే ఆ టైం లో కీర్తి పని అయిపోయిందని అనుకున్నారు అందరు. కానీ వరుసగా ఆమె సైన్ చేసిన సినిమాల గురించి బయటకు వస్తున్న న్యూస్ లు చూసి అందరు షాక్ అవుతున్నారు. కీర్తి సురేష్ తెలుగులో రెండు భారీ సినిమాలకు సైన్ చేసిందని తెలుస్తుంది. కీర్తి ఇప్పటికే విజయ్ దేవరకొండతో



కలిసి జత కడుతున్నట్టు టాక్. విజయ్ దేవరకొండతో రవికిరణ్ కోలా డైరెక్షన్ లో వస్తున్న సినిమాలో కీర్తి లక్కీ ఆఫర్ అందుకుంది. ఈ సినిమాలో ముందు సప్త సాగరాలు దాటి హీరోయిన్ రుక్మిణి వసంత్ ని తీసుకోవాలని అనుకున్నారట. ఆ సినిమా కన్నడలో హిట్టైనా తెలుగులో ఆమెకు సూపర్ ఫ్యాన్స్ ఏర్పడ్డారు. ఈ క్రమంలో రుక్మిణికి రౌడీ హీరో సినిమా ఛాన్స్ వస్తుందని అనుకున్నారు. కానీ ఇప్పుడు రుక్మిణి కాదు ఆ అవకాశం కీర్తి సురేష్ కే ఇచ్చారని తెలుస్తుంది. ఇదే కాదు కీర్తి సురేష్ ఖాతాలో మరో క్రేజీ ప్రాజెక్ట్ వచ్చింది. బలగం సినిమా చేసిన వేణు యెల్దండి నెక్స్ట్ చేయబోతున్న ఎల్లమ్మ సినిమాలో కీర్తి సురేష్ ఆఫర్ పట్టేసిందట. ఈ సినిమాలో హీరోయిన్ పాత్రకు చాలా వెయిట్ ఉంటుందని తెలుస్తుంది. తప్పకుండా ఈ సినిమాలతో అమ్మడు అదరగొట్టబోతుందని టాక్. ఇవే కాదు స్టార్ లీగ్ లో తాను ఉన్నానని అనేలా అమ్మడు ప్రూవ్ చేసుకుంటుంది. తమిళ్ లో మొన్నటిదాకా సినిమాలు చేసిన కీర్తి సురేష్ తెలుగులో చివరగా భోళా శంకర్ సినిమా చేసింది. దసరాలో వెన్నెల పాత్రలో ఇంప్రెస్ చేసిన కీర్తి భోళా శంకర్ తో నిరాశపరచింది. ఇక ఆ తర్వాత నెక్స్ట్ సినిమాలతో మరోసారి ఆకట్టుకోబోతుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536